ఆగస్టు 1979

94

సృజన

ఆధునిక సాహిత్య వేదిక
మాస పత్రిక

ఈ సంచికలో నే

చౌ లి-పో
నవల

నళిని
తెలుగు అనువాదం



ఉప్పెన

రెండవ భాగం
సీరియల్ ప్రారంభమయింది.

నిర్వహణ
'సాహితీ మిత్రులు'

సంవత్సర చందా 15 రూపాయలు

ఈ సంచిక రు. 1-50 పైసలు

ఈ సంచికలో....

వచ్చే సంచికలో....

కుటుంబం, వ్యక్తి ఆస్తి, రాజ్యం పుట్టుక - ఫ్రెడరిక్ ఎంగెల్స్
తెలుగు సంక్షిప్తానువాదం - కె.వి. రమణారెడ్డి

SRJANA is commended for use in Public Libraries in t
State by the Director of Public Libraries, Andhra Pradesh, H
Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithru
Printed at Warangal Printing Press, J.P.N. Road, Warangal - 506 0
for Venkataramana Mudranalayam, Warangal
Working Editor: Varavararao

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాసపత్రిక

ఆగస్టు 1979

94

'కొద్దికాలంలోనే, చైనా మధ్య దక్షిణ ప్రాంతాల నుంచి కొట్లాది రైతులు ఒక ఉప్పెనలాగ లేస్తారు. ఆ శక్తి ఎంత అసాధారణమైందీ అంటే దానినేశక్తీ అణచ జాలదు.' — మావో.

ఆ విప్లవ ఉప్పెన 1944-48 ప్రాంతాలలో చైనాలో భూసంస్కరణలను ఎంత గొప్పగా అమలు చేసిందో, భూసంస్కరణలు అమలైన కాలంలో పేద రైతుల జీవితాలు ఎట్లా విప్లవాత్మకంగా రూపాంతరం చెందాయో చిత్రించే నవల 'ఉప్పెన' రెండో భాగం 33 పేజీలో సీరియల్‌గా ప్రారంభమవుతున్నది.

1973 లో 'ఉప్పెన' మొదటి భాగం సృజనలో సీరియల్‌గా వెలువడినప్పుడు ఎంతో ఆసక్తితో ఆదరించి స్వీకరించిన పాఠకులు ఐదారేళ్ళ దీర్ఘవ్యవధి తర్వాతనైనా సరే మా ఈ ప్రయత్నాన్ని హర్షిస్తారని ఆశిస్తున్నాం.

— 'సాహితీ మిత్రులు'

నిర్వహణ

'సాహితీ మిత్రులు'

సంవత్సర చందా 15 రూపాయలు ఈ సంచిక రు. 1-50 పైసలు

ఎర్రకోటపై 'స్వాతంత్ర్య' జెండా ఎవరెగురేస్తారు?

ఆగస్టు 15న ఎర్రకోట మీద ఎవరు 'స్వాతంత్ర్య' జెండా ఎగరేయాలన్నది ఇంకా తేలలేదు. ఎవరెగరేసినా నెహ్రూ కుటుంబంలాగా ఎంతోకాలంపాటు ఎగరేయ లేరని మధ్యంతర ఎన్నికలు ఎంతోదూరం లేవని అనుకుంటూనే వున్నారు.

మొరార్జీ రాజీనామా మాత్రం జనతా ప్రభుత్వాన్ని కొన్ని తక్షణ సమస్యల నుంచి కాపాడింది. బ్యాంక్ సిబ్బంది సమ్మెను నిషేధిస్తూ తెచ్చిన ఆర్డినెన్సు, ఏడాది పాటు నిర్బంధ పొదుపు డిపాజిట్లు ఇవ్వవద్దన్న నిర్ణయం, రైల్వేకార్మికుల బోనస్ వంటి సమస్యలు అదివేధిస్తున్న వాళ్ళు తప్ప తక్కినవాళ్ళు ఆలోచించాల్సిన అవసరం లేకుండా పోయింది. అట్లాగే ఉద్యోగాలు కోల్పోయిన వేలాది మంది పోలీసులు, సి. ఆర్. పి, సి. ఐ. ఎస్. ఎఫ్ కుటుంబాల గురించిగానీ వీళ్ళలో మృతుల కుటుంబాల గురించిగానీ ఆందోళన చెందే అవకాశంలేదు. మరీ ఆందోళన కరమైన విషయ మేమైనా వుంటే ఇదే జనతా ప్రభుత్వం వీళ్ళమీదికి ఉసిగొల్పిన సైన్యం బొకారోలో సలసలకాగి కరుగుతున్న ఎర్రని ఉక్కులాంటి ఎంతోమంది రక్తాన్ని చవిచూసివున్నదని, అదే బొకారోలో అలాంటి పబ్లిక్ సెక్టర్ల పేరుతో కొనసాగుతున్న ప్రభుత్వ పెట్టుబడి దారీ విధానానికి పెద్ద అండ 'సోషలిస్టుఉదారవాద' సోవియట్ రష్యా తక్షణంగానైతే ఎర్రకోట మీద ఎవరు జెండా ఎగరేయాలో నిర్ణయించే శక్తిని పుంజుకున్నట్లు కన్పిస్తున్నది.

మొరార్జీ దేశాయి ఇందిరా గాంధీ మీద చర్య తీసుకోవడంలో చేతగాని వాడు లాగా వ్యవహరిస్తున్నాడని ఆరోపిస్తూ ప్రభుత్వం నుంచి రాజీనామా చేసిన చరణ్ సింగ్ ఇవ్వాళ తాను ప్రధాని కావడానికి ఆమె సహకారాన్ని కోరుతున్నాడు. అధికార నిరంకుశత్వాన్ని దానికి పర్యాయ పదమైన ఇందిరా కాంగ్రెస్‌ను వ్యతిరేకించడమే తమ ధ్యేయంగా ప్రకటించుకున్న కొన్ని 'వామపక్షాలు' కొందరు 'సెక్యులర్' వాదులు కళ్ళు మూసుకొని పాలు తాగుతున్న పిల్లి చందంగా ఎస్ తగిలించుకున్న జనతాలో సెక్యులరిజాన్ని చూస్తున్నారు. జగజీవన్‌రామ్‌ను ముందుపెట్టుకొని హిందూరాజ్యాన్ని ఆర్. ఎస్. ఎస్ నిర్మాణాన్ని సజావుగా కొనసాగించొచ్చని ఆశించిన జనసంఘ్‌కు మొరార్జీ మొండితనం మళ్ళీ ఆయనే దిక్కయ్యేలా చేసింది. బహుశా జనతా నాయ కత్వానికి జగజీవన్‌రామ్‌ను అమెరికా ఆమోదించి వుండదు. నాయకత్వం కోసం పట్టు పట్టవద్దని వై. బి. చవాన్‌కు స్వరణ్‌సింగ్ ద్వారా రష్యా సలహా ఇచ్చి వుంటుంది. ఈ రెండు అగ్రరాజ్యాలు, దేశంలోని అభివృద్ధి నిరోధక శక్తులు నిర్ణయిస్తాయి రేపు 'స్వాతంత్ర్య' జెండా ఎవరెగరేయాలో.

ఇవ్వాళ కేంద్రంలో జనతా నుంచి విడిపోయిన వాళ్ళుగానీ జనతాను వ్యతిరేకిస్తున్న వాళ్ళుగానీ చూపుతున్న ప్రమాదం చాలా తీవ్రమయినదే. అది కులమత తత్వం. కాని అదే ప్రాతిపదికగా ఏర్పడిన ఈ అన్ని పార్టీలు కూడా దానిని నిరోధించగలవా అనేది ముఖ్యమైన సమస్య. తాము అధికారంలోకి రావడానికి ఒక అవకాశవాద నినాదంగా తప్ప సూత్రబద్ధంగా దీనిని వ్యతిరేకించే సెక్యులర్ స్వభావం వీరిలో ఎవ్వరికీ లేదు. అవకాశవాదంతో స్వార్థ ప్రయోజనాలతో ఇందిరా అధికార నిరంకుశత్వాన్ని (అథారిటేరియనిజమ్) వ్యతిరేకించి వీళ్ళు అధికారంలోకొచ్చి రెండేళ్ళలోనే మళ్ళీ ఆమెకే అనుకూలమైన వాతావరణాన్ని కల్పించి పెట్టారో అట్లాగే కులమత తత్వాలను (కమ్యూనలిజం) వ్యతిరేకించే పేరుతో వీళ్ళు ఇవ్వాళ ఇస్తున్న నినాదం కూడా, ఇది వీళ్ళ స్వభావానికి, చిత్తశుద్ధికీ, సంబంధించిన విషయం కాదు కాబట్టి, కులమత శక్తులు బలపడడానికే తోడ్పడుతుంది. ఫలితంగా అథారిటేరియన్, కమ్యూనల్ అధికారం త్వరలో ప్రభుత్వాన్ని చేజిక్కించుకొని మళ్ళీ ఒకమారు ఎమర్జెన్సీ కాని ఎమర్జెన్సీని అమలుచేసే స్థితి ఎంతో దూరంలేదు. విషాదకరమైన విషయమేమంటే— నిజమైన ప్రజాస్వామ్య, సెక్యులర్ శక్తులు ఇవ్వాళ నిర్ణాయక పాత్ర వహించే స్థితిలో లేవు.

25-7-79 — సంపాదకుడు

ఏజెంట్లకు, చందాదార్లకు విజ్ఞప్తి

సృజన ఏజెంట్ల దగ్గర బకాయిలు బాగా పేరుకపోతున్నాయి. ఈ పరిస్థితి ఇట్లాగే కొనసాగితే సృజన నిర్వహణ ఇంక కష్టసాధ్యమైపోతుంది. మిగిలిన పాత కాపీలు పంపిస్తూ ఈ నెలవరకు అకౌంట్స్ సెటిల్ చేయవలసిందిగా ఏజెంట్లకు విజ్ఞప్తి చేస్తున్నాం. వాపసు పంపించకపోతే కాపీలు అమ్మినట్లే లెక్క. నెల ఆఖరు వరకు బకాయిలు చెల్లించని ఏజెంట్లకు సృజన నిలిపివేస్తాం. ఈ విషయంలో సృజన పాఠకులు శ్రద్ధతీసుకొని ఏజెంట్లు బకాయిలు చెల్లించేలా చూడవలసిందిగా కోరుతున్నాం.

దాదాపు-రెండు వందల మంది చందాలు గత నెలతో పూర్తయినవి. తమ చందాలను రిన్యూ చేసి సృజనకు ఎప్పటివలెనో సహకరించవలసిందిగా కొత్త చందాదార్లను అధిక సంఖ్యలో చేర్పించవలసిందిగా కోరుతున్నాం.

— సాహితీ మిత్రులు

సాహిత్య లేఖ:

ప్రజా రచయితలకు సవాల్!

ప్రజా సాహిత్యానికి ఎంత దుర్గతి పట్టిందో ఎంత పరిమిత పరిమాణంలో ఉత్పత్తి అవుతుందో నాలుగు నెలలుగా సృజనలో కవులు లేకపోవడాన్ని బట్టి చూస్తే మనకు స్పష్టంగానే అర్థమయిపోతుంది. ఇది ప్రజా సాహిత్యాభిమానులకు ఎంతో బాధ, విచారం కలిగించే విషయం. ఈనాడు అభివృద్ధి నిరోధక చెత్త సాహిత్యం, దోపిడీ సంస్కృతిని మెదళ్ళలోనికి ఇంజెక్ట్ చేసి మత్తులో, మౌఢ్యంలో వుంచే దివాళాకోరు సాహిత్యం విపరీతమైన వేగంతోటి దినదినాభివృద్ధి చెందుతూ మూడు పూవులు, ఆరవై కాయలై వర్ధిల్లుతూ అంతకంటే త్వరగా పతనం చెందుతోంటే, ప్రజా సాహిత్యం ఎంతో నిరాశామయంగా, ఊహించనలవికానిరీతిలో, అత్యంత దారుణంగా గుంటపూలు పూస్తోంది. ఉత్పత్తి అయిన చెత్త సాహిత్యాన్ని మార్కెట్ చేసే ఓ ప్రముఖ వారపత్రికా సంపాదకుని మాటల్లో చెప్పాలంటే ఈనాడు ఐదు వందలకు మించి తెలుగు కథల్ని వివిధ పత్రికలు వెలువరిస్తున్నాయి. ఇపుడు వస్తున్న వివిధ వార, మాసపత్రికల్ని మనం పరిశీలిస్తే ఆ సంపాదకుడి మాటలు అతిశయోక్తులుగా కనిపించవు. ఆయన అంచనాలు కరెక్టే. పెట్టుబడులకు, కట్టుకతలకి పుట్టిళ్ళయిన మన విషపత్రికలు శాస్త్రీయ అవగాహనతో వ్రాసే కథల్ని ప్రచురిస్తాయంటే మనం విశ్వసించనవసరంలేదు. కనుక ఆ ఐదు వందల కథల్నికూడా ప్రజా వ్యతిరేక సాహిత్యంగానే పరిగణించాలి. ప్రజా సాహిత్యాన్ని ఆ పత్రికలు ఆదరించవనే సంగతిని విస్మరించకూడదు. ప్రజల్ని మత్తులో వుంచే కథలు నెలకు ఐదు వందల పై చిలుకు వెలువడుతుంటే నిజ జీవితావగాహన తోటి, నిత్య జీవిత సంఘర్షణలతోటి వ్రాస్తున్న కథలు నెలకు ఐదుకు మించి వెలువడటంలేదు. తెలుగు దేశంలో ప్రజలతో సన్నిహిత సంబంధం కలిగి, ప్రజా సాహిత్యం మీద కొన్ని ఖచ్చితమైన అభిప్రాయాలుండి నిర్మాణాత్మకమైన కృషి చేస్తున్న సాహిత్య సంస్థలు బూర్జువా, ప్రజా వ్యతిరేక సాహిత్య సంస్థల కంటే ఎక్కువగానే వున్నాయి. కాని ప్రజా సాహిత్యంలో అభివృద్ధి కనపడటం లేదు. ఉదాహరణకు సృజనను పరిశీలిస్తే ఉత్తమమైన రచనల కోసం ప్రతినెలా ప్రజా రచయితల్ని రిక్వెస్ట్ చేస్తున్నది. ఇంత కంటే ఓ ప్రజా సాహిత్య పత్రిక విచారించాల్సిన విషయంలేదు. సృజనే కాదు, ఇపుడు వస్తున్న ప్రజా పత్రికలన్నీ రచనల కోసం దేవిరించాల్సిన పరిస్థితి ఏర్పడి వున్నది. గత నాలుగు నెలల నుంచి (ఏప్రిల్, మే, జూన్, జులై) సృజనలో మనం ఒక్క కథని కూడా చదవటానికి నోచుకోలేదు. కనుక మేధావులు, సాహిత్యోప జీవులు ఈ విషయాన్ని సీరియస్‌గా, తీవ్రంగా ఆలోచిస్తారని ఆశిస్తాను.

— మొలకలపల్లి కోటేశ్వరరావు

పమిడిపాడు

మార్క్స్ దృష్టిలో సాహిత్యం

ఆర్. ఎస్. సుదర్శనం

"సమాజంలో ఉత్పత్తి ద్వారా ఏర్పడే మానవసంబంధాలకూ, భౌతికమైన ఉత్పత్తిశక్తులకూ పరిణామదశరీత్యా సంఘటితమైన వ్యవస్థ ఆర్థిక వ్యవస్థ. ఇది పునాది. దీనిమీద న్యాయశాస్త్ర, రాజ్యాంగ నిర్మాణమూ దాని తాలూకు సామాజిక చైతన్య నిర్దిష్ట స్వరూపాలూ ఏర్పడివుంటవి. భౌతిక జీవనోత్పాదకమైన విధానమే సామాజిక, రాజకీయ, విజ్ఞాన జీవితక్రమాన్ని నియమిస్తుంది. మనుష్యుల చైతన్యం కాదు వారి సత్తాను నిర్ణయించేది; వారి సామాజిక సత్తాయే వారి చైతన్యాన్ని నిర్ణయిస్తుంది. భౌతికమైన ఉత్పత్తిశక్తులు ఒక పరిణామదశలో అప్పటికి ఏర్పడివున్న ఉత్పత్తి సంబంధాలతో (అంటే ఆస్తిపాస్తుల తాలూకు సంబంధాలతో) ఘర్షణ పడటం ప్రారంభమౌతుంది. ఉత్పత్తిశక్తుల పరిణామానికి దోహదం చేసే బదులు ఈ సంబంధాలు వాటికి సంకెళ్లగా మారుతవి. అప్పుడు సామాజిక విప్లవం ప్రారంభమౌతుంది. ఆర్థిక వ్యవస్థ అనే పునాది మారడంతో దానిమీద బృహన్నిర్మాణం యావత్తూ యించుమించు త్వరితంగా మారిపోతుంది. ఈ మార్పులను అవగాహన చేసుకోవడంలో ఒక ముఖ్యమైన తేడాను గమనించాలి. ఉత్పత్తియొక్క ఆర్థిక పరిస్థితుల్లో కలిగే భౌతికమైన మార్పుని ప్రకృతి శాస్త్రంలాగే స్పష్టంగా నిర్ధారణ చేయవచ్చు. కాని న్యాయశాస్త్ర, రాజ్యాంగ, మత, దర్శనశాస్త్ర, కళాసంబంధమైన— అంటే భావసంబంధమైన— మార్పుల విషయం అలాకాదు. వాటిద్వారా మనుషల్లో ఘర్షణను గూర్చిన చైతన్యం అభివ్యక్తమై వాళ్ల పోరాటాన్ని సాగిస్తారు"[4] అన్నాడు మార్క్స్. ఇక్కడ ఆర్థిక వ్యవస్థ 'పునాది'; సాంస్కృతిక స్వరూపం 'నిర్మాణము'గా అభివర్ణింపబడింది. పునాదిగా అభివర్ణింపబడటంతో ఆర్థిక వ్యవస్థ ఒక్కటే విప్లవాన్ని నిర్ణయిస్తుందనే వ్యాఖ్యానాన్ని, అపోహగా ఎంగెల్స్ తిరస్కరించాడు. ఒక లేఖలో 1890లో ఎంగెల్స్ యిలా వివరించాడు: "చరిత్రను భౌతికవాదం దృష్ట్యా వీక్షించడంలో, చరిత్రలో చివరకు పరిణామాన్ని నిర్ణయించేది ఉత్పత్తి దానితాలూకు జీవితవాస్తవికత అనడమే తప్ప, అంతకంటే మార్క్స్‌గాని నేనుగాని చెప్పలేదు. ఆర్థిక వ్యవస్థను ఒకదాన్నే నిర్ణయశక్తిగా ఎవరైనా వక్రభాష్యం చెబితే అది సిద్ధాంతాన్ని అర్థరహితం చెయ్యడమే అవుతుంది. ఆర్థిక పరిస్థితి 'భూమిక' అవడం సరే, కాని 'నిర్మాణం' తాలూకు అంశాలు— వర్గ సంఘర్షణల రాజకీయాలు, విజేతయైన వర్గం ఏర్పరిచే రాజ్యాంగం న్యాయవిచారణా మార్గాలూ, వీటి తాలూకు ఘర్షణలు ఆయా మనుష్యుల బుర్రల్లో కలిగించే సంచలనాలూ, రాజకీయ దార్శనిక సిద్ధాంతాలూ,

మతాభిప్రాయాలూ— అన్నీ కూడా చారిత్రిక సమరం యొక్క గతిని ప్రభావితం చెయ్యడమేకాదు, చాలాసార్లు దాని స్వరూపాన్ని నిర్ణయించడంలో ప్రధానంగా పైచెయ్యిగా వుంటాయి. ఈ అన్నిటియొక్క సంకుల సమరం ఫలితంగానే (ఈ శక్తుల, సంఘటనల పరస్పర సంబంధం అంచనా వెయ్యడం అసాధ్యం) చివరకు ఆర్థికమైన ఉద్యమం తన విజయాన్ని సాధిస్తుంది. అది అలావుండకపోతే, సిద్ధాంతాన్ని చరిత్ర సన్నివేశానికి అన్వయించడం గణితంలో సామాన్య సమీకరణం లెక్క చేసినంత సులువుగా వుండేది".[5]

చరిత్రగతిలో ఆధారభూతమైన శక్తులు ఆర్థికశక్తులే అయినా విప్లవంలో రాజకీయాలకూ, సాంస్కృతిక సాహిత్యోద్యమాలకూ ప్రధానపాత్ర వున్నది అనడం మార్క్స్ దర్శనం. ఇందులో ఆర్థిక శక్తుల పరిణామ స్వరూపం గోచరించినంత నిర్ధారణగా, శాస్త్రీయంగా రాజకీయ, సాంస్కృతిక సాహిత్యోద్యమాల స్వరూపం, వాటి దారితెన్నులూ గోచరించవు. గమనించవలసింది ఏమిటంటే ఇక్కడ రాజకీయవాదీ, సాహిత్యకారుడూ మేధావులుగా సమానమే తప్ప రాజకీయవాదికి సాహిత్యకారునికి లేని దివ్యదృష్టి ప్రత్యేకంగా మార్క్స్‌దర్శనం ప్రసాదించడంలేదు! సామాజిక చైతన్యంలో విప్లవ సృజనాశక్తి అభివ్యక్తమయ్యే రంగభూమికి రాజకీయవాదిబుర్రే కానక్కరలేదు. రచయితా అందుకు అర్హుడే!

ఉత్పత్తి సాధనాలను కైవసం చేసుకొనడం ద్వారా, పార్టీ నియంతృత్వంద్వారా ఆర్థిక వ్యవస్థలో మార్పుల్ని తీసుకువచ్చే బాధ్యత రాజకీయవాదులైన మేము వహిస్తున్నాము కాబట్టి, సాహిత్య ఉత్పత్తి సాధనాలైన రచయితలను గూడా కైవసం చేసుకుని వారిని నియంత్రించడం ద్వారా సాంస్కృతిక ('నిర్మాణం'లో) విప్లవం తీసుకువస్తామంటే కుదరదు. స్టాలిన్ రష్యాలోనూ, మావో చైనాలోనూ ఈ ప్రయత్నం చేశారు. ఫలితం ఈనాడు అందరికీ విదితమే!

సాహిత్యమూ, మార్క్సిస్ట్ దర్శన సూత్రాల కవిలెకట్టా (ideology) రెండూ ఒకటే. రెండింటికీ అభేదమే అంటే అదీ మార్క్స్ దర్శనానికి విరుద్ధమే అవుతుంది. ఆ అభిప్రాయంతో రచనలుచేసి మెప్పు సంపాదించటానికి ప్రయత్నించిన తొత్తు రచయితల్ని గూర్చి ఎంగెల్స్ ఏమన్నాడో చూడండి: "చిల్లర రచయితలకు యిదో పెద్ద అలవాటైపోయింది. ప్రజ్ఞ లేకపోవడాన్ని దాచిపెట్టుకుంటూ, రాజకీయాలను గూర్చి ఉల్లేఖిస్తుండడం— యిది కేవలం ఆకర్షించే ప్రయత్నం. కవిత్వము, నవలలు, సమీక్షలు, నాటకాలూ, సాహిత్యమంతా యిలా 'గాలివాటు' (tendency) రచనగా తయా

రైపోయింది....” “ప్రతిభలేని వెధవ ఒకడు, తన విశ్వాసాన్ని ప్రకటిస్తూ, సొంత డబ్బా వాయించడంలో మరీ శ్రుతిమీరిపోయాడంటే అది నలుగుర్ని ఆకర్షించడానికే”6 ఇలాంటి రచయితలు తెలుగులో మనకూ ఉన్నారంటే మనం ఆశ్చర్యపడనక్కరలేదు: చరిత్ర పునరావృతమౌతూ వుంటుంది దేశకాలాల్నిబట్టి.

సోషలిస్ట్ విశ్వాసాల్ని వల్లించడమే సాహిత్యం కాదంటూ మార్క్స్ 'సామాజిక స్పృహ' వున్న రచయితలుగా ఫ్రెంచి రచయిత బాల్జాక్‌నీ, ఆంగ్ల నవలా రచయితలు డికెన్స్, థాకరే, బ్రాంటే వంటివారినీ ఉగ్గడించాడు. “నేటి ఇంగ్లీషు నవలా రచయితల పుటల్లో ధారాశుద్ధిగల శైలిలో కన్నులకు రూపుకట్టే విధంగా ఎన్నో రాజకీయ, సామాజిక సత్యాలు ప్రపంచానికి ఆవిష్కరింపబడ్డాయి. రాజకీయవాదులూ, ప్రచారకులూ, నీతిబోధకులూ అందరూ కలిసికట్టుగా సాధించలేని కార్యం వీరు సాధించారు” అన్నాడు మార్క్స్.7

'ఫ్రాంజ్‌వాన్ సికెంగెన్' అనే నాటకాన్ని మార్క్స్-ఎంగెల్స్‌లు సుదీర్ఘంగా సునిశితంగా చర్చించడం చూస్తే ఒకనాటి చారిత్రిక-సామాజిక సంక్షోభాన్ని అవగాహన చేసుకునేందుకు సాహిత్యం ఎలా వుపయోగిస్తుందో బోధపడుతుంది. అటువంటి విలువా, సామాజిక స్ఫూర్తి సోషలిస్టు సిద్ధాంతాన్ని వల్లిస్తూ ప్రచార సాధనంగా సృష్టించే సాహిత్యానికి రాదు.

ఇక్కడే రచయితయొక్క 'నిబద్ధత' (Commitment) ను గూర్చి సరియైన అవగాహన అవసరం అవుతుంది. సార్త్రె అంటాడు: “సాహిత్యము (రచయితకు) సర్వస్వమూ కాకపోతే అది ఎందుకూ కొరగాదు. కమిట్‌మెంట్‌కి నేనిచ్చే అర్థం యిదే.”8 “దాన్ని అమాయకత్వానికీ, పాటలకూ దిగజారిస్తే నశిస్తుంది. వ్రాసిన వాక్యం, మనిషీ-సమాజమూ అన్ని స్థాయిలలోనూ ప్రతిశబ్దించకపోతే దానికి అర్థం శూన్యం. ఒకయుగం సాహిత్యమంటే ఏమిటి? యుగాన్ని తన సొంతంచేసుకున్న సాహిత్యమన్నమాట, రచయితలు అర్థాన్ని సృష్టిస్తూ (సామాజిక సత్యాన్ని) ఆవిష్కరిస్తారు, నిరూపిస్తారు, నివేదిస్తారు, తర్వాత జనం ఒకరి మొహం ఒకరు చూచుకుని కార్యోన్ముఖులు కావచ్చు.”9

మార్క్స్ అభిప్రాయాలు సాహిత్యాన్ని గూర్చి యిలావున్నా, ఆచరణలో రష్యాలోనూ చైనాలోనూ భిన్నంగానే జరిగింది. “రచయిత తన భావాలమేరకు సృష్టించవచ్చు ఏ నిబంధనాలేకుండా” అని లెనిన్ మొదట అన్నప్పటికీ, రష్యన్ విప్లవ సమయంలో అదే లెనిన్, సంస్కృతిపరంగా రచయిత 'అయోమయంగా ఏ

వైపుకంటే ఆ వైపుకి లాగటానికి వీల్లేదని'[10] అన్నాడు. అక్కడినుంచీ ప్రారంభమైంది రచయిత దాస్యం. క్రమంగా రచయితయొక్క 'కమిట్‌మెంట్' 'మానవత' అనే ఆదర్శం నుంచి 'జనత' అనీ 'జనత' నుంచీ 'విప్లవం' అనీ, 'విప్లవం' నుంచీ 'పార్టీ' అనీ, అక్కడి నుంచి 'మార్పుజెందే పార్టీనిర్దేశాలు' అనీ అలా సంకుచితమై పతనమైపోతూ వచ్చింది. స్టాలిన్ పరిపాలనలో యీవిషపు పరిస్థితి సాహిత్యాన్నీ కళారంగాన్నీ రాహువులా కప్పివేసింది. దీన్ని గూర్చి 1966లో సోవియట్ రచయితలు ఏమన్నారో చూడండి: "వ్యక్తిపూజ వలన కలిగిన దుష్ఫలితాల్లో ఒకటి- కళల్లో వైయక్తిక ప్రమాణాల్ని, సామాజిక ప్రమాణాల్ని యాంత్రికంగా (విచక్షణా రహితంగా) ఒకటి చేసెయ్యడం. దానికి సమర్థన యిలా వుండేది: ఆదర్శాల్లో రాజకీయాల్లో భావసమైక్యమూ, దృక్పథంలో ఏకత్వమూ సాధించాము. కాబట్టి మనకు కళా ప్రమాణాల్లోనూ ఒకటే వ్యవస్థ వుండాలి, కళాభినివేశం సర్వమూ ఏక ముఖంగానే రూపొందాలి అనడం కళాభిరుచులు సమాజంలోని సౌందర్య భావనల యొక్క అభివ్యక్తి కావడం నిజమే అయినా, వాస్తవంలో వైయక్తికమైన అభిరుచులన్నింటినీ ఒక సామాజిక కళాసూత్రంగా సంక్షిప్తం చెయ్యడం కానిపని ఏమిటంటే కళల్లో వ్యవస్థ ఒక్కటే అయినా అభిరుచుల వైవిధ్యం పుష్కలంగా ఉండటానికి వీలున్నది. ఈ వైవిధ్యం ఒక్కొక్క జాతినిబట్టీ, మనస్తత్వాన్ని బట్టీ, వయోభేదాన్ని బట్టి వైయక్తికంగా ఉత్పన్నమౌతుంది.... అందుకే కళాభిరుచులూ, హృదయ ప్రేరణలు ఒకే ప్రమాణానికి కట్టుబడి ఉండాలన్న నిర్దేశాన్ని మేము నిరాకరిస్తాము."[11]

స్టాలిన్ తర్వాత రష్యాలో కళలూ, సాహిత్యమూ, వైవిధ్యంతో వైయ్యక్తికాభిరుచులతో వికాసం చెందాలి అన్నగుర్తింపు ఏర్పడినా, రచయితకు మాత్రం సామాజికునిగా (as a social being) ఉండవలసిన స్వతంత్ర ప్రతిపత్తి లభించలేదనే తెలుస్తోంది. సోవియట్ రచయిత లేమంటున్నారో చూడండి: "మార్క్సిస్ట్- లెనినిస్ట్ దృక్పథం కళాభిరుచిలో వైయక్తికమైన అంశను గుర్తిస్తుంది. కాని దాన్ని కేవలం ఆత్మాశ్రయమైన దానిగా అంగీకరించదు. సమాజంలో అభిరుచుల వైవిధ్యానికి కూడా ఒక స్పష్టమైన కళావ్యవస్థ, ఆదర్శాలు (ideology) ఆధారమనీ తద్వారా అందులో ఒక ఏకత్వంకూడా వుంటుందనీ నొక్కిచెబుతుందీ దృక్పథం. అభిరుచులలో వైవిధ్యం సరేగాని ఏదంటే అది కుదరదు అనడమే యీ నిర్దిష్ట దృక్పథం"[2] ఈ నిర్దిష్ట దృక్పథం పరిధిలోకి ఏ అభిరుచి వస్తుందో ఏది రాదో నిర్ణయించే అధికారం ఎవరిది? అది రాజకీయవాదికి కాకుండా మొత్తం సమాజానికి వుండాలనే యిక్కడ మనవిచేయడం. అప్పుడే అది సరియైన మార్క్సు దృక్పథం అవుతుంది.

మార్క్స్ దర్శనంలో వ్యక్తికీ రచయితకూ నిర్దిష్టమైన ప్రతిపత్తి వున్నా, దాన్నిగూర్చి మార్క్సిస్ట్ రాజకీయవాదులు వక్రభాష్యం పలుకుతూ, భావవాద సంప్రదాయంలో వ్యక్తికీ-సమాజానికీ గల వైరుధ్యాన్నే పునశ్చరణ చేస్తూ వచ్చారు. సమాజవాదం అంటే వ్యక్తిని కొన్ని సూత్రాల మేరకు సమాజానికి తొత్తుగా లొంగదీసుకోవడమేననే అపోహ కల్పిస్తూ రావడం, మార్క్స్ దర్శనమంటే మేధావుల్లో రచయితల్లో భయమూ, వైముఖ్యమూ ఏర్పడడానికి కారణమైంది. మార్క్స్ దర్శనంలో 'వ్యక్తి'ని గూర్చిన తాత్విక వివరణ (metaphysical description) ను అర్థం చేసుకుంటే యీ అపోహలు అదృశ్యమౌతవి. ఆ వివరణవైపు యిప్పుడు దృష్టి మళ్ళిద్దాం.

మార్క్స్ దర్శనం గతి తార్కిక భౌతికవాదం (Dialectical Materialism)

దీనికీ, అంతకుపూర్వం ప్రచారం పొందిన భౌతికవాదానికీ, మౌలికంగా చాలా భేదమున్నది. భౌతిక ద్రవ్యము (physical matter) చరమ సత్యమే అయినా అది నిత్య పరిణామశీలమనీ, దాన్ని పరిణామం ద్వారానే చైతన్యవంతంగానే, అవగాహన చేసుకోవాలనీ చెబుతుంది. గతితార్కిక భౌతికవాదం "ఇంతవరకూ వచ్చిన భౌతిక వాదాలలో ప్రధానమైన లోపం ఏమిటంటే— విషయము (object) సత్యము అంటే మనం యింద్రియాలద్వారా గ్రహించేది।" అది కేవలం దృశ్యవిషయంగా యథా రూపంలోనే అర్థం చేసుకుంటున్నాము. దాన్ని సేంద్రియమానవ చైతన్యంగా, వ్యవహారంగా తీసుకోవడం లేదు. అంటే 'విషయి' (subject) పరంగా తీసుకోవడం లేదు. అందువల్లనే భౌతిక వాదానికి ప్రతి ద్వంద్వంగా, చైతన్యవంతమైన భాగాన్ని ఒక అమూర్త వస్తువు (an abstraetion) చేసి భావవాదం పెంపొందించడం జరిగింది- దానికీ సేంద్రియ చైతన్యం యొక్క యథా స్వరూపం తెలియదు".[13] ఇలా 'విషయి-విషయము' అనే ద్వంద్వాన్ని అధిగమించే తాత్త్విక భూమిక మీద ఏర్పడింది- మార్క్స్ ప్రవచించిన భౌతిక వాదం. సమాజానికీ- వ్యక్తికీ గల సంబంధం పరిణామ శీలమైనది. గతితార్కిక బద్ధమైనది. "భాష"ను గూర్చి మార్క్స్ దర్శనం ఏమి చెబుతోందో పరిశీలిస్తే మనం సులువుగా అర్థం చేసుకోవచ్చు దీన్ని,

"భాష, చైతన్యం అంతా ప్రాచీనమైనది. భాష వ్యావహారిక చైతన్యం. అంటే అది ఇతరులకు గ్రాహ్యమౌతున్నది గాబట్టి వ్యక్తిగతంగా నాకూ గ్రాహ్యమౌతున్నది. భాష, చైతన్యంలాగే మనుష్యులు ఒకరితో నొకరు సాంగత్యం, సంబంధం నెరపవలసిన అవసరం నుంచీ, ఆవశ్యకతనుంచీ పుట్టుతున్నది"[14] భాషకూ సామాజిక

చైతన్యానికీ గల అభేదస్థితి అవగాహన చేసుకోవలసిన కీలకమైన విషయం మార్క్సు దర్శనంలో (భావవాద సంప్రదాయచ్ఛాయలీ అవగాహనకు అవరోధం. వాటిని తొలగించుకొని చూడాలి). భాషలో శబ్దాలు సామాజిక వ్యవహారంలో ఉద్భవించినవి. అయినా వాటి అర్థవిన్యాసంలో వాటికి రెండు ముఖాలుంటవి. ఒకటి పూర్వప్రయోగం వల్ల సిద్ధించిన రూఢమైన అర్థం (నిఘంటువులోనిది). రెండోది, వ్యవహారంలో శబ్దాన్ని విలక్షణంగా, సృజనాత్మకంగా వ్యక్తి ప్రయోగించడంవల్ల భవిష్యత్తులో సిద్ధించే కొత్త అర్థం. మొదటిదాన్ని అనుసరించేవున్నా, వ్యవహారంలో సహజంగా సిద్ధించేదే అయినా, యీరెండో అర్థాన్ని అది పుట్టకముందే వూహించి నిఘంటువులో వ్రాయడం సాధ్యంకాదు గదా! కొత్త అర్థాన్ని సంతరించుకోవడానికి వీల్లేదంటూ శబ్దాన్ని నియమించడమే జరిగితే భాష స్తంభించి మృతప్రాయమే అవుతుంది. భాష సామాజిక చైతన్య స్ఫూర్తిని కోల్పోతుంది.[15]

ఈ కీలకాన్ని అర్థంచేసుకుంటే వ్యక్తి చైతన్యానికీ సామాజిక చైతన్యానికీ గల సంబంధం అర్థమౌతుంది. వ్యక్తిచైతన్యం సామాజిక చైతన్యంయొక్క అభివ్యక్తికీ, పరిణామానికీ రంగభూమి. తద్వారా వ్యక్తి జీవితసాఫల్యమూ అందులోనే యిమిడి వుంటుంది. జీవభాషలో శబ్దానికి ఎటువంటి ప్రాధాన్యంవున్నదో, తాత్వికంగా సామాజిక చైతన్య పరివర్తనలో వ్యక్తి చైతన్యానికటువంటి ప్రాధాన్యమే ఉన్నది.[16] వ్యక్తీ- సమాజమూ రెండుముఖాలు. "సమాజం ఒక అమూర్తవస్తువుగా (an abstraction) వ్యక్తి నెదుర్కొంటున్నట్లు ప్రతిపాదించడం మనం మానుకోవాలి. వ్యక్తి సామాజికుడు. అతని జీవితంయొక్క అభివ్యక్తి- సామాజికమైన అభివ్యక్తిగా, ఇతరులతోడి వ్యవహారంగా రూపొందక పోయినప్పటికీ- తప్పకుండా అది సామాజిక జీవితం తాలూకు అభివ్యక్తే అవుతుంది. మనిషి విశిష్టత కలిగిన వ్యక్తి అయినప్పటికీ- అతనిలోని ప్రత్యేకతేగదా అతన్ని వ్యక్తిని చేస్తున్నదీ, వ్యక్తిగా విశిష్ట సామాజికుణ్ణి చేస్తున్నదీ- అతను సంపూర్ణుడే (శకలంకాదు). ఎందుకనగా సమాజం తాలూకు "విషయి"గా దాని అలోచనకూ అనుభూతికీ నెలవుగా అతడు భావపూర్ణుడు (ideal whole) అవుతున్నాడు".[17]

మానవుడు సామాజికుడు (social being) అనడంలో ప్రతివ్యక్తికీ సమాజంలో "విషయి"గా కేంద్రస్థానాన్ని, భావస్వాతంత్ర్యాన్ని ప్రతిపాదిస్తున్నది మార్క్సు దర్శనం. అందువల్లనే మార్క్సిజం గొప్పమానవతా దర్శనం అవుతున్నది. ఈ నిర్వచనానికి మార్క్సిస్ట్ రాజకీయవాదులూ, వారి పరివారమైన రచయితలూ వక్రి

భాష్యం చేస్తూనేవున్నారు. మానవుడు సమాజం అనే అమూర్తవస్తువుతో లీనం కావల సినవాడుగానూ, మందిలో ఒకశాల్తీగాను వ్యక్తిని మార్చి, హతమార్చి వ్యవహరిస్తూ వచ్చారు. "సామాజికుడు అంటే కొన్ని నిశ్చిత ప్రమాణాలనూ, భావాలనూ, (రాజకీయవాది ఏర్పరచినవి) సామాజిక చైతన్య వ్యవస్థగా తీసుకుని ఆ పరిధిలో వ్యక్తిత్వాన్ని యిముడ్చుకునేవాడు (collective being) అని భాష్యం చేశారు.

వ్యక్తి చైతన్యం సామాజిక చైతన్యం తాలూకు విషయి గావడంవల్ల ఒక విశిష్టవ్యక్తి (రచయిత) యొక్క సృజనాత్మక కృషి సామాజిక చైతన్యం తాలూకు సృజనాభివ్యక్తే అవుతున్నది. (భాషా, సామాజిక చైతన్యమూ ఒక్కటే అయినందువల్ల భాషలేకుండా భావాలులేవు; వ్యక్తి అంతరంగంలోని తలంపులు కూడా సామాజిక చైతన్యంలోని భాగమే). అయితే 'సృజన' ఏమిటి? కొత్త భావాలు ఎలా వస్తున్నవి, వ్యక్తికీ వ్యక్తికీ మధ్య భిన్నాభిప్రాయాలూ, అభిరుచుల వైవిధ్యం వీటి తత్త్వం ఏమిటి? సామాజిక చైతన్యం తాలూకు "విషయి"గా వ్యక్తి స్థితిని బట్టి దృశ్యం భిన్న స్వరూపాలలో, పరిమాణాలలో కన్పించడంవల్ల భిన్నభావాలూ, సామాజిక చైతన్య పరిణామంవల్ల కొత్తభావాలు ఉదయిస్తున్నవని సమాధానం. అన్ని కొత్త భావాలకూ విప్లవ గతిలో సార్థక్యం వుంటుందా? అంటే వుండదు; కాని ఆ విషయం సమాజమే, సామాజిక చైతన్య పరిణామమే నిర్ణయించి తేల్చివేస్తుంది. చరిత్రగతిలో, రాజకీయవాదికి ప్రత్యేకమైన అధికారం లేదు యీ విషయంలో.

మార్క్స్ గొప్ప మానవతావాది. విప్లవకారుడుగా, కమ్యూనిస్టు ఉద్యమ విజయం కోసం సాహిత్యాన్ని సాధనంగా నిర్దేశించినప్పటికీ, కాలాతీతమూ నిత్య నూతనమూ విశ్వజనీనమూ అయిన సృజనాత్మక సాహిత్యానికి ఆయన ప్రత్యేక స్థానం యిచ్చారు. హోమర్, షేక్స్పియర్, డాంటే, గథే ఆయనకు అభిమాన రచయితలు. వారి కావ్యాలలోని మాటలూ, నుడులూ మార్క్స్ రచనా వ్యాసంగంలో సర్వత్రా దర్శనమిస్తాయి. "సామాజిక స్పృహ" కలిగిన సాహిత్యాగా డికెన్స్, థాకరే, బాల్జాక్ వంటి రచయితల నవలల్ని మెచ్చుకున్నాడు మార్క్స్. వాటిలో చారిత్రిక సామాజిక సన్నివేశాన్ని బహుముఖాల అవగాహన చేసుకునే అవకాశాన్ని దర్శించాడు. ఆ రచయితలు సోషలిస్టు రచయితలు కాకపోయినా సరే ఉత్తమ సాహితీ స్రష్టలుగానే పరిగణింపబడ్డారు ఆయన దృష్టిలో. విప్లవ భావాలనూ వెదజల్లే రచనలూ, సృజనాత్మకం కాకపోయినా, ప్రచార సాహిత్యంగా వాటి విలువను గుర్తించాడు మార్క్స్. పై మూడురకాల సాహిత్యాన్నీ విస్పష్టంగా వేరువేరుగా దర్శించాడు

మార్క్సు. మార్క్సిస్టులు యీ మూడురకాల సాహిత్యాన్నీ ఒకే ప్రమాణంతో తమ రాజకీయాలకు పనికి వస్తుందా? రాదా? అన్న దృష్టితో చూసి మార్క్సు మానవతావాదానికి అపచారం చేశారు.

కమ్యూనిస్టు మేనిఫెస్టోలో ఇలా వున్నది; "మానవుని భావాలూ, అభిప్రాయాలూ, ఊహలూ- అంటే మానవ చైతన్యం అనేది భౌతిక పరిస్థితులతోబాటు మానవ సామాజిక సంబంధాల మార్పుతోబాటు మారుతూవుంటుందనే అవగాహనకు లోతైన గ్రహణశక్తి ఏమీ అవసరం లేదు. భావాలు మారుతూ వచ్చిన చరిత్రగతి చూస్తే భౌతికమైన ఉత్పాదనతో సరితూగుతూ భౌతిక ఉత్పాదనల లక్షణం కూడా మారుతున్నదనే నిరూపణ అవుతున్నది. ఒక్కొక్కయుగంలో వైభవాన్నీ, ప్రాధాన్యాన్నీ గడించిన భావాలు ఆనాటి అధికార వర్గం యొక్క భావాలే గావడం ఎప్పుడూ వున్న విషయమే."18 ఆ చివరి వాక్యం ఆధారంగానే రాజకీయవాది రచయితనూ సాహిత్యవేత్తనూ తనకు లొంగి ప్రవర్తించమంటున్నాడు.

కాని కమ్యూనిస్టు మేనిఫెస్టోలో మార్క్సు ప్రధానంగా బూర్జువా రచయితల్ని గూర్చి ప్రస్తావిస్తున్నాడనటంలో సందేహంలేదు. బూర్జువా వ్యవస్థ ప్రతి వ్యక్తినీ భ్రష్టంచేసి దాని సహజ మర్యాదనూ గౌరవాన్నీ మంటగలిపింది. వైద్యుణ్ణి, న్యాయవాదినీ, మతాచార్యుణ్ణీ, కవినీ, శాస్త్రవేత్తనూ కూలివానిగా మార్చివేసింది.... తత్ఫలితంగానే జర్మనీలో సోషలిస్టు కమ్యూనిస్టు పేరుపెట్టుకొన్న ప్రచురణలు ఏవో కొన్ని తప్ప మిగిలినవన్నీ, కుళ్లిన నిర్జీవమైన సాహిత్యం క్రిందే వస్తాయి."19 ఇక్కడ ఒక రచన సోషలిస్టు కమ్యూనిస్టు భావాలలో నిండివున్నదా, లేదా అని చూడటంలేదు మార్క్సు. అది బూర్జువా 'ఉత్పత్తి' క్రింద వస్తుందా, రాదా అనే చూస్తున్నాడు.

ఒక రచన బూర్జువా 'ఉత్పత్తి' క్రింద ఎలా పరిగణింపబడుతుంది? దాన్ని మార్క్సు యిలా వివరిస్తాడు: "ఒక రచనే 'ఉత్పత్తి'గానూ తద్భిన్నంగానూ కూడా వుండవచ్చు. మిల్టన్ 'పారడైజ్ లాస్ట్' అయిదు పౌన్లకి వ్రాయడం అది ఆయిన్ని 'ఉత్పత్తి' శ్రామికుణ్ణి చేయదు. పుస్తక విక్రేత కోసం కూలివాడుగా వ్రాసే రచయితే ఉత్పత్తి శ్రామికుడు. మిల్టన్ 'పారడైజ్ లాస్ట్' వ్రాశాడంటే అది పట్టుపురుగు పట్టును వుత్పత్తి చెయ్యడం వంటిది. అది అతని సహజ ధర్మం. ఫలితాన్ని అయిదు పౌన్లకి అమ్మితే అమ్మి వుండవచ్చు.... తన పాటని తనుగా అమ్ముకునే గాయని చేస్తున్నదీ ఉత్పత్తి శ్రామికత్వం గాదు. ఒక వ్యాపారి ఆమెని నియమించి ఆమె పాటద్వారా డబ్బు సంపాదించడం ప్రారంభించగానే ఆమె వుత్పత్తి శ్రామికుల్లో

చేరుతుంది. అప్పుడామె పెట్టుబడిని ఉత్పత్తి చేస్తున్నది"[20] మార్క్స్ మానవతా దృక్పథాన్ని సరిగా అవగాహన చేసుకోవలసిన సందర్భం యిది. దీన్ని అవగాహన చేసుకోని రాజకీయవాది తను కమ్యూనిస్టునని చెప్పుకుంటూనే, రచయితని ఉత్పత్తి శ్రామికునిగా దిగజారుస్తూ అతని శక్తిని రాజకీయాలకు పెట్టుబడిగా మార్చే ప్రయత్నం చేస్తున్నాడన్నమాట.

కాల ప్రభావానికి లొంగని విశ్వజనీన సాహిత్యాన్ని గూర్చి, కళలను గూర్చి మార్క్స్ యిలా చర్చించాడు: "కళల విషయం చూస్తే కొన్ని యుగాల్లో అవి చెందిన వికాసం, మానవ సమాజం యొక్క ఆనాటి అభివృద్ధి స్థాయి దృష్ట్యా చాల విపరీతంగానూ, అసంబద్ధంగానూ కనిపిస్తుంది. అంటే సమాజం యొక్క భౌతిక ప్రాతిపదికలో ఆనాటి సామాజిక సంవిధానం అనే అస్థిపంజరంలో పొసగని పరిమాణంలో ఆ కళల ఔన్నత్యం ఉంటున్నది. ఉదాహరణకు ఆధునిక రచయితలలో గ్రీకుల్నీ, షేక్స్పియర్నీ పోల్చండి. అంతేకాదు, కొన్ని ప్రక్రియలు "ఇతిహాసం" [ఎపిక్] వంటివి ఆ స్థాయిలో, ప్రపంచ చరిత్రలో గణనీయమైన స్థాయిలో, స్పృహణీయమైన ఆ స్వరూపంలో మళ్లీ ఉత్పత్తి చెయ్యడం అసాధ్యం అని కూడా గుర్తించక తప్పదు. అందువల్ల కళారంగంలో కొన్ని విశిష్ట రచనలు బహుశా సమాజ పరిణామం యొక్క తొలిపరిస్థితులలోనే సాధ్యమేమో అనిపిస్తుంది. కళారంగంలోనే యిలాంటి వైవిధ్యాలూ వాటి అంతర సంబంధాలూ నిర్ణయించడం కష్టమైతే, కళారంగం మొత్తాన్నీ తీసుకొని దానికీ సమాజ పురోగతికీ గల సంబంధాన్ని నిర్ణయించడం అసాధ్యం కావడంలో ఆశ్చర్యంలేదు. ఈ వైరుధ్యాలను సూత్రీకరించడమే కష్టం. వాటిని గుర్తిస్తే మనకు వివరణ లభించినట్లే." [21]

తన దర్శన సిద్ధాంతం ప్రకారం విశ్వజనీనమైన కళా సృష్టిని సూత్రీకరించడం కష్టమని అంగీకరించినా, మార్క్స్ బూర్జువా వ్యవస్థ దృష్ట్యా మానవుని సృజనశక్తిని గూర్చి ఆలోచించినప్పుడు మరొక వివరణను అందించాడు: "తొలియుగాల్లో మానవత్వం, జాతి, మత, రాజకీయ సంకుచిత పరిధుల్లో బందీయై ఉపలక్షింపబడినప్పటికీ, ఆనాటి 'ఉత్పత్తి' కి ధ్యేయం మానవుడే అయినట్లు కనిపిస్తుంది. ఆ స్థితి ఆధునిక ప్రపంచంతో పోలిస్తే ఉన్నతంగానే తోస్తుంది. ఇక్కడ మనిషి ధ్యేయం ఎంతసేపూ ఉత్పత్తి, ఉత్పత్తి ధ్యేయం సంపద [వెల్త్]. బూర్జువా ముసుగు తొలగిస్తే "సంపద" అంటే ఏమిటి? వ్యక్తుల తాలూకు అవసరాలూ, సామర్థ్యాలూ, విలాసాలూ, ఉత్పత్తి శక్తులూ వగైరా. ప్రకృతి వనరులమీద మనుష్య ప్రకృతిమీద పెత్తనం సాగించడంలో అభివృద్ధి సాధించడమేనా? దీని అర్థం మానవ సృజన

శక్తుల్ని ఎటువంటి ముందుచూపూ ఆలోచనా లేకుండా [గత చరిత్ర స్ఫురణ తప్ప] సాగదీసుకుంటూ పోవడమే. ఎటువంటి ప్రమాణం లేకుండా దానికదే లక్ష్యం అనే ధోరణిలో తప్ప మరేమున్నది? ఒక నిర్దిష్ట స్వరూపం ధ్యేయంగా పెట్టుకొని మానవుడు పునఃసృష్టి కావడం బదులు, తన సర్వస్వాన్నీ ఉత్పత్తిగా మార్చడమే జరుగుతున్నది. ఈ బూర్జువా ఆర్థిక వ్యవస్థలో, దీని తాలూకు ఉత్పత్తియుగంలో, మానవ అంతరిక శక్తియుక్తుల పూర్ణ విజృంభణ ఫలితం పూర్తిగా వట్టిపోవడమూ, ఖాళీ అయిపోవడమూ. మనిషి తాను వస్తువుగా మారి ఆత్మ పరిత్యాఖ్యాసం పొందటమూ, లక్ష్యశుద్ధి కోల్పోయి తన స్వాతంత్ర్యాన్ని తనకుగాని లక్ష్యానికి బలిపెట్టడమూ, అందుచేత పాత ప్రపంచపు పసితనమే మనకంటే ఉన్నతంగా భావిస్తోంది. మరోవిధంగా చూస్తే ఆనాటి సృజన ఒక నిర్ణీత పరిధిలో, పరిణతి పొందిన ఆకృతిగా, స్వరూపంగా అన్నింటిలోనూ వ్యక్తం అవుతూ వుండడంవల్ల, అది నిజంగానే మనకంటే ఉన్నతస్థితి అవుతున్నది. ఆ పాతలోకం ఒక సంకుచిత దృక్పథం నుంచీ మనిషికి పరితృప్తినిస్తుంది. ఈ ఆధునిక లోకం అటువంటిదేమీ యివ్వలేదు; ఎక్కడైనా తనలో తను తృప్తిపడినా ఆ అనుభవం అల్పమైనదిగానూ, అతి సాధారణమైనదిగానూ వుంటున్నది." 22

మానవుని పరిశ్రమ, సృజన అతనికి తృప్తినీ ఆనందాన్నీ యివ్వాలి. అది లోపించడమే బూర్జువా వ్యవస్థలో 'ఉత్పత్తి' లక్షణం అయి, మానవుడు తన శ్రమ తాలూకు ఫలితంనుంచీ అన్ని విధాలా వంచితుడౌతున్నాడు? మార్క్స్ ఏ వ్యవస్థలో కానీ 'సృజన'ను 'ఉత్పత్తిగా' పరిగణించడు. దాన్ని మానవ సహజ ధర్మంగానూ, స్వేచ్ఛకు లక్షణంగానూ వర్ణిస్తాడు. ఆయన ఊహలో, కమ్యూనిస్ట్ వ్యవస్థలో 'స్వేచ్ఛ', దాని ఫలితమైన 'సృజన', పరాకాష్ఠపొందుతవి. భౌతిక 'అవశ్యకతను' అధిగమించే మానవ స్వేచ్ఛ ప్రతియుగంలోనూ ఎంతో కొంత సాధ్యమే అయినా బూర్జువా వ్యవస్థలో దానికి అవకాశం అతి స్వల్పమనీ, కమ్యూనిస్ట్ వ్యవస్థలో అత్యధికమనీ మార్క్స్ భావనగా తోస్తుంది. 'కాపిటల్-3 భాగం' లో మార్క్స్ యిలావ్రాశాడు.

"అవశ్యకత (నెసెసిటీ) నిర్దేశించే పరిశ్రమా, ఇతర ప్రాపంచిక నిర్బంధాలూ ముగిశాకే స్వేచ్ఛాలోకం ప్రారంభమౌతుంది. అందువల్ల సహజంగానే అది భౌతికమైన ఉత్పత్తి పరిధికి చెందదు. అనాగరక మానవుడు నైమిత్తికాల కోసం ప్రకృతితో పెనుగులాడిన రీతిగానే, ఆధునిక మానవుడు సామాజిక వ్యూహంలో అన్ని రకాల ఉత్పత్తి విధానాల మధ్యన పెనుగులాడక తప్పదు. నాగరకతతోబాటు వాంఛలూ, వాటితో భౌతిక అవశ్యకతా ఇతోధికంగా పెరుగుతూ వుంటాయి. వాంఛల్ని తీర్చేం

దుకు ఉత్పత్తిశక్తులూ పెరుగుతవి. అటువంటి పరిస్థితుల్లో స్వేచ్ఛా స్వరూపం ఏమిటి? సామాజికులైన మానవులు ఒకరిమీద ఒకరు ఆధారపడిన వుత్పత్తిదారులుగా వుంటూ ప్రకృతితో తమ లావాదేవీలను హేతుబద్ధంగా నియమించుకొని, ప్రకృతి శక్తులకు గుడ్డిగా లోబడిపోకుండా, ప్రకృతిని ఉమ్మడిగా అదుపులోనికి తెచ్చుకొని మానవశక్తి వ్యయం చాల తక్కువగా వుండేలా చూస్తూ, మానవ ధర్మానికి అనుగుణమైన పరిస్థితుల్ని సృష్టించుకోవడం. అయినప్పటికీ ఆవశ్యకతా బంధం ఆధారంగానే ఆ స్వేచ్ఛా లోకం రేకు విప్పగలదు. రోజులో పని చెయ్యవలసిన కాలం తగ్గడం దానికి మొదటి మెట్టు...."[23]

ఆవశ్యకతను దాటి వికసించే మానవ శక్తియుక్తుల సృజనాత్మకత ప్రతి యుగంలోనూ, సైన్సులో, కళల్లో, సాహిత్యంలో వైవిధ్యంలో సంస్కృతి పరంగా అభివృద్ధి పొందుతుందనే మార్క్స్ అవగాహన. భౌతిక ఆవశ్యకత నుంచి 'సృజన'ను సూత్రీకరించడం నియమించడం సాధ్యం కాదనే ఆయన భావం.

బూర్జువా వ్యవస్థలో మార్కెట్, పెట్టుబడి, లాభం ప్రాముఖ్యం వహించడం వల్ల కళాకారునికీ రచయితకూ న్యాయం జరగదు. "పెట్టుబడిదారీ ఉత్పత్తి కొన్ని రకాల మేధాగతమైన ఉత్పత్తికి విరోధి— ఉదా: కళలకూ, కవిత్వానికీ" అన్నాడు మార్క్స్.[24] జరుగుతున్న విడ్డూరం ఏమిటంటే ఈ బూర్జువా వ్యవస్థలో మార్క్సిస్టు ముసుగువేసుకున్న వాళ్ళు ఒక రకం సాహిత్యాన్ని పెట్టుబడి చేసుకొని రాజకీయంగా లేక ధన రూపేణా లాభం పొందాలని ఆశిస్తూ వుండటం. తెలుగుదేశంలో నేటి సాహిత్యం అటు పుస్తక విక్రేతల చేతుల్లోనూ ఇటు మార్క్సిజం విక్రేతల చేతుల్లోనూ పెట్టుబడిదారీ 'ఉత్పత్తి'గా మారడం వల్ల సాహిత్యంలో సృజన క్షీణించి 'సామాజిక స్పృహ' నేతిబీరకాయలో నేయిగానే మిగిలిపోతున్నది. ఆశ్చర్యమేమీ లేదు. ఇది మార్క్స్ ప్రవచనమే. మనం బూర్జువా వ్యవస్థ సరిహద్దుల్లోపలే వున్నామింకా!

NOTES:

4. "In the social production in which men engage they enter into definite relations. These relations of production correspond to a definite state of development of their material powers of production. The totality of these relations of production constitutes the economic structure of society — real basis, on which legal and political superstructures arise and to which definite forms of social consciousness correspond. The mode of production of material life conditions the social, political, and intellectual process of life as a

whole. It is not the consciousness of men which determines their being, but, on the contrary, their social being which determines, their consciousness. At a certain stage of their development, the material forces of production in society come in conflict with the existing relations of production, or with the property relations within which they had been at work before. From forms of development of the forces of Production these relations turn into their fetters. Then occurs a period of social revolution. With the change of the economic foundation the entire superstructure is more or less rapidly transformed. In considering such transformations, a distinction should always be made between the material transformation of the economic conditions of production which can be determined with the precision of natural science, and the legal, Political, religious, artistic or philosophical in short, ideological – forms in which men become conscious of this conflict and fight it out". (works, Marx and Engels, from *Karl Marx and World Literature*, by S.S.Prawer, O.U.P., 1976; page 294).

5. "According to the materialist conception of history, the *ultimately* determining element in history is the Production and reproduction of real life. More than this neither Marx nor I have ever asserted. Hence if somebody twists this into saying that the economic element is the *only* determining one, he transforms that proposition into a meaningless, abstract, senseless phrase. The economic situation is the basis, but the various elements of the superstructure– political froms of the class struggle and its results, to wit: constitutions established by the victorious class after a successful battle, etc., juridical froms, and even the reflexes of all these actual struggles in the brains of the participants, political, juristic, philosophical theories, religious views, and their further development into systems of dogma— also exercise their influence upon the course of the historical struggles and in many cases preponderate in determining their forms. There is an interaction of all these elements in which, amid all the endless host of accidents (that is of things and events whose inner interconnection is so remote or so impossible of proof that we can regard it as nonexistent, as negligible), the economic movement finally asserts itself as necessary. Otherwise the application of the theory to any period of history would be easier then the solution of a simple equation of the first degree." (Engel's letter to Bloch in September, 1890, quoted in *Marxism and Literature,* Raymond Williams. O.U.P. 1977, Pages 79–80)

13. "The chief defect of all materialism up to now is, that the object, reality, what we apprehend through our senses, is understood only in the form of the *object of contemplation;* but not as *sensuous human activity*, as *practice;* not subjectively. Hence in opposition to materialism the *active* side was developed abstractly by idealism which of course does not known real sensuous activity as such." (Marx and Engels; German Ideology, quoted in *Marxism and Literature,* Page 30)

14. "Language is as old as consciousness, language is practical consciousness, as it exists for other men, and for that reason is really beginning to exist for me personally as well; for language, like consciousness, only arises from the need, the necessity, of inter course with other men." (Marx and Engels; Germen Ideology, quoted in *Marxism and Literature,* Page 29)

16. "...following volosinov, we can see that just as all social process is activity between real individuals, so individuality, by the fully social fact of language (whether as 'outer' or 'inner' speech), is that active constitution, within distinct physical beings, of the social capacity which is the means of realization of any individual life. Consciousness, in this precise sense, is social being." (*Marxism and Literature*, pages 41–42)

17. "It is above all necessary to avoid postulating soiety once more as an abstraction confronting the individual. The individual is a *Social being.* The manifestation of his life — even when it does not appear directly in the form of a social manifestation, accomplished in association with other men—is therefore a manifestation of *Social life*......Though man is a unique individual — and it is just his particularity which makes him an individual, a really *individual* social being — he is equally the *whole*, the ideal whole, the subjective existence of society as thought and experience." (Marx, Economic and philosophical Manuscripts of 1844, quoted in *Marxism and Literature*, page 194)

21. "In the case of arts it is well-known that certain periods in which they flowered are out of all proportion to general development of society, hence also to its material basis, the skeletal structure, as it were, of its organization. The Greeks, for instance, compared with the modern or also Shakespeare. It is even recognized that

certain forms of art, the epic, for instance, cannot be produced in their world-epoch-making, classical form once the production of art as such begins; that therefore certain significant formations within as such begins; that therefore certain significant formations within the domain of art itself are possible only at a low stage of development. If this is true of the relation of different kinds of art within the domain of art itself, it is already less surprising that the same should be true of the relation in which the whole domain of art stands to the general development of society. The difficulty lies only in the general formulation of these contradictions. As soon as they have been specified they are already explained." (Marx, Foundations of Politcal Economy, quoted in Karl Marx and World Literature, pages 278-279)

22. "the ancient conception, in which man, though in various narrow national, religious and political determinations. always appears as the aim of production, seems to be very superior to the modern world in which production appears as the aim of man and wealth as the aim of production. In fact, however, when the narrow bourgeois form is cast aside, what is wealth but the universality of the needs, capacities, enjoyments, productive forces etc., of individuals? The complete development of human domination of natural forces, those of so-called 'nature' as well as those of the individual's own nature? What is it but the absolute working-out of his own creative dispositions, without any preconception exept that of previous historical development, which makes the totality of this development — i. e. the development of all human powers as such, not measured by any yardstick that is already given — an end in itself? What is this but a situation in which man does not reproduce himself in some predetermined form, but one in which he produces his totality? In bourgeious economics, and the epoch of production that corresponds to it, this complete elaboration of man's inner potential appears as complete depletion, this universal objectification as complete estrangement, and the demolition of all determined, one-sided aims as the sacrifice of autonomy to a wholly external aim. Thus on the one hand the childish ancient world *appears* to be the higher. On the other hand it is the higher world in every thing that demands a finished shape, from, given limitation. The ancient world satisfied from a narrow point. while the modern world affords no satisfaction or, where it does appear satisfied with itself, it is common and mean." (Marx,

Foundations of political Economy, quoted in *Karl Marx and World Literature*, pages 287–288).

23. "The realm of freedom truly begins only where labour determined by necessity and mundane considerations ceases; in the very nature of things, therefore, it lies beyoned the sphere of actual material production. Just as the savage must wrestle with nature to satisfy his wants, to maintain and reproduce life, so must civilized man, and he must do so in all social formations and under all possible modes of production. With his development this realm of physical necessity expands as a result of his wants; but, at the same time, the forces of production which satisfy these wants also increases. Freedom in this domain can only mean that socialized men, the associated producers, regulate their interchange with nature rationally, bringing it under their common control, instead of being ruled by it as by the blind forces of nature; and achieving this with least expenditure of human energy and under conditions most favourable to, and most worthy of, their human nature. Nonetheless this still remains a realm of necessity. Beyond it begins that development of human power which is its own end, the true realm of freedom, which, however, can blossom forth only with this realm of necessity as its basis. The shortening of the working-day is its fundamental premises." (Marx, Capital, Part-III, quoted in Karl Marx and World Literature, pages 312–313).

రచనల కోసం విజ్ఞప్తి

ఆర్థిక ఇబ్బందులు, నిర్వహణా సమస్యలతోపాటు సృజన రచనల విషయంలో కూడ తీవ్రమైన కొరతను ఎదుర్కొంటున్నది. కళా విలువలులేని నినాదప్రాయమైన పాటలు, కవితలు, మూసలోపోసిన ఫార్ములా పద్ధతి కథలు, ఇతర భాషల్లోని మంచి రచనలకు (చెడ్డ) అనువాదాలు తప్ప మౌలికమైన ఉత్తేజకరమయిన కనీసం తృప్తికరమైన రచనలు రావడంలేదు. ముఖ్యంగా సాహిత్య విమర్శ, సమీక్షలు, మౌలికమైన సృజనాత్మక రచనలు కరువయినాయి. ఉత్తమమైన రచనలు పంపించి ప్రజాసాహిత్య ప్రమాణాలు ఉన్నతంగా కాపాడడంలో సృజనకు ఇతోధికంగా సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

— 'సాహితీ మిత్రులు'

శ్రీశ్రీతో ఇష్టాగోష్టి

[శ్రీశ్రీ ఇటీవల ఖమ్మం వచ్చినపుడు ఆయనతో నీరుకొండ హనుమంతరావు, డా॥ హరీష్, కె. రాంమోహన్‌రాజు కొంత సేపు ఇష్టాగోష్టి జరిపారు. ఆ సందర్భంలో వేసిన కొన్ని ప్రశ్నలూ, శ్రీశ్రీ జవాబులూ.]

శ్రీశ్రీ 'మరో ప్రస్థానం' డెబ్భయ్యో ఏట :

నీరుకొండ : మీ'మరోప్రస్థానం' కోసం ఎదురు చూసేవారికి దాన్ని ఎప్పుడు అందిస్తారు ? 1980లో అందిస్తారని ఆశించవచ్చా ?

శ్రీశ్రీ : అప్పుడే తేదీ గూడా నిర్ణయించుకున్నానే. 1980 జనవరి, ఫిబ్రవరి, మహాఅయితే మార్చి ఫస్ట్ క్వార్టర్ లోపున.

శ్రీశ్రీ కవిత్వంపై పారిశ్రామిక ప్రతీకల ప్రభావం :

హరీష్ : మిమ్మల్ని ప్రభావితం చేసిన కవులెవరు ?

శ్రీశ్రీ : ఒకరేమిటి ? అనేకులు. ఒక విధంగా చూస్తే తొలిరోజుల్లో కాదు గానీ చివరిరోజుల్లో 1950 నుంచి మాయకోవస్కీ - అతను సరాసరి ఉద్యమం నుంచి వచ్చినవాడు. అంతకు ముందు ఇంగ్లండ్‌లో డబ్ల్యు.హెచ్. ఆడెన్, స్టీఫెన్ స్పెండర్ మొదలైన వారురాసిన నవ్య కవిత్వం. ఈ నూతనత్వం, ఈ పారిశ్రామిక నాగరికతకు చెందిన ప్రతీకలు, ఇమేజస్.... 'రైలుబండి ఒక పెద్ద స్టేట్ మెంటుకేసి బయలు దేరింది, టి.ఎస్. ఇలియట్ 'ఆకాశం సాయంకాలం ఒక మతిపోయిన రోగిలా పడివున్నది' అంటాడు. ఇవన్నీ మోడర్న్ ఇమేజస్. నా కవిత్వాన్ని ప్రభావితం చేసిన అనేకులలో ఇటువంటి వారి కవిత్వాలు కొన్ని.

సూర్యోదయం కూడా ఆక్సిడెంటే....?

రాం : కవిగా మీ అవతరణ అభ్యుదయ కవిత్వంలో ఆక్సిడెంట్ అంటున్నాడు వేగుంట. మీరేం చెబుతారు ?

శ్రీశ్రీ : అది వేగుంట అభిప్రాయం. ఆక్సిడెంట్ అనుకుంటే ఒక విధంగా సూర్యుడు ఉదయించడం గూడా ఆక్సిడెంటే. రేపొద్దున ఉదయించకపోవచ్చు.

ధ్వని కమ్యూనిజాన్ని ధనిస్తేనే ధ్వని కవిత్వం

హరీష్ : మీరోసారి ధ్వనికవిత్వం కమ్యూనిజంలోనే సాధ్యం అన్నారు. ధ్వని కవిత్వం అంటే ఏమిటి ?

శ్రీశ్రీ : అహఁ ధ్వని కమ్యూనిజాన్ని ధ్వనిస్తేనే ధ్వని కవిత్వం అన్నాను. ఆనంద వర్ధనాచార్య లేమన్నారంటే- వ్యంగ్యార్థం ఓటివుంటుందనీ. కవిచెప్పిన దాని

కంటే గూడా అందులోంచి మనకి అవగాహన అయేటువంటిదే ధ్వని అంటారు. 'రీతి ఆత్మస్య కావ్యం' అని ఒకడన్నాడు. 'రసాత్మకం వాక్యం కావ్యం' అని ఒక డన్నాడు. ఇట్లాగ – ఔచిత్యం ముఖ్యమని క్షేమేంద్రుడు– రసచర్చ చేయడంలో ఎందరో సంస్కృత ఆలంకారికులు చెప్పారు. వీటన్నిటిలోకి ధ్వనిమతం గొప్పది అంటారు. ధ్వని అంటే కవిచెప్పిన దానికంటే గూడా పాఠకుడు పీల్చుకునేదే గొప్ప కవిత్వం. అది అందర్లోనూ వుండదు. ధ్వని ప్రధానమైందే కావ్యం అన్నారు. అలాగ మనరచనల్లో కమ్యూనిజంధ్వని స్తేనే అది ధ్వని అని నేనన్నాను.

మినీ కవితలు యువకవుల ఉత్సాహానికి నిదర్శనం

రాం : తెలుగు కవిత్వంలో ఈ మధ్యవచ్చిన మినీకవిత మీద మీ అభిప్రాయం?

శ్రీశ్రీ : యువకవుల ఉత్సాహానికి నిదర్శనంగా తీసుకుంటాను. ఆంధ్రజ్యోతిలో చూస్తుంటాను కదా కొత్తకలాలు అవీ. ఇంకా సామాజికస్పృహ లేదనే అనిపిస్తుంది. కవిత్వం రాయాలన్నంతగా సామాజిక వాస్తవ గ్రహణం రాలేదని అనిపిస్తుంది. నా 'సిరిసిరిమువ్వ' అంటే అది జర్నలిజం. జర్నలిస్టిక్ స్థాయిలోనే వుంది తప్ప సమాజానికి లీడ్ ఇవ్వగలిగే కవిత్వం ఇంకా రావడంలేదు. కానీ వారి ఉత్సాహానికి నిదర్శనంగా అవిమనకు కనబడుతూవుంటాయి. చాలాచురుకైన రచనలు గూడా వున్నాయి. వారికి సామాజిక అవగాహన వుంటే ఇంకా ఎంతబాగా రాయగలుగుదురో.

రాం : అంటే కుందుర్తి, సోమసుందర్‌ల దీర్ఘవచనాలకన్నా ఈ ప్రక్రియ మేలైందే నంటారా?

శ్రీశ్రీ : కనీసం అది చదువుతారు........దీర్ఘ రచనలకంటే అంత ఓపికలేదు. నాలుగు పేజీలుందనుకోండి. దాన్ని స్లిప్‌చేసి దీన్నిచదువుతారు. ఆమేరకిఇది మేలు.

కవిసేన మాడర్న్‌రీ ఆర్మమెంట్

రాం : కవిసేన మానిఫెస్టో మీద మీ అభిప్రాయం?

శ్రీ శ్రీ : ఏదీ మన గుంటూరు శేషేంద్ర కదా! అది ఒక విధంగా చూస్తే మోడర్న్‌రీ ఆర్మమెంట్ లాగా, సాల్వేషన్ ఆర్మీలాగా వీళ్ళంతా మిలిటరీ పద్ధతులే అవలంబిస్తారు. మేజర్ బార్బరాలో బార్బరాతండ్రి మారణాయుధాల వ్యాపారం చేసే కోటీశ్వరుడు. బార్బరా తండ్రి దగ్గరకు సాల్వేషన్ ఆర్మీచందా కోసం వెడుతుంది. తండ్రి అంటాడు. నేను మారణాయుధాలు అమ్మేవాణ్ని కదా! నన్ను చందా ఇవ్వ మంటావేమిటి? అని. పక్కన ఒకడుంటాడు. వాడు వ్యవస్థ మార్చడానికి ఆయుధాలే అవసరం అంటాడు. బాలెట్లు కాదు బులెట్లు అని కూడా అంటాడు. ఇలాగ రామ దండులాగ, సాల్వేషన్ ఆర్మీలాగ ఇదీ కవిసేనే.

చలం

హరీష్ : చలం చచ్చిపోయాడా ?

శ్రీశ్రీ : అంటే భౌతికంగా చచ్చిపోయినట్టే గదా

నీరుకొండ : చలం సాహిత్యం మీద విమ్మగడ్డ వెంకటేశ్వరరావు విమర్శ గూర్చి మీ అభిప్రాయం ?

శ్రీశ్రీ : అది కొంచెం అన్‌కైండ్. మరీ అంత కొట్టి పారెయ్యాల్సిన రచయిత కాదు గదా చలం ? చలాన్ని శ్మశాన సాహిత్యం అంటే మరి సజీవ సాహిత్యం ఎక్కడుంది ? ఐనా నేను చలంగారు చచ్చిపోయిం తర్వాత రాస్తూ - మార్క్సిస్టు దృక్పథం లేకపోవడంచేత (అసలు మార్క్సిస్టు దృక్పథం ఒకటుందని ఆయనకి తెలియదు) - ఆయన సంఘరోగాన్ని నిదానం చెయ్యగలిగాడు గానీ రోగాన్ని తగ్గించే మందును దానికి ఇవ్వలేక పోయాడని అన్నాను.

తెలుగు సినిమా - నాన్ తెలుగు దర్శకులు

హరీష్ : తెలుగు సినిమాల్లో ఈ మధ్య వచ్చిన మార్పులు ఏమైనా వుంటే చెప్పండి. అట్లాగే మృణాల్‌సేన్ గూర్చి గూడా మీ అభిప్రాయం.

శ్రీశ్రీ : మనం ఒక పొరపాటు చేస్తున్నాం. గౌతమ్‌ఘోష్ సినిమా భాష అందరికీ అర్థమయేభాష, దానికి భాష రావాల్సిన అవసరంలేదు అన్నాడు. రామూ కరియత్ ఏమో సినిమాకి కథ అవసరం లేదన్నాడు. ఉత్తమమైన సినిమాకి – చార్లీ చాప్లిన్‌నే తీసుకోండి. అతని సినిమాలు చూసి ప్రపంచం అంతా పెద్ద ఆర్టిస్టుగా గుర్తించింది, అవి మూకీలు. ఈనాడు భాషకు సంబంధించినవి పాటలు, డైలాగులన్నీ తెలుగులోనే వుండాలిగదా ! అందు చేత మృణాల్‌సేన్ రావడం నాకు ఇష్టంలేదు. నా ఇష్టా ఇష్టాలతో ఇవన్నీ జరిగేవి కావనుకోండి. శ్యాంబెనెగల్ రావడం గూడా నాకు ఇష్టంలేదు. మొన్న రామూకరియత్‌ని తీసుకొచ్చారు. ఆయనది డాక్యుమెంటరీ దృష్టి. సినిమాకి కథ అవసరం లేదంటాడు.

హరీష్ : "బైసికిల్ థీఫ్" చూస్తే మనకి భాష అవసరం అనిపిస్తుందా ?

శ్రీశ్రీ : పిక్చరు ఎలావున్నా అందులో ఎన్ని ఇటాలియన్ చమక్కులు వున్నాయో అవన్నీ మనం మిస్ అయిపోయాంగదా ? వృత్త వడసారం మిగిలింది. ఆమేరకి సత్యజిత్‌రేని ఒప్పుకుంటాను. అతనిది ఒకే ఒక పిక్చర్ చూశాను. అదేమిటీ.... నిరుద్యోగి కుర్రవాడుంటాడు.... "ప్రతి ద్వంద్వి" అదినాకు చాలా నచ్చింది. మనం మన భాషలోనే పిక్చర్‌తీసి ఇతర భాషలకి పంపాల్సి వచ్చినప్పుడు ఏవైనా మంచి డైలాగులు రిజిస్టర్ కావాల్సినవి వుంటే ఇంగ్లీషులో సబ్‌టైటిల్స్ వేస్తాం. అంతేగానీ

తెలుగు పిక్చర్‌ని మరోభాష డైరెక్టర్‌తో డైరెక్ట్ చేయించడం వాడెంత గొప్పవాడైనా ఆ రెండూ కలియవేమోననిపిస్తుంది.

సినిమాకు పాటలు అవసరమే

హరీష్ : సినిమాకి పాట అవసరమా ?

శ్రీశ్రీ : పాశ్చాత్య దేశాల్లో మ్యూజికల్స్ అని పేరేవుంటాయి. 'మైఫేర్‌లేడీ' ఒపెరా లాంటివి. మనసినిమాల్లో కత్తిసాము దాన్లోనే వుండాలి. రేప్‌లు దాన్లోనే వుండాలి. పాటలు కావాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో కమర్షియల్ సినిమాలో పాటలు చాలా అవసరం.

హరీష్ : ఇప్పుడున్న పరిస్థితుల్లో అంటే ?

శ్రీశ్రీ : కమర్షియల్ సినిమాలో.

హరీష్ : అంటే ఈ దేశంలో ఇంకోసినిమా గూడా వుందిగదా పారలల్‌గా ?

శ్రీశ్రీ : ఆఁ. ఆఁ. ధనస్వామ్య విధానంలో లక్షలు పెట్టి తీస్తున్నవాడికి వేరు. ఎక్స్‌పెరిమెంట్ సినిమా, న్యూవేవ్ సినిమా అనివున్నాదే వాటికున్న ధ్యేయం వేరు. వీటిల్లో అనవసరం. కానీ ఒకప్పుడు సిట్యుయేషన్‌లో పాటను సహజంగా తీసుకురావచ్చు. పాటలు కేవలం అనవసరం అని అనను.

సైంటిఫిక్ దృక్పథం పెరిగితే ప్రజా సినిమా వస్తుంది

హరీష్ : ప్రజా కళల్లో సినిమా అనేది వుంటుందా ? వుంటే ఎలావుండాలని మీరనుకుంటున్నారు ?

శ్రీశ్రీ : సినిమా అనేది అనేక కళలయొక్క సముదాయం. ఫోటోగ్రఫీ కూడా ఒక కళే. సౌండ్ రికార్డింగ్, స్క్రీన్‌ప్లే, డైరెక్షన్ కూడా కళలే. ఐతే ఈ కళలకి సైన్సు ప్రాతిపదిక. సైంటిఫిక్ దృక్పథం పెరిగిన కొద్దీ ప్రజా సినిమా అనేది వస్తుంది. మనం ఒక కెమెరా పెట్టుకుని హోం సినిమా లాగా 16 ఎం.ఎంలో ప్రొజెక్టర్ ఒకటి పెట్టుకుని ఫిల్ములు తీయవచ్చు. 2 రీళ్ళు తీయవచ్చు.

ప్రజల్లోకి వచనంలోనైనా వెళ్ళవచ్చు, కవిత్వంలోనైనా వెళ్ళవచ్చు-

నీరుకొండ : ప్రజా సమస్యల్ని వివరించడంలో జానపద కళారూపానికి ప్రాధాన్యత ఇవ్వాలంటున్నారు. మన కవులు దాన్ని ఎక్కువగా చేపట్టకపోవడానికి కారణమేమిటి ?

శ్రీశ్రీ : వచనానికీ కవిత్వానికీ మధ్య ఛందస్సున్నదే ఆ భేదంపోయి–ఇంగ్లీషులో డికెన్సు, రష్యన్‌లో తుర్గినేవ్ వాళ్లంతా వచనానికి కావ్యత్వం ఇచ్చారు, జేమ్సు జాయిస్ 'యులీసెస్' నవలనే అంటాం. ఐనా మహాకావ్యం అనాలి. వచనం–కవిత్వం ఈ రెంటికీ మధ్య వుండే సన్నని తీగెని ప్రతిభావంతులైన ఈ రచయితలు తుడిచేశారు. కాబట్టి మనం ప్రజల్లోకి వచనంలోనైనా వెళ్లవచ్చు కవిత్వంలోనైనా వెళ్ళవచ్చు. కవిత్వంలో ఛందస్సు, సీసపద్యాలు, మత్తేభాలు ఇవన్నీ సంవత్సరాలుగా వస్తున్నవి. అవి కూడా భోగవస్తువులుగా, విలాస వస్తువులుగా తయారైనవి. దాన్లో ప్రాచీన కవులు మహాగ్రంథాలు రాశారు. ఈ జానపద కవిత్వం గూడా మొదటి నుంచి వస్తూవున్నది. పడవ నడుపుతూ ఓ పాట పాడేవాడు. పెద్ద పెద్ద కొండల్లో రాళ్లు కొడుతూ ఓ పాట పాడేవాడు. అరక దున్నుతూ ఓ పాట పాడేవాడు. ఆవిధంగా మనకి జానపద సాహిత్యం అవ్యాహితంగా వస్తున్నది. ఈ జానపద రూపాలని ఇమిటేట్ చెయ్యడమే ఈనాడు సినిమా పాటలు యింత పాపులర్‌గావడానికి కారణమని నేను నిస్సందేహంగా చెప్పగలను.

రాం : సినిమా పాటలు ప్రచారం కావడానికి జానపద బాణీలు కారణం అన్నారు గదా– విప్లవ రచయితలు ఇంకా చాలామంది వచన కవితలోనే వుండడానికి కారణమేమిటి ?

శ్రీశ్రీ : అది చాలా మంది లోపమేగానీ గద్దర్ విషయంలో, వంగపండు ప్రసాదరావు విషయంలో అసలేం. జనసేన మంచి పాటలు రాశాడు. రెంజింగూడా. వచన కవిత్వం రాయడం ఈజీకాదు. ఛందోబద్ధ కవిత్వం కంటేగూడా కష్టం. ఛందస్సు కంటే దారిచూపే మార్గమైనా వుంటుంది. వచనంలో అదేంలేదు, మంచి వచనకవిత్వం ఛందోబద్ధ గీతం కంటే గొప్పదని నేననుకుంటాను.

విశ్వవిద్యాలయాలకింకా వేమన కవేకాడు

నీరుకొండ : వేమన కవిత లాగా నేటికవిత ప్రజల నాలుకమీద ఆడకుండా పోవడానికి కారణమేమిటి ?

శ్రీశ్రీ : వేమన కవిత ఈనాడంటే ప్రజల నాలుకల మీదికి వచ్చింది గానీ ఆయన బతికున్న రోజుల్లో ఆయన్ని అనుసరించిన వారెవరు ? అసలు నిన్న మొన్నటి దాకా ఆయన్ని కవిగానైనా ఎవరైనా అంగీకరించారా ? వేమన బతికున్న రోజుల్లో అతన్నో పిచ్చివాడి కిందానూ, ఛందస్సు అదీఏంలేదు అనికొట్టేశారు గదా ! అంటే వేమన కవిత్వం కాలాన్ని జయించి నిలిచింది. మనం గుర్తిస్తున్నామే తప్ప ఇంకా కొంతమందీ, విశ్వవిద్యాలయాలూ గుర్తించడం లేదు. వారి దృష్టిలో వేమన కవేకాదు. దానికేమంటారు ?

మాండలికాలకు డిక్షనరీలు తయారుచేస్తే
యూనివర్సిటీలు తమ ఉనికిని సార్థకం చేసినట్లు

రాం : మాండలికంలో రచనలు చేయడం రచన ప్రచారానికి అవరోధం కలిగించే అవకాశం వుందనుకుంటాను. దానివల్ల ప్రయోజనం పొందగలమని కొందరంటున్నారు. మీ అభిప్రాయం ఏమిటి?

శ్రీశ్రీ : దానికి గిడుగు రామమూర్తి పంతులుగారే ఏనాడో జవాబు చెప్పారు. అతను వ్యవహారిక భాషను ప్రవేశ పెట్టినప్పుడు సరిగా మీలాగే గోదావరి భాష హైదరాబాదులో తెలియదు, అక్కడి భాష శ్రీకాకుళంలో తెలియదు, అది కడపలో తెలియదు దానికి రైమూ, రీజనూ వుందా? అలాగరాస్తే అక్కడి వాడికి బోధపడ్డం ఎలాగ అని! మాండలికాలు యాసవల్ల తప్పకర్త, కర్మ, క్రియలు మారవుగా! తెలుగు కారకము — గ్రామర్ అంటామే అది ఎక్కడైనా ఒక్కటే. పదాల అర్థాలు భేదం కావచ్చును. బాబాయి అంటే మాసైడు — విశాఖలో చిన్నోడు అని అర్థం ఇంకో చోట చిన్నాన్న అని అర్థం. ఇందుకోసం అనిచెప్పి మాండలికాన్ని తిరస్కరించాల్సిన అవసరం లేదు. స్త్రీ అనే పదానికి ఎన్నోవందల వేల పర్యాయ పదాలు ఉన్నాయి. హంసగమన, సారసలోచన అనివున్నాయి. మన కర్థంగాకపోతే డిక్షనరీలో చూసుకుంటాం. మాండలికాలకి యూనివర్సిటీలు డిక్షనరీలు తయారుచేస్తే తమఉనికిని సార్థకం చేసినట్టు అవుతుంది. ఇటువంటి పనులేమో మానేస్తారు నన్నయభట్టుగారిలో ఎంత భాష ఉన్నాది అని దానికేమో అమరకోశం తయారుచెయ్యడం.

'నాకు జాతకాల్లో నమ్మకంలేదు'

హరీష్ : మీకు జాతకాల మీద విశ్వాసం వుందా?

శ్రీశ్రీ : లేదు.

హరీష్ : ఒక ఐదు సంవత్సరాలు ముందుకి చూసి కాలానికి అర్థం చెప్పండి.

శ్రీశ్రీ : నాకు జాతకాల్లో నమ్మకం లేదన్నాను గదా! మళ్లీ జాతకం చెప్పమంటున్నారేమిటి?

"....అమానుష భయానక సంఘటనలు మళ్ళీ మన కళ్ళముందు ప్రత్యక్షమవుతాయ్ — కాస్త ముందోవెనకో వచ్చే ఆ ఘడియలో సోషలిజం ధనస్వామ్య పదఘట్టనలో చితికి రక్తసిక్తమవుతుందని భయపడాల్సిన పనిలేదు." — అనటోల్ ఫ్రాంస్

ఆదిలాబాదు, కరీంనగర్ పల్లెల ప్రజల భాషలో రాసిన అల్లం రాజయ్య నవల 'కొలిమంటుకున్నది' జులై సంచికలో పూర్తయింది. ఆ నవలలోని భాషపై చర్చ సరే సరి సాగుతున్నది. వస్తువు, పాత్రచిత్రణ, సంఘటనలు మొదలైన విషయాల గురించి కూడా నిర్మాణాత్మకమైన విమర్శ పంపించ వలసిందిగా పాఠకులను కోరుతూ రచయిత నవలకు రాసిన చివరి మాట ఈ కింద ప్రచురిస్తున్నాం.

— సాహితీ మిత్రులు

ఇది చివరి మాట కాదు-

చివరి మాటగా నవలకు వెనుకనున్న పరిస్థితులు, కొన్ని నా అనుభవాలు ఈ నవలను అర్థంచేసుకోవడానికి మరింత ఉపయోగపడగలవనే ఉద్దేశంతో రాస్తున్నాను.

నా చిన్నతనంలో లేగల కాయబోయినప్పుడు - వర్షం తుంపర పడుతున్నప్పుడు ఈకాకు చెత్రిలు (గొడుగులు) కుట్టుకొని విప్పచెట్లనీడకు పశువుల కాపర్లమంతా చేరే వాళ్లం. అప్పుడు ఎవడో ఒకడు ఏదో కథ చెప్పేవాడు- కుక్కలవి, నక్కలవి- కొంచెం పెద్దవాళ్లయితే రాజులవి, రాణులవి చెప్పేవాళ్లు ... ఆ కథల్లో చాలా వరకు ఎక్కడో ఒక దగ్గర పశువుల కాపర్లుండేవాళ్లు- వాళ్లు చాలా వింత వింత పనులు చేసేవాళ్లు - ఆ తరువాత ప్రైమరీ స్కూల్ చదువు కోసం మా అమ్మమ్మ ఊరెళ్లాను. అక్కడ తరుచూ నేను మా అమ్మమ్మ దగ్గర పండుకునేవాణ్ని. మా అమ్మమ్మకు అయిదుగురు ఆడపిల్లల్ని, ఒక మొగపిల్లవాణ్ని ఒదిలి మా తాత చనిపోయాడు. అంతమందిని సాదాల్సిన బాధ్యత వలన మా అమ్మమ్మ చిన్నపిల్లలను వెంటేసుకొని దున్నడం, అడివి నుండి కర్రలు తేవడం లాంటివి చేసేది. తను పగలంతా పడ్డ కష్టం మరిచి పోవడానికి రోజూ నాకెన్నో కథలు చెప్పేది. రాను రాను నాకర్థమయిన విషయం ఆమె రోజూ ఎదుర్కొంటున్న సమస్యలనే కథలుగా నాకు చెప్తున్నదని.... అత్యంత విషాదకరమైన పరిస్థితిలో కూడా ఆ కథల్లోని పాత్రలు గంభీరంగా వుండేవి.... నేనెన్నో సార్లు మా అమ్మమ్మ కళ్లవెంట నీళ్లుకారడం చూశాను. కథ రుద్ధ కంఠంతో వెక్కిళ్లతో ముగిసేది.... అట్లా కథలమీద నాకు ఆసక్తి కలిగింది.

ఆరవ తరగతి కోసం మళ్లీ మా ఊరొచ్చాను... మా నాన్న మా వూరి పెద్ద మనుషుల్లో ఒకరు. రోజు ఎన్నో పంచాయితులు మాయింటి ముందు జరిగేవి.

ఆ పంచాయితుల్లో దొంగలు, లంగలు, తాగుబోతులు, వ్యభిచారులు, భూములు పోగొట్టుకున్నోళ్లు, వాళ్లల్లో వాళ్లే తన్నుకున్న వాళ్లు, అప్పులు తీర్చలేనివాళ్లు, కూళ్లు, జీతాలు ఎగబెట్టబడ్డోళ్లు ఇలాగా ప్రతిరోజూ ఎంతోమంది మా యింటి ముందు ఏడుస్తూ, తిట్టుకుంటూ పెద్దల తీర్పును శిరసావహించేవాళ్లు.

రాను రాను వీళ్లంతా ఎందుకిట్లా కొట్లాడు కుంటారో, అసలు వీళ్ల తగువులకు మూలమేమిటోనని తెగ ఆలోచించేవాణ్ని- ఒక్కొక్క పంచాయితి రోజూ నన్ను వెంటా దేది. మా నాన్న తప్పొప్పులను నిర్ణయం పిట్టకథల రూపంలో చేసేవాడు. ఆ నిర్ణయం మీద ఆ కథల మీద నాకు నమ్మకం సడల సాగింది. మా అమ్మ తప్పక ఏదో కారణం చెప్పేది.

అలాగా వందలు కాదు వేల పంచాయతులు విన్నాను- చూశాను. పంచాయతుల్లో నిరుపేద జనం తమ దీన పరిస్థితి చెప్పుకొని ఏడ్చేవారు. తాము నిరపరాధులమని ఆక్రోశించేవాళ్లు. ఒక్కొక్కసారి తీర్పు పంచాయతి పెద్దలు ముందే నిర్ణయించుకునే వాళ్లు.... ఎవడో ఒకడి మీద నేరం మోపబడేది. దండుగలు వసూలు చేయబడి గ్రామాధికార్ల చేతుల్లోకి వెళ్లేవి. చాలా పంచాయతులు పోలీసుపటేల్ లేకుండానే జరిగేవి. దండుగ సొమ్ము మాత్రం అతని దగ్గరికే వెళ్లేది. ఆ దండుగలు చెల్లించడం కోసం జనం ఏదుంటే అదే అమ్మేవాళ్లు.... ఆ అమ్మకం గురించి కూడా జనం చర్చించేవాళ్లు....

వందల భూమి తగాదాల్లో రైతులు ఉన్మాదస్థితికి లోనవడం నేను చాలాసార్లు చూశాను....

అప్పుడే నేను చూసిన జీవితాల గురించి కథలు నాలో సుళ్ళుతిరిగేవి_ కొన్ని పిట్టకథలు అల్లి మిత్రులకు చెప్పేవాణ్ని- కథలకు ముగింపు లుండేవికావు.... "సుఖంగా ఉన్నారు" అని చివరకు చెప్పనందుకు నామిత్రులు నాకు శాత్రాలు (కథలు) చెప్పరావనే వారు.... ముగింపులు ఎంత ఆలోచించినా తట్టేవికావు_ చాలా సార్లు నేను చెప్పిన కథలకే మిత్రులు ఎంతో సునాయాసంగా ముగింపు చెప్పేవాళ్లు. అవి నాకు తృప్తి నిచ్చేవికావు.

హైస్కూల్ చదువు సాగుతుండగా కొంత సాహిత్యం చదివాను. అప్పుడు శరత్, రవీంద్రుడు, చెలం చదివి చదివి పిచ్చెక్కింది. గోపీచందు 'చీకటి గదులు' చదివి ఉన్మాదిలా పలవరిస్తూ తిరిగాను_

ఈ సమయంలోనే కాళీపట్నం రామారావు "యజ్ఞం" కథ చదివాను_ నేను అల్లుతున్న కథలకు ముగింపు ఇట్లానే ఉంటుందని అనిపించింది. అలాంటి ముగింపులతో కథలు చెప్పి చెప్పి విసుగొచ్చింది. మిత్రులకు ఆ ముగింపు నచ్చలేదు_ మిగతా కథ చెప్పడంలో ఫేలయ్యానని నాకు తట్టేది కాదు.

ఆ రోజుల్లో గాంధీ హీరోగా కన్పించాడు- "గాంధీ యిజం" తెలియక పోవడం వలననే జనం ఇట్లా తన్నుక చస్తున్నారనుకున్నాను. వీధులు ఊడ్చి రాత్రి బడినడిపి ఈగ కాలంత కూడా సంతృప్తి చెందలేకపోయాను. నాకేదో పిచ్చి పట్టిందని అందరు అపహాస్యం చేసేవారు- ఆ బాధతోనే "మిట్ట మధ్యాహ్నం" నవల రాశాను. అప్పటికి వరంగల్ 'మిత్ర మండలి' సభ్యులతో పరిచయాలేర్పడ్డాయి. గాంధీని నమ్మే వాళ్ళు 'నవల బాగుంద'న్నారు. ఆ నవల పోయింది- అది పోవడం ఒకరకంగా మంచిదే అయ్యింది. తర్వాత చాలా కథలు రాశాను. అయితే నేను చదువుకున్న కథలకు రాసే కథలకు చాలా వ్యత్యాసమున్నట్లుగా గమనించాను. (నాకు తెలియని ప్రేమ గురించి కొన్ని కథలు రాసి తీవ్రమైన అసంతృప్తితో ఏ పత్రికకు పంపలేదు.) నాకు తెలిసిన భాషలో తప్ప రాయడం కుదరడంలేదు. అలా గుంజాటన పడుతూనే నేను రాసే కథలు ప్రచురించడానికి కాదని ఖచ్చితంగా నిర్ణయించుకున్నాను. మరెందుకు రాయడమో? రాసిన వాటిని ఏంచేయాలో నాకప్పుడు తెలిసేది కాదు. నేను చూస్తున్న జన జీవితం రాయకుండా ఉండనిచ్చేది కాదు.

నాచుట్టు జన జీవితంలో కొద్దిగా సంచలనం మొదలయ్యింది. నేను నివసించే తాలూకాలోని అడవి ప్రాంతం వార్తలు జనం గుసగుసగా మాట్లాడుకుంటున్నారు- ఆ వార్తలు నన్ను కలవరపరుస్తున్నాయి.

ప్రేమ్‌చంద్ సాహిత్యం చదువుతున్నకొద్ది రైతులు నాకు కొత్తగా కనిపించ సాగారు. అదే కాలంలో కొడవటిగంటి కొంచెం ఆలోచనలు రేపాడు. గాంధీ తీవ్ర శత్రువుగా మారిపోతున్నాడు- ఎందుకంటే దొరలను గాంధీ ఏం చేయజాలడని నా బాధ. మరి ఎవరేం చేయగలరోనని తెగ చదివాను.

జనజీవితంలోని సంచలనం అంతకంతకూ తీవ్రమౌతూవచ్చింది. అదేస్థాయిలో నా ఆలోచనలు పదనెక్కుతున్నట్టు నాకనిపించింది. అదివరకే 'అమ్మ' చదివేశాను. పాణిగ్రాహి పాటలు కొన్ని పాడుకున్నాను- నేను చదువవలసిన సాహిత్యం ఏదో నాకు తెలిసింది.

మొట్ట మొదటిసారిగా కరీంనగర్ 'ఉద్యమ సాహితీ' వాళ్ళ "బద్‌లా" కథా సంకలనం ప్రచురించిన తరువాత నా కథలు కూడా ప్రచురించ తగినవే అన్పించింది. మిత్రులు సాహిత్యం గురించి స్పష్టమైన అవగాహన యిచ్చారు. అప్పుడే కొంతైనా సాహిత్యం చదవడం తటస్థించింది.

ఆ తరువాత దాదాపు నేను రాసిన నాలుగు సంవత్సరాల తరువాత నా కథ ఒకటి తొలిసారిగా సృజనలో ప్రచురించబడింది– "ఎదురుతిరిగితే...." సృజనలో రావడం తోటే ఇలాంటి కథలు జనానికి అవసరమనిపించింది.

జనజీవితంలో మార్పు వేగాన్నందుకొన్నది. బాంచెగాళ్ల (బానిసలు) ప్రశ్నించ నేర్చుకున్నారు. బాంచె బతుకుకు ఉత్పత్తికారణం సాధనాలు, వనరులు, ఉత్పత్తి కొంతమంది చేతుల్లో కేంద్రీకృతమై ఉండడమని జనం గ్రహించారు. కనుక పోరాటం వివిధ రూపాలు తీసుకొని పదునెక్కి గ్రామీణ ప్రాంతాల్లో భూపోరాటంగా పరిణమించింది. ప్రజల ఆలోచనల్లో వచ్చిన గుణాత్మకమైన మార్పుతో నా దృక్పథంలో మార్పు రాసాగింది. జనజీవితంలో జరుగుతున్న మార్పును రాయడం అనివార్య విషయంగా కొన్ని కథలు రాశాను– ఆ మార్పు వేగాన్ని అందుకోవడంలో నేనెంత వరకు కృతకృత్యుడనయ్యానో పాఠకులు తేల్చాలి.

క్లుప్తంగా ఈ పరిస్థితులు నన్ను రచయితను చేశాయి.

కొలిమంటుకున్నది నవల గురించి–

ఎప్పుడైతే భూమి మొత్తం గ్రామంలోని అన్ని వ్యత్యాసాలకు తగువులకు మూలమని తేలిందో అప్పుడే దొరల ఆధీనంలో ఉన్న వందల ఎకరాల భూమి పుట్టు పూర్వోత్తరాల గురించి ఆలోచించవలసి వచ్చింది. భూములను దొరలు పుట్టుకతోటే భుజానేసుకరాలేదు. తమ మనుగడ కోసం రైతులు ఎన్ని కష్టాలైనా ఎదుర్కొని సాగు యోగ్యంగాని భూములు సాగులోనికి తెస్తారు. అవి దొరలు ఆక్రమించుకుంటారు. కాలానుగతంగా దొరల భూఆక్రమణ పద్ధతులు మారుతూ ఉంటాయి. కాని ఆక్రమించుకోవడం మాత్రం తప్పనిసరి. ఎంతవరకు? 'కొలిమంటుకో'నంత వరకే– అలాగే దోపిడి సమాజంలో ప్రతి అభివృద్ధికరమైన అంశాన్ని దొరలే వాడుకుంటారు– మౌలికంగా ఉత్పత్తి సాధనాలు, వనరులు, ఉత్పత్తి శ్రామికుని పరం కానంత వరకు ఈ పరిస్థితి కొనసాగుతుంది.

ఇలా ఆలోచనలు చేస్తుండగానే ఒక దొర దౌర్జన్యాన్ని తెలిపే సుదీర్ఘమైన కరపత్రి మొకటి దొరికింది– ఆ కరపత్రం ఆధారంగా మరికొన్ని వాస్తవ పరిస్థితులు తెలుసుకోవడానికి ఆ ఊళ్లోకి దాదాపు మూడు నెలలు రాకపోకలు సాగించాను– విషయాలు తెలిసినకొద్ది మనస్థిమితం లేకుండాపోయింది. నేను ఏదో రాయలనే ఉద్దేశంతో ఈ విషయాలన్ని తెలుసుకోలేదు. విషయాలు తెలిసిన తరువాత వాటన్నిటిని

కొన్నివందల సార్లు కలిసిన వారికల్లా చెప్పాను- ఒక కానిస్టేబుల్ విని కోపోద్రేకంతో పెద్దగా అరుస్తూ 'వాణ్ణిచంపేయాల'న్నాడు. అట్లా ఆరునెలలు గడిచిన తరువాత 1974 లో 40 పేజీల కథరాశాను. నిజానికి అదికథకాదు. ఒక రిపోర్టు మాత్రమే. అలా ఒక సంవత్సరం వదిలేశాను- ఆ విషయాలు చెప్పగా చెప్పగా ఎదుటి వ్యక్తికి మరింత ఆసక్తి కలిగించడం కోసం మరింత పెరిగిపోయి క్రమ పద్ధతిలో కథలాగా తయారయ్యింది. వినేవాళ్ల ప్రశ్నలనుబట్టి పాత్రల గుణగణాలు చెప్పడం జరిగింది. ఎవరో ఇలాగే రాయమన్నారు. 1975 లో మళ్లీ ఆరిపోర్టును కథలాగా తిరుగరాశాను. ఈసారి 80 పేజీలయ్యింది. కొందరు మిత్రులు నవలలో వాడిన భాష గురించి ఆక్షేపణ తెలిపారు. మళ్లీ తిరుగరాసే ప్రయత్నంలో 120 పేజీలయ్యింది. ఒక వారపత్రికకు నవలల పోటీకిపంపి పీడవదిలిందనుకున్నాను. నవల తిరిగొచ్చింది. మళ్లీ తర్జన భర్జన మొదలయ్యింది. భాష గురించి చాలామంది మిత్రులు అవహేళన చేశారు. మళ్లీ తిరుగరాశాను. 180 పేజీలయ్యింది. ఇట్లా పెరగడానికి కారణం అనేక సంఘటనలు, ఈ నవలలోని పాత్రల జీవితాల్లో అనేకకొత్త సంఘటనలు జరుగడం- పాత్రలు ఎదుగుతున్నాయి. ఒక మిత్రుడు అచ్చువేయిస్తానని తీసుకెళ్ళాడు. ప్రెస్ యజమాని "గిదేం నవల"ని కొట్టిపారేశాడు. నవల మూల పడేశాను. దాదాపు ఆరునెలలు ఆ విషయం మరిచేపోయాను.

అనేకానేక సంఘటనలు జరుగుతున్నాయి. ప్రజలు వీరోచిత పోరాటాలు చేస్తున్నారు. కొలిమిలో ఇనుము కరుగుతోంది. కొలిమిఅంటుకున్న పరిస్థితుల గురించి ఆలోచిస్తూ మళ్లీ నవల బయటకు తీసి సృజనకు పంపాను; 'సాహితీమిత్రులు' అందులోని లోపాలు తెలుపగలరని తలచి. నవలగురించి ఆఖరి ప్రయత్నం కూడా విఫలమైందే అనుకున్నాను. సృజన 'సాహితీ మిత్రులు' చాలావివరంగా నాతోకలిసి చర్చించిన తరువాత మళ్లీ తిరుగరాశాను. మళ్లీ చివరిఘట్టాల గురించి మార్పులు అవసరమయ్యాయి. 1974 లో మొదలైన నవల 1979 ఏప్రిల్ వరకు రాయడం పూర్తయింది-

ఈ నవల చదువగావిన్న రైతులు చాలా మంది ఇందులోని ఒక్కొక్క పాత్ర వాళ్ల స్వభావాన్ని బట్టి మాదేనన్నారు- నేను రాయని విషయాలు కొన్ని ఉన్నాయని వాళ్ల అనుభవాలు ఏకరువు పెట్టారు. భూమి పోగొట్టుకొని ఊరు తరమగా బొగ్గుగని లోనికి బతుకు తెరువు కోసం వచ్చి గోదావరిఖనిలో స్థిరపడ్డాడతను- అతను సృజన కోసం ఒకటవ తారీఖు నుండి నెలాఖరు వరకు వాకబు చేస్తూనే ఉంటాడు. సృజన ఎప్పుడురాగలదో అతనికి తెలుసు - కాని అడుగకుండా ఉండలేడు. సృజనకొని

నవల ఎవరి చేతన్న చదివించుకోకుండా ఉండలేదు. నాకు ఒక గ్రామంలో ఒక గుడ్డి ముసలతను తారసపడి పుల్లల్లాంటి చేతులతో నా వొళ్లంతా తడిమి సొట్ట కళ్ల నుండి నీరుకారుస్తూ తను "గట్టయ్య" నన్నాడు.

ఈ నవలలోని పాత్రలన్నింటికి మూలరూపాలున్నాయి. కనీసం గుడ్డి గట్టయ్య, నర్సింహం, బొత్తయ్య పాత్రలకు మూలరూపాలైన వాళ్ల ఫోటోలు ప్రచురించాలనుకున్నాను. మలిప్రచురణకు వీలైతే వేయాలని నా కోరిక–

పోరాటానికి అనివార్యంగా ప్రజలను నెట్టిన పరిస్థితుల నుండి ప్రజలు పోరాటాన్ని చేపట్టడంతో నవల ముగుస్తుంది.

వైయక్తిక పోరాటాలు సమిష్టి పోరాటాలుగా, ఒక్కొక్క బొగ్గుముక్క అంటుకొని కొలిమంతా నిప్పుకావడం ఈ నవల– ప్రజలు మరింత ఉన్నతంగా ఎదిగి చైతన్యవంతమైన వర్గ పోరాటాలు చేస్తారు–

భాష గురించి–

నవల మొత్తం మౌఖిక సంప్రదాయంలో నడుస్తుంది– ప్రజలు జీవించిన జీవితం, అందులోని సంఘర్షణ, ఉత్పత్తి క్రమంలో వాళ్ల సంస్పందన నుండి పుట్టిన భాషలోనే ఈ నవల రాశాను–

ఈనాటి ఆదిలాబాద్ - కరీంనగర్ రైతాంగ పోరాటానికి ముందు పరిస్థితులు ఈ నవలలో కనిపిస్తాయి. ఎన్ని మలుపులు తిరుగుతుందో, ఇంకెన్ని కొత్త కళా రూపాలను సృష్టిస్తుందో, లేదా ఇప్పుడున్న కళారూపాలను ఏ రూపంగా మలుచు కుంటుందో పోరాటమే నిర్ణయించాలె-

ఈ నవల రాయడానికి, రావడానికి సహకరించిన ప్రజలకు, 'సాహితీ మిత్రుల'కు నవలకు 'కొలిమంటుకున్నది' పేరు సూచించిన కామ్రేడ్ వరవరరావుకు విప్లవాభినందనలు–

మంచిర్యాల.
8 జూన్ 1979.

అల్లం రాజయ్య

ఎన్నెల పాట

వంగపండు

రావఁ నా సెందునాలో ఎన్నెలా
రాజా నీకొొందనాలు ॥రావఁ నా॥

పేరులేని దానిసీ ఎన్నెలో ఎన్నెలా
పేద దానినీ ,, ,,
ఒంట లేని దానినీ ,, ,,
ఒంటి దానినీ ,, ,,
అన్నమంటె నా కొడుకు ,, ,,
నిన్ను జూపించుతాను ,, ,,
సిన్నారి నా కొడుకును ఎన్నెలా
సింహం పిల్లనే జేత్తాను ఎన్నెలా
॥రావఁ నా॥

మసకా ఎండలోలను ఎన్నెలో ఎన్నెలా
ఇసకా గుడ్డెముమీద ,, ,,
కంది మొక్కలు దీసి ,, ,,
కందిపోయెను ఏలు ,, ,,
నా ఏలు సూడకుమీ ,, ,,
నను జూసీ నవ్వకుమీ ,, ,,
నా ఏడుపల్ల గాడుపయ్యి ఎన్నెలా
అమ్మ! ఏనాడో ముంచుతాది ఎన్నెలా
॥రావఁ నా॥

గాలి - వానాలోను ఎన్నెలో ఎన్నెలా
వరదా, బురదాలోను ,, ,,
పనిజేసీ - పనిజేసీ ,, ,,
నినుజూసీ - సిగ్గేసీ ,, ,,
తాటిమట్టల కిందా ,, ,,
తలదాసు కున్నానూ ,, ,,

సిగ్గూ - ఎగ్గూ దెలిసీ ఎన్నెలా
బుగ్గిపాముసే అయ్యాను ఎన్నెలా
॥రావఁ నా॥

సిక్కే సీకటిలోను ఎన్నెలో ఎన్నెలా
సివరాత్రి రోజునా ,, ,,
కామందు పోలంకి ,, ,,
కాపలా ఎల్లేను ,, ,,
కంచిలోను తొంగోని ,, ,,
మంచులోను దడిసేను ,, ,,
కామందు గుండెమీద ఎన్నెలా
కర్రపుల్లనయ్యి కాలేను ఎన్నెలా
॥రావఁ నా॥

వానలోను పనిజేసి ఎన్నెలో ఎన్నెలా
వయసల్లా పోయింది ,, ,,
ఎండలోను పనిజేసి ,, ,,
కండలన్ని కరగేయా ,, ,,
సరదాలు - సందడ్లూ ,, ,,
సాలించు కున్నాను ,, ,,
దేశమల్ల జూసేను ఎన్నెలా
రేసుకుక్కలాగ లెగెసేను ఎన్నెలా
॥రావఁ నా॥

కూలి గింజలు దెచ్చి ఎన్నెలో ఎన్నెలా
కూడొండా డానికి ,, ,,
పెండిలే దిరిగేను ,, ,,
కొండలే దిరిగేను ,, ,,
ముల్లూ కంపలు నన్నూ ,, ,,
వల్లూ సిల్లులు జేసీ ,, ,,
ఆ రక్తంలో నాళ్ళు ఎన్నెలా
రాజ మార్గాలే జూపేయా ఎన్నెలా
॥రావఁ నా॥

చౌ లి-పో
ఇంగ్లీషు నుంచి తెలుగు
నళిని

ఉప్పెన
రెండవ భాగం

ఉప్పెన మొదటి భాగంలో కథ

అది ఈశాన్య చైనాలో హౌలుంకి యాంగ్ రాష్ట్రంలో యువాన్‌మావో అనే గ్రామం. అక్కడికి భూసంస్కరణ కార్యకర్తల దళం ఒకటి వెళ్ళింది. జనంలో నిద్రాణంగావున్న చైతన్యం రగిల్చింది. జనం వీళ్ళమీద నమ్మకం కుదరక మొదట్లో వెనకాడినా, త్వరలోనే జట్లు జట్లుగా రైతు సంఘంలో చేరేరు. ఆపూరి కామందుల ఆగడాలు బైటపెట్టేరు. విముక్తి కోసం ఎంతటి త్యాగానికైనా వెనుదీయమని బాస చేసేరు. అలాగే భూస్వామ్య వ్యవస్థకి గొడ్డలిపెట్టు పేట్టేరు. ఆ పూరి పెద్దకామందు 'ఆరో నంబరు హాన్'ని తుదముట్టించేరు. బందిపోట్లు దాడి చేస్తే, వీరోచితంగా ఎదుర్కొన్నారు. ఆ పోరాటంలో రైతుసంఘం చైర్మన్ చావోయు-లిన్ తన పూరి కోసం, చైనా విముక్తి కోసం తన ప్రాణాలర్పించేడు.

ఒక ఘట్టం ముగియడంతో భూసంస్కరణ కార్యకర్తలు మరో పూరికి పయనమయేరు. ఇక యువాన్‌మావోలో ఎదురయే సమస్యలని ఆ గ్రామ ప్రజలే ఎదుర్కోవాలి.

రెండో భాగం పాత్రల పరిచయం

సియావో : పూర్తిపేరు సియావో సియాంగ్. భూసంస్కరణ కార్యకర్తల దళానికి నాయకుడు. ముప్పయ్యేళ్ళుంటాయి.

వాన్ : సియావోకి అంగరక్షకుడు. పూర్తి పేరు వాన్‌చీన్.

ఓల్డ్‌సన్ : బండివాడు. ఏభై పైన వుంటుంది వయసు. గొప్ప సరదా మనిషి.

తు, తాంగ్ : దుష్టత్రయంలోని ఇద్దరు. మూడో వాడు ఆరోనంబరు హాన్. వీళ్ళు ముగ్గురూ ఆ పూళ్ళో పెద్ద మోతుబరులు.

చావో : పూర్తిపేరు చావోయు-లిన్. బందిపోట్లతో పోరాడుతూ మరణిస్తాడు.

చావో భార్య : పేదరైతు, రైతుసంఘంలో ఒకప్పుడు చైర్మన్ అయిన చావో భార్య.

తీన్ తాత : హాన్ దగ్గర కౌలుదారు. రైతుసంఘంలోని ఆఫీసరు. పూర్తిపేరు తీన్ వాన్-షున్. పరమ అమాయకుడు. ఇతని కూతురిని హాన్ చంపేసేడు. ఆ

బాధతో ఇతని భార్య కళ్ళు పోయేయి.

కువో : పూర్తిపేరు కువో చువాన్-హై. రైతుసంఘం చైర్మన్. అంతకు ముందు ఓపాలేరు. తర్వాత పార్టీలో చేరేడు.

పాయి : పూర్తిపేరు పాయి యు-షాన్. ఓపేదరైతు. సైన్యంలోకి వెళ్ళకముందు ఓ సాయుధ దళనాయకుడు.

చాంగ్ ఫూ-యింగ్ : మారుపేరు పెద్దవాడు చాంగ్. కేకుల దుకాణదారు. తర్వాత నెమ్మదిగా రైతు సంఘంలో స్థానం సంపాదించుకున్నాడు.

లియూతె-షాన్ : ఓ మధ్య తరగతి రైతు.

చాంగ్ చింగ్-సియాంగ్ : ఓ పేదరైతు. రైతుసంఘం ఆఫీసరు. తర్వాత సైన్యంలో చేరేడు.

చాంగ్ చింగ్-షీ : చాంగ్ చింగ్-సియాంగ్ తమ్ముడు.

లీ కీ - యంగ్ : లీ చెన్ - చియాంగ్ అక్కకొడుకు. కొమింటాంగ్ మనిషి.

చిన్న మీ : చాంగ్ ఫూ - యింగ్ వుంపుడుగత్తె.

పెద్దలీ : లీచాంగ్ - యు ఇతని పూర్తిపేరు. ఇతను ఆ వూరి పద్రంగి- రైతు సంఘం ఆఫీసరు.

హూవా : హూవాయంగ్-సీ ఇతని పూర్తిపేరు. ఒకప్పుడు రైతు సంఘంలో చాలా చురుగ్గా పనిచేసేడు. కాని పెళ్ళిచేసుకొని భార్యకు లొంగిపోయి ఎందుకూ పనికిరాకుండా తయారయ్యేడు.

వు : వు చియా-పు ఇతని పూర్తి పేరు. ఇతను పందుల కాపరి. చావో భార్య ఇతన్ని పెంచింది.

చు : చు పు-లిన్ ఇతని పూర్తిపేరు. ఏభైపైన వుంటుంది వయస్సు. ఇతనుకూడా రైతు సంఘం ఆఫీసరు.

లీకీ - లాన్ : ఈమెని చిన్న వయసులోనే ఓకాపుందు తన పదేళ్ళ కొడుక్కి భార్యగా వుంచుకున్నాడు. తర్వాత ఈమెకువోను పెళ్ళిచేసుకుంది.

గాడిద-లీ : తిరుగుబోతు. తర్వాత సియావో మాటలవల్ల మారేడు.

1

అది 1947 అక్టోబర్ నెలాఖరు రోజుల్లో ఒకరాత్రి.

"నాను నీకు అంతా సెప్పేను సియావోబాబు. నమ్మకుంతె ఎవుర్నేనా అడిగిసూడు."

"నువ్వు చెప్పడం పూర్తయివుండొచ్చు. కాని నేను అడగడం ఇప్పుడేగా మొదలెట్టేను? ఆగాగు. ఈ వూళ్ళో కామందులందర్నీ ఈడ్చి పారేసేరా? భూవంతా సమంగా పంచేరా?"

"కిందపేడు నువ్వుండగానే బూవంతా పంచేసినావుగద బాబు? ఇక కామందు లంతారా, ఆల్లపని ఎప్పుడో అయిపోనాది."

ఇంతవరకు సియావోతో మాట్లాడింది రైతుసంఘం కొత్త చైర్మన్ చాంగ్ వూ-యింగ్. అతను కొద్దినెలలుగా చైర్మన్‌గా వుంటున్నాడు కాని సియావోని కలవడం ఇదే మొదటిసారి. నూనెదీపం వెలుగులో ఓ బల్ల నానుకుని నిల్చున్నాడతను. సియావో అతన్ని పరీక్షగా చూస్తున్నాడు. చాంగ్ నీలం వూలు బట్టలు, కాళ్ళకి మేజోళ్ళు తొడుక్కున్నాడు. కిర్రినీడలో ఆజోళ్ళు మామూలు జోళ్ళలా లేవు, జపాన్ మిలటరీ జోళ్ళలా వున్నాయి. అతని చెవులను చాలా వరకు కప్పుతూన్న నక్కటొప్పి టోపీ కింద అతని నుదురు చెమటతో తడిసిపోతోంది. టోపీ తీసేసేడు. నూనెరాసి, మధ్య పాపిడి తీసిన తల. అతన్ని ఇంకా అలాగే తేరిపార జూస్తూ ఏదో గుర్తొచ్చి నవ్వుతూ—

"నువ్వు కేకుల కొట్టు యజమానివి కదూ?" అన్నాడు సియావో.

"అ-అవును" అని కొంచెం ఒంగి గొణిగేడు చాంగ్

"నిరుడు బూవి పంచడానికి యాంగ్ ఓ తప్పుడు లిస్టు తీసుకొచ్చేడు, అది నువ్వే రాసేవు కదూ?"

"దానికి నన్నేటనకు బాబూ. యాంగ్ అలా రాయమన్నాడు"—నసుగుతూ అన్నాడు చాంగ్.

"అయితే నువ్వు చాంగ్ వూ-యింగ్ వన్నమాట." అన్నాడు సియావో తాపీగా నవ్వుతూ. "నువ్వు నాకు ఇంతకు ముందే తెలుసు చైర్మన్ చాంగ్! నువ్వు కల్సినందుకు నాకెంతో ఆనందంగా వుంది."

కొంచెం ఆగి

"నీ వ్యాపారం ఎలా వుంది?" అని అడిగేడు.

"ఎప్పుడో మానీసేను బాబూ. నాను బూఁవి ఇవ్వంగానే పొలం పని మొద లెట్టేను. అన్ని పనుల్లోకి అదే మేలు. దానిమీదైతే నాయంగా బతకొచ్చు"

అతని మాటలు వింటూ సియావో మళ్ళీ అతని వూలు బట్టలకేసి చూసేడు.

'నువ్వు రైతునంటావ్, మరి నీ బట్టల మాటేఁవిటి?' అని అడగాలని ఎంత గానో వున్నా తమాయించుకుని చాంగ్‌ని పంపేసేడు సియావో.

బైట అడుగుపెట్టగానే చాంగ్ 'అమ్మయ్యా' అని నిట్టూర్చేడు. అతని బూట్ల కింద మంచు నలిగి కరకరలాడుతుంటే రోడ్డువేపు నడిచేడు.

అప్పుడే కాంగ్ మీద పక్క పరుస్తున్న వాన్‌ని "అతనిలో రైతు లక్షణా లున్నాయా?" అని అడిగేడు సియావో అవులిస్తూ.

"నేను ఎరుగున్న ఏ రైతు అలా లేడు" అన్నాడు వాన్ తల అడ్డంగా తిప్పుతూ.

"మన వాళ్ళందరూ నిద్రపోయేరా?"

"ఎలా గురకపెడుతున్నారో చూడండి. ఏళ్ళ తరబడి నిద్ర ఎరగని వాళ్ళలా పండుకున్నారు."

సియావోకి పక్కగదిలోంచి గురకలు వినిపించేయి. ఈసారి అతను తీసు కొచ్చిన కొత్త కార్యకర్తలందరు వేరువేరు ప్రాంతాల నుంచి వచ్చిన యువకులు. వాళ్ళతో మాట్లాడాలనుకున్నాడుగాని అప్పటికి వూరుకుని, వాన్‌ని కూడా నిద్ర పొమ్మన్నాడు.

ఊరంతా నిద్రపోతోంది. ఉత్తరంవైపు నుంచి గాలి వీస్తోంది. కిటికీ తలుపులు కొట్టుకుంటున్నాయి. ఊరకుక్కలు మొరుగుతున్నాయి. దూరంగా తోడేళ్ళు వూళవేస్తున్నాయి. సియావో దీపంవత్తి తగ్గించి డైరీలో ఇలా రాసుకున్నాడు:

'భూసంస్కరణ కార్యక్రమం యువాన్‌మావో గ్రామంలో సంతృప్తికరంగానే జరిగింది. కాని నిరుటి పాత కార్యకర్తలను వేరే పనులమీద పంపడంతో వూళ్ళో నాయకత్వం దెబ్బతింది. గెలుపు, ఓటమి – చాలా వరకు నాయకుల మీదనే ఆధారపడి వుంటుంది. ఉద్యమం కెరటంలా ఒక్కసారిలేచి మళ్ళీ పడిపోయినట్టు తోస్తోంది. కాని నిజానికి గ్రామస్తుల వర్గ చైతన్యంలో పెరుగుదలలేదు. ప్రతి ఘాతం మళ్ళీ

తలెత్తుతోంది. రైతు సంఘ చైర్మన్ చాంగ్ ఫూ-యింగ్ అనుమానించదగిన మనిషి. అతని అంతస్తు, కుటుంబ పరిస్థితులు పరిశీలించాల్సి వుంది. అసలు అతను రైతు సంఘంలోకి ఎలా వచ్చేడు, ఎలా చైర్మన్ అయేడు? తర్వాత కువో గురించి కూడా ఆలోచించాలి.'

సియావో ఇంకా రాసేవాడేగాని అప్పటికే అలసిపోయేడు. కొంచెం తల తిరిగి నట్లయింది. శ్రమ ఎక్కువవడం వలన ఇలా జరిగిందని అతనికి తెలుసు. జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో అతను జిల్లా పార్టీ కమిటీ మీటింగుకి వెళ్ళేడు. అది ముగిసిన వెంటనే కార్యకర్తలతో బయలుదేరి చీకటిపడే వేళకి ఇక్కడికి చేరుకున్నాడు. గూడులేని బండిలో హోరు గాలిలో మంచులో దాదాపు ఇరవైమైళ్ళ ప్రయాణం. ఇక్కడికి వచ్చి వెంటనే సియావో చైర్మన్ చాంగ్‌ని పిలిపించి అతనితో రెండు గంటలసేపు చర్చించాడు. ఇప్పుడు గడియారం చూస్తే పన్నెండు దాటింది. జోళ్ళు, చొక్కావిప్పి కాంగ్ మీద పడుకోబోతూ జేబులోని 'సంక్షిప్త వ్యవసాయ చట్టం' తీసి బల్ల మీద పడేసేడు. "చాంగ్ ఫూ-యింగ్ సంగతేమిటో తెల్సుకోవాలి" అనుకుంటూ నిద్రలోకి జారిపోయేడు సియావో.

అక్టోబర్‌నెల మధ్యలో అన్ని జిల్లాలపార్టీ సెక్రటరీలు రాష్ట్ర రాజధానిలో సమావేశమైనపుడు పార్టీ సెంట్రల్ కమిటీ[1] 'సంక్షిప్త వ్యవసాయ చట్టా'[2]న్ని ప్రకటించింది. దాన్ని ఒక దిన పత్రిక[3] ప్రచురించింది. పార్టీ సెక్రటరీలు ఈ డాక్యుమెంటు నిశితంగా పరిశీలించేరు. సియావో తన జిల్లా తిరిగొచ్చేక కార్యదర్శుల సమావేశం జరిపి జిల్లా పార్టీ సెక్రటరీలు చేసిన తీర్మానాలు చర్చించేరు. భూసంస్కరణ చట్టానికి అనుగుణంగా మరో ఉద్యమం లేవదీసి, భూస్వామ్య అవశేషాలను తుద ముట్టించాలని ఆ సమావేశం తీర్మానించింది. జిల్లాని ఇరవై భాగాలుగా విభజించి మూడు వందల మంది కార్యకర్తలను ఇరవై భూసంస్కరణ దళాలుగా నియమించేరు. ఆరోజే హోరుగాలిలో జిల్లా కేంద్రం నాలుగు దిక్కులకు వంద బళ్ళ మీద దళాలు బయల్దేరేయి. గుర్రపు డెక్కల చప్పుళ్ళు, సిమెంటు రోడ్డమీద బండి చక్రాలు దొర్లుతున్న ధ్వనుల మధ్యదళ సభ్యుల ఆడమగ గొంతుల హుషారైన పాటలు. ఒక గంటదాకా టౌన్‌లో యీ సందడి తగ్గలేదు.

---

1. Central commitee of the chineese communist party
2. Out line of Agrarian law
3. The North - East china Daily

యువాన్ మావో గ్రామాన్ని లోగడ సియావో నిశితంగా పరిశీలించడం వల్ల ముందు అక్కడికే తన దళంతో బయల్దేరేడు. కొత్త వ్యవసాయ చట్టాన్ని ముందు అక్కడ అమలు పరిచిన తర్వాతనే మరెక్కడైనా అమలు పరచడం.

ప్రస్తుతం సియావో జిల్లా పార్టీ సెక్రెటరీ. అందరు అతన్ని 'కమీషనర్ సియావో' అంటున్నారుకాని యువాన్ మావో గ్రామస్తులు మాత్రం ఇంతకు ముందులాగే 'దళ నాయకుడు సియావో' అనే పిలుస్తున్నారు.

సియావోతో మాట్లాడి బయట కొచ్చిన చాంగ్ గుండె దడదడ లాడింది. సియావో తిరిగొచ్చేడంటే పరిస్థితులు ఎలా మారిపోతాయో అతనికీ తెలుసు. మర్నాడు అతుకులు వేసిన గుడ్డలు వేసుకోవడానికి నిశ్చయించుకున్నాడుగాని ఇప్పటికే ఆలస్యం అయిపోయిందేమోనని జడిసేడు. అతను ఇంతకాలం రైతు సంఘం ఆఫీసులోనే మకాం పెట్టేడు గాని సియావో దళం తిరిగి రావడంతో తన మూడు గదుల ఇంటికి మారేడు. తూర్పువేపు గది బ్రహ్మచారి 'పొడుగు కాళ్ళహో'కి అద్దెకిచ్చేడు. ఆ గదిలో హో పొయ్యి అంటించడం వల్ల వేడెక్కిన కాంగ్‌తో గది వెచ్చగా వుంది. హోని దక్షిణాన వున్న గదికి తరిమేసి చాంగ్ ఆ గదిలో తిష్ఠ వేసేడు. దక్షిణపు గదిలో కాంగ్ సరిగాలేనందున గది వేడెక్కలేదు.

జపాన్ బూట్లు తీసి పారేసి దీపం ఆర్పి పండుకున్న చాంగ్ నిద్రపట్టక అటూ యిటు దొర్లేడు. గుడ్ల గూబలా కళ్ళు విప్పుకుని, మంచుపడి మెరుస్తూన్న కిటికీకేసి చూస్తూ ఆలోచిస్తూన్న కొద్దీ అతనికి సైనికుల మీద కోపం పెరిగిపోయింది.

"గాడిదలు! అలు నాకు ముందుగానే ఎందుకు కబురెట్టలేదు? ఇప్పుడేటి సేయడం?"

చాంగ్ రైతు సంఘం చైర్మన్ అయిన దగ్గర్నుంచి చెయ్యగూడని పనులెన్నో చేసేడు; ప్రభుత్వ కార్యకర్తలు ఎప్పుడేనా రావచ్చునే బెదురుతో తనకి రక్షణగా అయిదుగురు సైనికులను నియమించేడు. ఒకడు అంగరక్షకుడు, ఇంకొకడు పొలిమేరలో కాపలా, ఒకడు ఇంటికావలి, మరొకడు రాత్రి పూట కాపలా, మరింకొకడు వంటవాడు. జీతం మాత్రం నెలకి పాతిక రూపాయలే.* పొలిమేర కాపలావాడు జిల్లా కేంద్రం నుంచి వచ్చే రోడ్డు దగ్గర కాపలా వుండేవాడు. కార్యకర్తలని ఏ మాత్రం అనుమానం వచ్చినా వెంటనే యజమానికి విన్నవించుకునేవాడు. కాని ఈ రోజు హోరుగాలికి జడిసి అతను యింటికి పోయేడు. అందుకే సియావో రాక చాంగ్

* చైనీస్ కరెన్సీ 25 వేల డాలర్లు.

మీద పిడుగుపాటు అయింది. సియావో ఎదుట తను ఎలా బయటపడి పోవలసి వచ్చిందో తలుచుకున్న కొద్దీ అతనికి తన మీద, తన పనివాళ్ళ మీద కోపం పెరిగి పోసాగింది.

"ఇప్పుడు ఏటిసెయ్యడం?" అని మళ్ళీ కసిగా అనుకున్నాడు.

చాంగ్ ఫూయింగ్ మారుపేరు 'టక్కరి చాంగ్' అతనికి నలభై ఎకరాల ఆస్తి వుండేది. కాని తలిదండ్రులు చచ్చిపోయేక వ్యసనాల మీద అంతా తగలేసేడు. అంతా అయిపోయేక స్నేహితుల దగ్గర, చుట్టాల దగ్గర అప్పుచేసి ఓ కేకుల దుకాణం తెరిచేడు. అతను మాటకారితనంతో అందర్నీ ఆకట్టుకోనూగలడు, పల్టీ కొట్టించనూ గలడు. అతనికి లెక్కలు, రాతకోతలు చాతనవును. తనలాంటి ఎందుకూ కొరగాని వెధవల్నందర్నీ ఒక ముఠాగా కూడగట్టేడు. భూసంస్కరణ మొదట ప్రవేశపెట్టిన ఏడాది 'దుష్టత్రియం'లోని 'తు' అతని సాయంకోరి రెండు సీసాల సారా, ఏభై రూపాయలు ఇచ్చేడు. చాంగ్ ఒప్పుకుని యాంగ్ చేత తప్పుడు లెక్కల పట్టిక తయారుచేయించేడు. అతని దొంగతనం కాస్తా సియావో కనిపెట్టి బైటపెట్టేసరికి చాంగ్‌కి సియావో అంటే జడుపు, కసి ఎక్కువయాయి. కాని సియావోని ఏఁవీ చేయలేకపోయేడు. సియావో వెళ్ళి పోవడంతో మళ్ళీ విజృంభించేడు.

చాంగ్ కేకుల కొట్టు ఎత్తేసి మీటింగులకు రావడం మొదలెట్టేడు. గట్టిగా దెబ్బలాడగల దమ్ములున్నాయి. ఊరిగొడవల్లో జోక్యం కల్పించుకోవడం చూసి చాంగ్ మంచికి మారేడనుకున్నారు చాలా మంది. అతను రైతు సంఘం ఛైర్మన్ అయేక అతని గత జీవితం పూసెత్తడం మానేసేరు. 'సీ' అనే ఉపకామందు* అంటే చాంగ్‌కి కసి. అందుకే అతని యిల్లు సోదా చేసినప్పుడు చాంగ్ చురుగ్గా వ్యవహరించి రెండు బంగారపు ఉంగరాలు, ఆరు గుడ్డల మూటలు బయట పెట్టేడు. అతనే స్వయంగా కప్పు మీదకెక్కి పెంకుల మధ్య నుంచి రెండు గుడ్డల మూటలు బైటికి లాగేడు. కిందికి ఒగేసరికి అతని ఒంటినిండా దుమ్మూ ధూళీ. రైతులతన్ని ఓ గ్రూపు లీడరు చేసేరు. హాయి యు-షాన్ చదువుకోవడానికి పార్టీ స్కూలుకి వెళ్ళిపోయేక అతని స్థానే చాంగ్ సాయుధ దళ నాయకుడయేడు. లియు-షెంగ్ బదులు చాంగ్-చుంగ్ జిల్లా పార్టీ సెక్రెటరీ అయేడు. అతను ఎప్పుడూ కొండ ప్రాంతాల గ్రామాలు చూసే వాడు గాని ఎన్నడూ యువాన్‌మావో వచ్చిన పాపానపోలేదు. ఇంతలో చాంగ్

* ఉపకామందు- కామందుల వద్ద భూఁవి కౌలుకి తీసుకుని, దాన్ని మరెవరికైనా కౌలు కిచ్చేవాడు. మధ్య తరగతి రైతుకన్నా పై మెట్టులో వుంటాడు.

ఫూ-యింగ్ యింకా ఎత్తులువేసి వైస్ చైర్మన్ అయేడు. అతని చుట్టూవున్న ముఠా వాళ్ళందరిని గ్రూపు లీడర్లు చేసేడు. దొంగల ముఠాకన్న బందోబస్తుగావున్న వాళ్ళ గ్రూపుని ఏం చేయలేక కళ్ళప్పగించి చూస్తూ వుండిపోయేడు కువో.

పోరాటంలో గాయపడినవారిని మోసే స్ట్రెచర్లు మోయడానికి పెద్ద లీ వెళ్ళిపోయేడు. దానితో కువో ఒంటరిగానే అన్నిపనులు సాగించాల్సి వచ్చింది. చైర్మన్ అయినాగాని కువోకి డాబుసరి తక్కువ. అతని విరోధులు ఎప్పుడైనా నిలదీసి అడిగితే సమాధానం చెప్పలేక ముఖం కందగడ్డ అయేది, గొంతుకండరాలు బిగుసుకునేవి. కొందరు గ్రామస్తులు చాంగ్ మాటకారి తనానికి లొంగిపోయేరుగాని చాలామందికి కువో మంచితనం తెలుసు, చాంగ్ చెడ్డ వాడని కూడా తెలుసు; కాని చాంగ్ ముఠాకి జడిసేవారు. యువాన్‌మావోలో కొందరు పార్టీ సభ్యులున్నారు గాని వాళ్ళని ఎవరూ క్రమ పద్ధతిలో కూడగట్టలేదు. ఇకపోతే హువా యంగ్-సీ లాంటివాళ్ళు తమపొలం గురించే పట్టించుకున్నారు. కువో కోపదారి తనాన్ని చాంగ్ ముఠాదార్లు వెక్కిరించేరు.

"ఆడి ఎర్రిమొగమూ (ఎర్రిమొగమూ), మాలావుగొంతూ సూసి ఎవ్వరికీ బయ్యంనేదు"

"మామీనకే వద్దాంవనుకుంటాడా ?"

"ఆడిని సూసి బయ్యంపడ్డానికి ఇది మంచుకోరాజ్జెంకాదు."

ఓరోజు ఓల్డ్‌సన్ మస్తుగా తాగేసి ఆ మైకంలో కువోని సమర్థించేడు. ఇంకేముంది తేనెతుట్టెమీద గడ్డవిసిరి రేపిన చందం అయింది. చాంగ్ ముఠా అందరూ ఓల్డ్‌సన్ మీద పడిపోయేరు.

"నువ్వెవడివిరా, నీకేటెరికని ?"

"నీకియన్నీ ఏలరా ? నీకు కాని మాటలు నీకేల ?"

"నోరు మూసుకో. నేపోతే జనాన్ని పిల్సి నిన్నప్పగిత్తాం. ఏటి అలా సెయ్యమంతావేటి ?"

ఈమాట వినేసరికి ఓల్డ్‌సన్ మత్తుదిగిపోయింది. "సరే, సరే, ఈమారు కొగ్గిండిప్పీ !" అనిగొణుగుతూ అక్కడినుండి పోయి తనబండి చేరుకున్నాడు. ఆనాటినుండి విప్లవం గురించి మాట్లాడ్డం మానీసి, ఎలుగుబంటి కథలే చెప్పేవాడు :

"ఎలుగుబంటి నల్ల ముద్దలా వుంటాదేకాని దానికి ఏటీ తెల్దు........" అంటూ.

రైతుసంఘంలో కువో ఒంటిపిల్లి రాకాసి అయేడు. అతను తీవ్రంగా ఆలోచించినకొద్దీ కోపం ఎక్కువయేది. చాంగ్ ముఠావాడితో ఓసారి తగువేసుకున్నాడు.

అందుకని గ్రూపులీడర్ల మీటింగులో అందరూ కువోని దేనికో దానికి తప్పుపట్టాలని చూసేరు.

"ఇలాంటి సైర్మన్ వుంటేనేటి, వూడితేనేటి"

"మాఁవంతా చాంగ్‌నే ఒప్పుతాం. ఇక కువో దిగిపోవాల."

"ఆణ్ణి ఇంటికిపోయి పిల్లల్ని సూసుకోమనండి" అన్నారెవరో వెక్కిరింతగా.

"ఆడికి పిల్లలున్నారేటి? పెల్లికానేదుగదా?" అని పరికొంచెం ఎగదోసేరు మరొకరు.

"ఆడికి పెల్లి అయితే మనకేటి కాపోతే మనకేటి ముందాణ్ణి యీ ఆఫీసులోంచి తగిలేండి" అని అరిచేరెవరో.

ఓ దగుల్బాజీ "సైర్మన్‌కువో, నువ్‌కానా కట్టపడ్డావ్. ఇంకీసుట్టు ఇంటికిపోయి తొంగుతుండు. నీకింకా కట్టం దేనికి?" అని మీద మీద కొచ్చేడు.

ఈకేసు జిల్లా పార్టీ సెక్రెటరీ చాంగ్-చుంగ్ వరకు వెళ్ళింది. కాని అతను ఓగతా గ్రామాల గొడవల్లో మునిగి వుండడంవల్ల ఈ గ్రామపరిస్థితి సవ్యంగా అర్థం చేసుకోలేదు. సమస్య నిశితంగా పరిశీలించడంపోయి అంతా తేలిగ్గా కొట్టి పారేసేడు.

"జనం మాటే రైటైవుంటుంది. కువోని ఏంచెయ్యాలో జనాన్నే అడగండి" అన్నాడతను.

ఇది విని చాంగ్ ఫూ-యంగ్ అతని బలగాన్ని కూడదీసేడు. లీచెన్-చియాంగ్ మేనల్లుడు లీకే-యంగ్ ఈ వూరువచ్చేడు. అతను చాంగ్‌కి కుడిభుజం. అంతా కట్టుదిట్టం చేసుకుని చాంగ్ ఓ మీటింగు పెట్టేడు. జనం చాంగ్ బలగాన్ని చూసేక కువోని తీసెయ్యడానికి మారుమాటాడకుండా ఒప్పుకున్నారు. ఇక వూరంతా చాంగ్ మరలా పెత్తనంలో కొచ్చింది.

"ఇది మరో రాజ్యఁవేటి?" అన్నాడు తీన్ తాత ఓల్డ్‌సన్ చెవిలో.

"పెద్దోల్ల వూసు మనకేల. రాజెవ్వరైతే మనకేటి? మనం ఒల్లక పన్ను గడతాం, అంతే" అన్నాడు ఓల్డ్‌సన్ నిట్టూరుస్తూ.

కువో జిల్లా పార్టీ సెక్రెటరీని కలిసేడు కాని పని జరగలేదు. అందువలన రైతు సంఘం ఆఫీసుగది ఖాళీచేసి మళ్ళీ తన పాత ఇంటికి వెళ్ళిపోయేడు. అదొక పాత గుర్రపు సాల. వానకి గది తడిసిపోయి అతని పడక నానిపోయింది. వాన తగ్గగానే

పొరుగువాళ్ళ కత్తి, తట్ట పట్టుకుపోయి గడ్డి కోసుకొచ్చి ఇంటికప్పు బాగుచేసేడు. కాంగ్, పొగగొట్టం మరమ్మతుచేసి, గోడలు అలికేడు. చివరికి ఆ పాడుబడ్డ గుర్రపు సాలకి ఇంటిరూపు తెచ్చేడు. తన దగ్గర ఒక్క కుండ అయినా లేకపోవడంతో అరువు కోసం ఓల్డ్‌సన్ ఇంటికి వెళ్ళేడు. కువోకి ఏఁవీలేవని తెలిసి ఓల్డ్‌సన్ వాళ్ళనీ వీళ్ళనీ అడిగి కుండలు, గిన్నెలు, ఓ గరిటె, కూరలకత్తి తెచ్చిపెట్టేడు. చావో భార్య అతని కాంగ్ మీదకో చాప ఇచ్చింది. పందులకాపరి 'పు' ఎక్కడినుంచో ఓ అద్దం తెచ్చి అద్దాలులేని కిటికీకి అమర్చి, కాళీలున్నచోట కాగితాలంటించేడు. కువో స్నేహితులు అతన్ని చూసేందుకు వస్తూండేవారు. వాళ్ళంతా అతన్ని యింకా 'చైర్మన్' అనే పిలుస్తూండడం విని, చాంగ్ "కువోని 'చైర్మన్' అని పిలిచిన వాళ్ళని జైల్లో పెట్టిస్తా" నని బెదిరించేవాడు.

దాంతో కువోని బహిరంగంగా 'చైర్మన్' అని పిలవడం మానేసేరుకాని చాటు మాటున ఇంకా అతన్ని 'చైర్మన్' అనే అంటున్నారు. కువో ఏవో పాత సామాను అమ్ముతూ గడుపుతున్నాడు. రాత్రిపూట కాంగ్ మీద పండుకుని చావో పైపు పీలుస్తూ కిటికీలోంచి నక్షత్రాలు చూస్తూ తను రైతుసంఘంలో గడిపిన రోజులు గుర్తుచేసుకునే వాడు. అప్పట్లో అలిసిపోయి బల్ల మీదే పడుకునేవాడు. కాని ఇప్పుడు హాయిగా కాంగ్ మీద పండుకుంటున్నాడు. "బాధ్యతలు లేనివాడికి జీవితమంతా హాయే" నను కుంటూ గురకపెట్టేవాడు.

కువో మళ్ళీ జిల్లా పార్టీ సెక్రెటరీని కలవలేదు. ఇక చాంగే చైర్మన్. అతను వెంటనే అయిదుగురు నమ్మిన బంట్లని కుదుర్చుకున్నాడు. తన పెత్తండ్రి కొడుకు తాంగ్‌ని వూరు పెద్దగా నియమించేడు. అతను మునుపు మంచుకో సైన్యంలో అధికారి. చాంగ్ తన స్నేహితుడు లీకీ-యంగ్‌ని రైతుసంఘం గుమాస్తాగా నియమించేడు. లీకీ-యంగ్ సియావో వున్నపుడు వూళ్ళోలేడు. మంచుకో ప్రభుత్వంలో అధికారిగా వుంటూ, సోవియట్ విమానాల ఆచూకీ పై అధికారులకు తెలియజేస్తుండేవాడు. జపాన్ వాళ్ళు లొంగిపోయేక ఇతను యువాన్ మావో వదిలి వెళ్ళిపోయేడు. ఇన్నాళ్ళు ఎక్కడున్నాడో జాడ తెలియదు. తిరిగొచ్చేక భూస్వాములకి వ్యతిరేకంగా జరిగిన మీటింగులన్నింటికీ వెళ్ళేడు. భూస్వాములను తిట్టేందుకు, కొట్టేందుకు వెనకాడేవాడు కాదు. అందుకని అక్టివిస్టుగా చలామణి అయేడు.

చాంగ్, తాంగ్, లీ - ముగ్గురు ముప్పేటతాడులా పెనవేసుకు పోయేరు. అధి కారమంతా వాళ్ళ చేతుల్లోనే వుంది. కామందుల ఇళ్ళమీదకు వెళ్ళేటప్పుడు వాళ్ళకి

నచ్చిన వాళ్ళనే తీసుకు వెళ్ళేవారు. మోతుబరులతో, మధ్యతరగతి రైతులతో వాళ్ళ ఇష్టమొచ్చినట్లు ప్రవర్తించేవారు. లీ చెన్-చియాంగ్ అనే మోతుబరి ఇంటిమీదపడి రాజకీయంగానే ఎదుర్కొన్నారు కాని పరిమితికన్నా ఎక్కువ వున్న అతని ఆస్తిని ముట్టుకోలేదు. కాని యీ ముఠాకి మధ్యతరగతి రైతు లియు తె-షాన్‌తో పడక అతని గుర్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. కామందుల ఇళ్ళమీదపడి దోచుకొన్న సొమ్ము పంచేవారు కాదు. రైతు సంఘం ఆఫీసు చుట్టూ సాయుధ దళాలు నియమించి వాళ్ళు ముగ్గురు లోపల తాగి తందనాలాడేవాళ్ళు— పాడుతూ, రికార్డులు వింటూ, పొద్దు తిరుగుడు గింజలు ఒలుస్తూ జల్సా చేస్తుండేవాళ్ళు. భూస్వాముల దగ్గర దోచుకున్న సొమ్ముతో ఓ కోఆపరేటివ్ స్టోరు పెట్టేరు. అందులో ఆడవాళ్ళ మేజోళ్ళు, అలంకార సామగ్రి మాత్రం అమ్మేవారు. రెండు మార్లు మాత్రమే జనానికి కొంత సొమ్ము పంచేరు— మొదటి మారు మనిషికి అర్ధరూపాయి, రెండో మారు మనిషికి రూపాయి.

"కూలిడబ్బులన్నా కిట్టలేదు" అనుకున్నారు జనం.

లీకీ-యంగ్ పొట్టి మనిషి. అతని పొడుగు మొఖంలో నక్కజిత్తులు కనిపిస్తుంటాయి. అతను ఎప్పుడూ జనంలోకి వచ్చేవాడుగాదు. ఏదన్నా పొరపాటు జరిగితే చాంగ్ ఫూ-యింగ్ మీదికి తోసేవాడు. చాంగ్ ఓ అమ్మాయిని ప్రేమిస్తున్న సంగతి 'లీ'కి తెలుసు. ఆ అమ్మాయి పేరు 'చిన్నమీ'. యువాన్‌మావోలో ఆవిడకి చాలా చెడ్డ పేరుంది. చాంగ్ రైతు సంఘం చైర్మన్ అయిన దగ్గర్నుండి ఆవిడ రైతుసంఘం ఆఫీసుకి ఎక్కువగా రాసాగింది. అర్ధరాత్రి వరకు పళ్ళికిలిస్తూ, వాగుతూ అక్కడే కూర్చునేది. చాంగ్ మెప్పుపొందడం కోసం లీకీ-యంగ్, కొత్తగా పెట్టిన మహిళా సంఘానికి ఆమె చైర్మన్‌గా ఎన్నికయేలా చూసేడు. మహిళా సంఘం ఆఫీసు కూడా రైతుసంఘం ఆఫీసు పక్కనే. 'చిన్నమీ' ఎన్నికవడంతో మర్యాదగల ఆడవాళ్ళు అక్కడికి రావడం మానీసేరు. ఎంతో బాగా పనిచేసే చావో భార్య పాయి భార్య కూడా వెళ్ళడం మానీసేరు. చిన్నమీ తన బాపతు ఆడవాళ్ళనే ఓ డజను మందిని కూడగట్టుకుంది. కాకులు కోయిలలతో కలవలేవు గదా, ఏ గూటి పిట్టలు ఆ గూటికే.

చిన్నమీ బలగం "ఆడవాళ్ళ పాత అచారాలు మారాలి" అంటూ ప్రతి ఇంటిమీద పడి, ఆడవాళ్ళ జుట్టు కత్తిరించుకోమంటూ బలవంతం చేసేరు. ఎవరన్నా తటపటాయిస్తే వాళ్ళే కత్తిరించేవారు. పంచుకో భావాలు (పురాతన) గల ఆడవాళ్ళు అందమైన ఉంగరాల జుట్టు నేలపాలవడం చూసి గగ్గోలు పెట్టేరు. తర్వాత మహిళా

సంఘం ముప్పయి ఏళ్ళలోపు ఆడవాళ్ళందరినీ తెల్లజోళ్ళు తొడుక్కోవాలని శాసించేరు. జోళ్ళు కొనుక్కునే స్తోమత లేని ఆడవాళ్ళందరు బాధలు పడాల్సి వచ్చింది.

ఆ ఏడాది సత్తువ వున్న ఆడ మగ పొలం పనులు చేస్తుంటే చాంగ్, చిన్నమీ పాతకాలపు బుగతల్లాగ అందరిమీద పెత్తనం చలాయిస్తూ తిరిగేవారు. తర్వాత ఏ పొదల మాటుకో వెళ్ళేవారు. మరుక్షణం పొదల ఆకులు గలగలలాడేవి.

ఓ యువకుడు కుతూహలంకొద్దీ నాగలి దించి పొద పక్కకి వెళ్ళేడు. ఇంతలో చిన్నమీ గొంతు వినిపించింది.

"ఒద్దు, ఆగు, ఎవులో ఒత్తన్నారు."

దొరికిపోయే ననుకుంటూ ఆ యువకుడు కొమ్మల మాటుకి తప్పుకున్నాడు. మళ్ళీ చిన్నమీ గొంతు వినిపించింది.

"ఆగు అరుత్తా అదేటది, సీ, పట్టపగలేనా?" అలా అన్నదేగాని ఆమె అరవలేదు. ఇంకా బెకబెక లాడింది. ఆకులు యింకా ఎక్కువగా కదలాడేయి.

చిన్నమీ భర్తకీ సంగతి తెలిసి తగువుపెట్టుకోను రైతుసంఘం ఆఫీసు మీది కెళ్ళేడు. కాని లీకీ-యంగ్ అతన్ని మధ్యలోనే ఆపి, అరమైలు వరకు అతన్ని కొట్టు కుంటూ ఈడ్చుకు వెళ్ళేడు. జనం అతన్ని చూసి జాలిపడ్డారు.

ఉత్తరపు గదిమీద 'ఉపన్యాసాల గది' అని రాసేడు చాంగ్. చాంగ్‌కి మాట్లా డాలనిపించినపుడు అక్కడికి జనాన్ని పిలిపించి లెక్చెర్లిచ్చేవాడు. ఓ మారు ఓల్డ్‌సన్ కూడా వెళ్ళేడు. ఉపన్యాసం ముగిసేక "నాను సెప్పింది బోదపడిందా?" అని అడిగేడు చాంగ్.

పొలం పనులకు వేళకావడంతోను, అర్థంకాలేదంటే ఏం ముప్పు వచ్చి పడు తుందోనన్న భయంతోను అందరూ అర్థమైనట్టు బుర్రలూపేరు.

"నానేటన్నానో ఓ మారు సెప్పుమీ" అన్నాడు చాంగ్ ఓల్డ్‌సన్ దగ్గరకొచ్చి.

"నువ్వేటి వాగేవో నాకే తెరిక?" అన్నాడు వెర్రెత్తిపోయిన ఓల్డ్‌సన్.

అందరూ నవ్వేరు. కోపంతో చాంగ్ కళ్ళు ఎరుపెక్కేయి. అతను కోపం కొద్దీ తన తోలుబూటుతో ఓల్డ్‌సన్‌ని ఒక్క తాపు తన్నేడు.

ఇప్పుడు సియావో తిరిగొచ్చేడు: చాంగ్ కంటిమీద కునుకేలేదు. తెలతెలవారు తూండగానే కాంగ్ దిగి తన బలగాన్ని కలిసేడు.

(i) వాక్య నిర్మాణం

ఈ అధ్యాయంలో క్రమక్రమంలో భాషా సంగీతాల నిర్మాణ సూత్రాలకు వుండే సామాన్య మూలాధారాలను గూర్చి చర్చించటం జరుగుతుంది.

ఒక జాతిలోని వ్యక్తిగత సభ్యులమధ్య పరస్పర భావ ప్రకటనకు భాషాపదాలు వాక్యాలుగా నిర్మాణం పొందుతాయి. ఒక సామాన్య భాషారూపం వుండటం వలన ఈ మార్గంలో పరస్పర భావప్రకటనా సామర్థ్యం గల వ్యక్తులతో జాతి నిండివుంటుంది. ఆదిమ పరిస్థితులలో, ఎంత చిన్నదయినప్పటికీ ప్రతి జాతికీ జాతి పరిణామంతోబాటు నెమ్మదిగా పరిణామంచెందే సొంతభాష లేదా మాండలికం వుంటుంది.

భాషకు వాక్యం సహజమూలం. వాక్య నిర్మాణ సూత్రాల సముదాయం వ్యాకరణ శాస్త్రం. మాట్లాడటం నేర్చుకునే క్రమంలో పిల్లలు వాక్య నిర్మాణ సూత్రాలను అనుభవం నుంచే నేర్చుకుంటారు. సరితూనిక సూత్రాల అవగాహన లేకుండానే నడకనేర్చినట్లు పిల్లలు వ్యాకరణ సూత్రాలను గూర్చి ఏమీ తెలియకుండానే మాట్లాడటం నేర్చుకుంటారు.

ప్రతి భాషకూ సామాన్యంగా వుండే కొన్ని వ్యాకరణ సూత్రాలు కూడా వుంటాయి[1] ఈ సూత్రాలు తర్కనియమాలకు సంబంధించి వుంటాయి. వ్యాకరణ బద్ధవాక్యం తార్కిక ప్రతి పాదనకు అనుగుణ్యంగా వుంటుంది. తప్పులు లేకుండా మాట్లాడటం నేర్చుకున్న పిల్లలు తర్కనియమాల మీద అధికార పరిజ్ఞానాన్ని సంపాదించారని దీని అర్థం కాదు. తార్కికమైన ఆలోచనకు అవసరమైన మానసిక నైపుణ్యాన్ని పొందారని మాత్రమే అర్థం.

వాక్యనిర్మాణాన్ని విశ్లేషించటంలో ఆంగ్ల భాషా పదాలైన Noun (నామ వాచకము), Verb (క్రియ)ల కంటే అధిక వ్యక్తీకరణ శక్తి కలిగిన చైనాభాషా

"కారేకర్తలు మల్ల ఒచ్చేసినారు- ఆల్లకి తిండి, కట్టెలు మస్తుగా సప్లీ సెయ్యండి. ఆల్లని ఆల్ల పనయ్యేంత వరకే ఇక్కడుంచాల- జాగర్తగుండాల- ఒల్లు దగ్గరెట్టుకోని మాటాడండి_ నేకుంటే అందరం మునగుతాం. ఎవులైనా మన మీన సెడుగా సెప్తే ఆల్ల పని తర్వాత పడతా. మన గుట్టు బైటికి రాకుండా సూసుకోవాల. ఆల్లేటడిగినా ఒల్లకుండండిమీ" అని చెప్పేడు చాంగ్.

అతను ఇంటికి వెళుతుంటే రైతు సంఘం ఆఫీసుకి వెళ్తున్న జనం జట్లు జట్లుగా ఎదురయేరు. వాళ్ళు నవ్వుతూ మాట్లాడుకుంటూ వెళ్తుంటే, చాంగ్ గుండె దడదడ లాడింది, కాళ్ళు వజవజ వణికేయి. కొంచెం కొంచెం పడుతున్న మంచు అతని వేడెక్కుతున్న ముఖం మీద పడి కరిగి కారిపోతోంది.

(ఇంకా వున్నది)

పదాలు 'name word' (నామవాచకం), 'move word' (క్రియావాచకం) అను దృష్టిలో వుంచుకోవటం సహాయకారిగా వుంటుంది. ఇక్కడ నామవాచకం అనేపదం నామవాచక విశేషణాలు రెండింటినీ ఉద్దేశించి ప్రయోగింప బడుతున్నదని కూడా దృష్టిలో వుంచుకోవాలి.

మౌలికంగా సామాన్య వాక్యాన్ని మూడు రకాలుగా విభజించవచ్చును. రెండు రకాల్లో వుండే రెండు పదాల వాక్యం, మూడు పదాల వాక్యం. a) పచ్చని గడ్డి (Grass is green), b) గొర్రెలు మేస్తున్నవి (Sheep eat), c) గొర్రెలు గడ్డి మేస్తున్నవి (Sheep eat grass). మొదటి రకం వాక్యంలో రెండు నామవాచకాలు విరుద్ధాలమధ్య ఐక్యతగా సమ్మేళనం పొందాయి. వాటిమధ్య సంబంధాన్ని తార్కిక పరిభాషలో 'గడ్డి'కి సంబంధించిన భావన 'పచ్చని' అనే తరగతిలో కలిసి వుందనీ, 'పచ్చని' అనే భావన 'గడ్డి' గుణంతో అభేదం చేయబడిందని చెప్పవచ్చును. [కర్తృ పదం ఇంగ్లీషులో అవసరమైనప్పటికీ అనేక భాషల్లో కర్తృపదం వికల్పం కాబట్టి వదిలి వేయవచ్చును. కర్తృపద ప్రయోగం ఆదిమం కూడ కాదు. అలాగే విభిన్న భాషల్లో విభిన్నంగా వుండే పదప్రయోగ క్రమాన్ని కూడా పట్టించుకోనవసరం లేదు.] రెండవ రకం వాక్యంలో నామవాచకం, క్రియలు కారకుడు, కార్యానికి వుండే సంబంధంలో మిళితం అయ్యాయి. రెండు పదాలూ భావనలను నిర్దేశిస్తున్నవి. కానీ క్రియలో భావన చలనశీల కార్యాచరణగా లేదా క్రమంగా భావించబడింది. అదే సమ్మేళనం క్రియా సంబంధ కార్యాచరణ లక్ష్యం కలిసి విస్తృతం కావటంతో మూడవ రకం వాక్యంలో క్రియలక్షణం ఇంకా స్పష్టం చేయబడింది.

ఈ ఉదాహరణలలో కారకుడు (agent) వ్యాకరణ కర్తతోనూ, క్రియాగమ్యం వ్యాకరణ కర్మతోనూ సమానంగా వుంటాయి. మనం ఇంతకు ముందు పేర్కొన్నట్టు వాక్యంలో ఇదే అవశ్యస్థితి కాదు. సంబంధం తలకిందుగా కూడా వుండ వచ్చును. "గడ్డిని గొర్రెలు మేస్తున్నవి" (Grass is eaten by sheep) ఈ వాక్యంలో క్రియాగమ్యం వ్యాకరణకర్త. అలాగే మొత్తం చలనానికి సంబంధించిన భావాన్ని మినహాయించి క్రియావాక్యాలను ప్రయోగించటం మనకు అలవాటు.'He rests in peace' (అతడు విశ్రాంతిలోవున్నాడు.) వ్యాకరణ విభాగాలు ఒక పద్ధతిలో సాంకేతికం (Formal)గా వుంటాయి. అవి అరూపఆలోచనను వ్యక్తంచేస్తూ నిర్దిష్ట అర్థబోధకాలు కాకపోవటమే కారణం. లోతుగా పరిశోధిస్తే వ్యాకరణ సాంకేతిక విభాగాలకు నిస్సందేహంగా నిర్దిష్ట మూలాలు వుంటాయి. జీవశాస్త్ర, భాషాశాస్త్ర ప్రమాణాలు

యీ నిర్ధారణను నిరూపిస్తున్నాయి. పిల్లల మానసిక అభివృద్ధిక్రమ సారాంశంలో సారూప ఆలోచన నుంచీ అరూప ఆలోచనకు పురోగమించటంలో ఈ వ్యాకరణ విభాగ సాంకేతికపద నిర్దిష్ట మూలాలను గమనించవచ్చును. ఇంగ్లీషు భాష వంటి బాగా అభివృద్ధి పొందిన భాషల్లో కూడా విశ్రాంతి, ఆశ్రయం, పుజాయింపు, విధేయత, సద్గుణం, దుర్గుణం, బరువు, గుండ్రం లాటి అరూప భావాలు సారూప మూలచిహ్నలను వ్యక్తం చేస్తాయి. విశ్రాంతిగా వుండటం చలనాన్ని నిరోధించటం, ఆశ్రయించి వుండటం వూగిసలాడటం, నిరీక్షణ దేనికోసమో ఎదురుచూడటం, విధేయంగా వుండటం, మాటవినటం, బలంగా వుండటం, పురుషలక్షణం, పెద్దవశం కావటం, బరువుగా వుండటం, ఎత్తటం కష్టంగా వుండటం, గుండ్రంగా వుండటం చక్రంలా వుండటం. ఆదిమ భాషలకు అరూప భావ వ్యక్తీకరణ శక్తి చాలా బలహీనంగా వుంటుంది. కొన్ని ఆస్ట్రేలియన్ భాషలలో 'గుండ్రం', 'కఠినం' అనే భావాలను చెప్పటానికి మాటలేలేవు. ఈ భావాలను భౌతిక వస్తువులను వుపమానాలుగా చూపుతూ సంజ్ఞా పూర్వకంగా 'Like the moon' (చంద్రుని లాగా) 'Like a stone' (రాయి లాంటి) అనే పద్ధతిలో వ్యక్తం చేస్తారు.

భాష మనిషి సారూప ఆలోచన నుంచీ అరూప ఆలోచనకు పురోగమించే వాహిక కాబట్టి, భాషా విభాగాలు కేవలం సాంకేతికం, అరూపం కాబట్టి ఆరంభదశలో ఇవి కార్య బోధకాలుగానూ, నిర్దిష్టంగానూ వుంటాయని మనం పరిగణించవచ్చును. అలాంటప్పుడు వాటి మూలాధారాలను ఉత్పాదక శ్రమలో అన్వేషించి తీరాలి.

(ii) శ్రమ - క్రమ నిర్మాణం

ఈ సందర్భంలో ఇంగ్లీషు పదం 'subject' (కర్త)లోని అస్పష్టతను స్పష్టం చేయవలసిన అవసరం వుంది. ఇంతకు ముందు చేసిన సామాన్య వాక్య విశ్లేషణలో కారకుడు (agent) అంటే క్రియాపద కార్యాచరణ విషయానికీ, లక్ష్యం (object) అంటే కార్యాచరణ గమ్యానికీ మధ్య వ్యత్యాసాన్ని గుర్తించటానికి కర్త (Subject), కర్మ (object) అనే పదాలను వుపయోగించాం. సరిగ్గా ఇదే అర్థంలో మార్క్స్ "కర్త మనిషి, లక్ష్యం ప్రకృతి"[2] అని చెప్పాడు. మరొక సందర్భంలో, ముందు వుల్లేఖించబడే గ్రంథ భాగాలలో మార్క్స్ శ్రమజీవి కార్యాచరణకు సంబంధించిన లక్ష్యాన్ని – అంటే పని చేసే వస్తువును – అతని శ్రమకు విషయం చేయబడుతుందనే అర్థంలో కార్యాచరణకు విషయంగా వివరించాడు. ఈ గందరగోళం జర్మన్ మూలంలో వుండదు. అందుచేత, ఈ వివరణను అనుసరించి "శ్రమ - విషయం"

(Subject of Labour) శ్రమజీవి కార్యాచరణకు లక్ష్యంగా అవగాహన చేసుకోవాలి.

శ్రమ - క్రమ విశ్లేషణలో మార్క్స్ మూడు అంశాలను విభజించి పరిశీలించాడు. శ్రమ - క్రమానికి సంబంధించిన ప్రాథమిక అంశాలు :

1. మనిషి వ్యక్తిగత కార్యాచరణ, అంటే శ్రమ.
2. శ్రమ విషయం.
3. ఉత్పత్తి సాధనాలు. [See 'Capital', vol.1 P 178]

శ్రమ క్రమంలో రెండవ అంశాన్ని మార్క్స్ ఇలా వివరించాడు :

"మనిషికి భూమి (ఆర్థిక పరంగా నీళ్ళతో కలిసి) వీడు స్థితిలోనే అవసరాలను లేదా జీవనాధారాలను తక్షణ సిద్ధంగా సరఫరాచేస్తూ మనిషికి స్వతంత్రంగా వుంటుంది. భూమి మానవశ్రమకు విశ్వవ్యాప్త వస్తువు"3

మూడవ అంశం :

"శ్రమ సాధనం శ్రమజీవి తనకూ శ్రమ విషయానికీ నడుమ ప్రయోగించే, శ్రమజీవి కార్యాచరణకు మార్గదర్శిగా సహకరించే వస్తువు లేదా వస్తుసంకీర్ణత. శ్రమజీవి కొన్ని పదార్థాల యాంత్రిక, భౌతిక, రసాయనిక గుణాలను తన లక్ష్యాలకు యితర పదార్థాలను విధేయం చేయటంకోసం వుపయోగించుకుంటాడు."4

కాబట్టి పనిముట్టు శ్రమజీవి కార్యాచరణను శ్రమ విషయానికి పంపే వాహనంగా సేవచేసి, పూర్వ నిర్ణీత పథకాన్ని అనుసరించి పునరాకృతిని యిచ్చే సాధనం.

"శ్రమ-క్రమంలో మానవ కార్యాచరణ వుత్పత్తిసాధనాల సహాయంలో పని చేయబడుతున్న పదార్థం మీద ఆరంభం నుంచీ పథకం వేయబడిన మార్పును సంభవింపచేస్తుంది. ఉత్పత్తి ఫలితంలో శ్రమ - క్రమం అదృశ్యమవుతుంది. ఉత్పత్తి ఫలితం రూపాన్ని మార్చి మనిషి అవసరాలకు అనుగుణ్యం చేయబడిన ప్రకృతిపదార్థం. ఇది ఉపయోగ విలువ కలిగింది. శ్రమ శ్రమవిషయంతో కలిసిపోతుంది. శ్రమ భౌతిక రూపాన్ని పొందుతుంది. శ్రమవిషయం పరివర్తన చెందుతుంది. శ్రమజీవిలో చలనశీలంగా కనిపించినది ఇప్పుడు వుత్పత్తి ఫలితంలో చలనరహిత స్థావర గుణంగా కనిపిస్తుంది. కమ్మరి కొలిమిలో సాగపెడతాడు. ఉప్పత్తి ఫలితం కొలిమిలో రూపాన్ని పొందుతుంది."5

అలాగే శ్రమ-క్రమంలో భాషా వ్యాపారాన్ని ఇలా నిర్వచించవచ్చును. ఉత్పత్తి సాధనాలు కార్యాచరణకు మార్గదర్శులుగా సేవ చేయటానికి శ్రమజీవులకూ, శ్రమ

విషయ పదార్థానికీ మధ్య ప్రయోగించబడినట్టే, భాష కార్యాచరణలను సమన్వయం చేసుకునే సాధనంగా శ్రమజీవుల మధ్య ప్రయోగించబడుతుంది.

కాబట్టి ఈ విషయంలో ఇలా నిర్ధారణకురావచ్చును. భాషకు సహజమూలమైన వ్యాకరణ బద్ధ వాక్యం సామాజిక ఉత్పత్తి క్రమంలో వికసించింది. ఈ వ్యాకరణ బద్ధ వాక్య ప్రాథమిక రూపాలకు సంబంధించిన మూడు పదాలు వాక్యంలో మూడవ పదం రెండవ పదంమీద మొదటి పదం కార్యాచరణను మధ్యస్తం చేస్తుంది. రెండు పదాలకు సంబంధించిన వాక్యంలో ఒక పదం మరొక పదం ద్వారా పనిచేస్తుంది, లేదా ఒకపదం మరొక పదంలో కలిసిపోయి పనిచేస్తుంది. ఈ వ్యాకరణబద్ధ వాక్య ప్రాథమిక రూపాలకు క్రమ-క్రమానికి సంబంధించిన కార్యాచరణ విషయం (మనిషి), మనిషి కార్యాచరణ లక్ష్యం శ్రమ విషయం (ప్రకృతి), కార్యాచరణ సాధనం అనే మూడు ప్రధాన అంశాలు ఆకారాన్ని ఇచ్చాయి.

(iii) పాట నిర్మాణం

వ్యాకరణ సూత్రాలకూ సంగీత రూపానికీ మూలాధారం ఒక్కటే. అన్ని భాషల్లోనూ అనుకరణ జంటలు (mimetric doublets) అని పిలువదగిన పద సముదాయం వుంటుంది. డింగ్ - డాంగ్ (ding - dong), బౌ - బౌ (bow - wow), సీ - సా (see - saw), టిక్ - టాక్ (tick - tock), జిగ్ - జాగ్ (jig - jag), పిటర్ - పాటర్ (pitter - patter) చాలమంది వ్యాకరణ శాస్త్రజ్ఞులు అలక్ష్యం చేసిన ఈ పదాలు ఏ సంప్రదాయిక భాషా విభాగంలోనూ ఇమడవు. అయినప్పటికీ ఈ పదాలకు బాగా నిర్వచింపదగిన లక్షణాలు చాలా వున్నాయి. ఇవి అర్థవ్యక్తీకరణ శక్తి కలిగిన శబ్ద ధ్వనులు. ప్రకృతి ధ్వనుల అనుకరణ నుంచి పుట్టినవి. ధ్వన్యనుకరణాలు కాబట్టే ఈ పదాలకు మానవీయ ముద్రవుంది. వానర సదృశ జంతువులు ప్రకృతి ధ్వనులను అనుకరించలేవు. అనుకరణ భాషా పదార్థ మూలాధారం. ఈ పదసముదాయం పునరుక్తాలు. అంటే ఆ పదాలు ధ్వని భిన్నంగా వుండి ఒకే అంశాన్ని వ్యక్తం చేసే ఏక స్వరశబ్దాలు. ఇది పద రూప భేదానికి సంబంధించిన ప్రాథమికరూపం. ఈ అనుకరణ జంటలు పిల్లల మాటల్లోనూ, ఆదిమ భాషల్లోనూ సర్వ సాధారణంగా వుంటాయి. ఈ శబ్ద చిహ్నాలు మన భాషల వ్యాకరణ నిర్మాణంలో కూడా కనిపిస్తాయి.

సంగీతాన్ని తీసుకుంటే ఇప్పుడు మనం పరిశీలించే శ్రామికపాటలో అనుకరణ జంట అభిన్న లక్షణంగా వుంటుంది.

శ్రామిక – గేయం లేదా పనిపాట బరువులు ఎత్తడం, బరువులు లాగటం, తెడ్లు వేయటం, కోత కోయటం, నూలుపడకటం వంటి సామూహిక లేదా వ్యక్తిగత శారీరక శ్రమకు సంబంధించిన ఏదో ఒకరూపాన్ని వడిపించే ఉపకరణం. ఇదిరెండు భాగాలుగా వుంటుంది. పల్లవి (refrain), ఆశువు (improvisation) .

పల్లవిపాట లేదా శ్రమ–కూత శ్రమపడే వాస్తవక్షణాల్లో కూసే అక్షర ఉచ్ఛారణ లేని కూత. ఇది వ్యత్యాసం లేకుండా సమధ్వనితో పునరుక్తం అవుతుంది. ఇది ఇతర శరీర చలనాలతో కలిసివుండే కంఠధ్వనుల ప్రతిబింబచర్య. ఈ కూతల ప్రాథమిక రూపాల్లో రెండు లేక మూడు ఉచ్ఛారణయోగ్యమైన అచ్చులు వుంటాయి. ఇలా ఉచ్ఛారణయోగ్యతగల కూతకు తెడ్లు వేసేవాడు నావలోని బృందాన్ని ఉద్దేశించి చేసే తెడ్ల – కూత 'o–u'p!' (ఓ యూప్)ను ఉదాహరించవచ్చును. మొదటి స్వరం సంసిద్ధ సంకేతం. మూడు అచ్చుల కూతలో మూడవ స్వరం వోల్గాబోటు పాట 'e – u'm – nyem!' లోలా శ్రమ తర్వాత అలసట తీర్చుకునే నిలుపుదల సమయానికి సంకేతం.

నిలుపుదల సమయానికి సంకేతం.

శ్రమ కూతలకు మధ్య పాడేది ఆశువు. ఈ క్రింది దక్షిణాఫ్రికాలోని రాళ్ళు బద్దలు కొట్టే శ్రామికుల పాటలో పూర్తి అక్షరోచ్ఛారణతో భిన్నంగా వుండి శ్రమ మీద శ్రామికుల ఆత్మాశ్రియ ధోరణిని వ్యక్తం చేస్తుంది:

"They treat us badly, e – he'!
they are hard on us, e – he'!
they drink their coffee, e – he'!
And give us none, e – he'!"

"మనల్ని వాళ్ళు నీచంగా చూస్తారు ఏ హే!
మనతో కఠినంగా వుంటారు వాళ్ళు ఏ హే!
కాఫీ తాగుతారు వాళ్ళు ఏ హే!
మనకైతే ఏమీ యివ్వరు ఏ హే!"

శ్రమ కూతలో మొదటి అచ్చుకు రెండవ అచ్చుతో వుండే సంబంధం వంటిదే మొత్తం మీద శ్రమ – కూతతో ఆశువుకు వుంటుంది. శ్రమ నుంచీ కూత పుట్టినట్టే కూత నుంచీ పాట పుట్టింది.

బాగా అభివృద్ధి పొందిన పాట శ్రమ–క్రమం నుంచీ విడిపోవటంతో శ్రమ పాటనుంచీ విభిన్నంగా వుంటుంది. అభివృద్ధిపొందిన సంగీతంలో ఇప్పటికీ కంఠ

ధ్వని, శరీరకశ్రమల రెండు భాగాలు వున్నాయి. పనిముట్టు స్థానంలో సంగీత వాద్యం వచ్చింది. గాత్రం ప్రబలమై స్వతంత్రంగా గాత్రాన్ని మాత్రమే ఉపయోగించే గాత్ర సంగీతం వచ్చింది. వాస్తవంగా పాట అనబడేది శ్రమ పాట నుంచీ అభివృద్ధి పొందిందని పాట నిర్మాణాన్ని బట్టే రుజువుచేయ వచ్చును. ఈ అభివృద్ధి రెండు ప్రధాన మార్గాల్లో పొందింది.

మొదట ఆళువులు లయాన్విత ద్వయాల్లో సమూహం చేయబడుతాయి. పల్లవి పాటలు ఈ క్రింది సముద్ర నావికా గేయంలా విభిన్నంగా వుండి అక్షరాలతో ఉచ్ఛరింపబడుతాయి.

"Now when a Black Baller is clear of the land,
Tibby way hay, blow the man down !
The bosum he gives out the word of command :
Ho, gimme some time to blow the man down !

శ్రమ క్రమం నుంచీ విడివడిపోయి, ఆళువు క్రమబద్ధ ఆకృతిని పొంది, స్వరావహరణ విలువలను సముపార్జించకున్నది.

"Why does your brand sae drop wi' blude, Edward, Edward?
Why does your brand sae drop wi' blude, And why sae sad gang ye, o ?
O, I hae kill'd my hawk sae gude, Mither, mither,
O, I hae kill'd my hawk sae gude, And I had nae mair but he, O.

ఇది పద్య రూపాలన్నిటిలోనూ బాగా ప్రముఖమైన చతుష్పాత్తు. ఇది సాధారణంగా ఒకే ఛందస్సు, ఒకే లయ వున్న పద్యంలోని రెండు పాదాల రెండు జంటల కూర్పు. లయ ఆళువుకు శేషం.

"They liv'd a lass in yonder dale, And down in youder glen o,
And Kathrine Jaffray was her name, well known by mamy men o."

ఈ సందర్భంలో ఒక ఉదాహరణగా తొమ్మిదవ శతాబ్దానికి చెందిన చైనా పాట ఒకటి వుంది.

"A thousand miles from home,
At court these twenty years,
one phrase from that old tune,
Draws forth your tears."

ఈ రకం పద్యరూపాలు ప్రపంచమంతటా కనిపిస్తాయి.

సంగీతంగా విశ్లేషిస్తే చతుష్పాత్తు ప్రతిదీ రెండు ప్రస్తారాలు (figures) కలిగిన రెండు, నాలుగు లేదా ఎనిమిది లయ (తాళం)లు గల రెండు సంగీత సమాయల (phrases)తో విభజింపబడి ఒక సంగీతవాక్యం (sentence) మొదటిది రెండవ దానికి దారితీస్తూ, రెండవది మొదటి దానిని అనుసరించే ప్రకటన (పాట), ప్రత్యుత్తరాలు (ఎదురు పాట) [announcement, responsion]గా పరస్పరం వుంటాయి. శ్రామిక పాటలో ప్రయోజనాత్మక ఐక్యతగావున్న రెండు భాగాల నుంచీ పుట్టి ఇవి పరస్పరం ఒక స్థిర పద్ధతిలో ఐక్యతగా రూపొందుతాయి. దీనినే సంగీతకారుడు A - B అని స్వరద్వయ రూపంగా (binary form) చెపుతాడు.

అభివృద్ధికి సంబంధించిన మరొకరీతిలో మొదటిదాన్ని, రెండవదాన్ని ఆకువులు అనుసరించే మూడు పాదాల సమూహాలుగా పల్లవి పాటలు కూర్చబడినవి.

A. Lowlands, lowlands, lowlands, lowlands low,
B. our captain was a bully man.
A. Lowlands, lowlands, lowlands, lowlands low,
B. He gave us bread as hard as brass
A. Lowlands, lowlands, lowlands, lowlands low.

ఈ సముద్ర నావికా గేయంలో ద్విపాత్తు రూపం నుంచీ త్రిపాత్తు (ternary form) రూపం వుదయించటాన్ని మనం గమనించవచ్చును. చివరకు శ్రమ నుంచీ విడిపోయి ఆకువుకు, పల్లవి పాటకూ మధ్య వ్యత్యాసం ప్రయోజనాత్మక విలువను కోల్పోయి కేవలం సంప్రదాయిక రూపం ధరించింది. ఇది మనకు పరిపూర్ణంగా అభివృద్ధి పొందిన త్రిపాత్తు రూపాన్ని ప్రసాదించింది. (A - B - A)

A. "O charlie is my darling, my darling, my darling,
charlie is my darling, the yound chevalier.
B. 'T was on a sunday morning right early in the year.
that charlie came to our town, the young chevalier.
A. O charlie is my darling, the young chevalier.

కాబట్టి రెండు పదాల, మూడుపదాల రెండు రకాల వాక్యం ద్విపాత్తు, త్రిపాత్తు (ద్విస్వర, త్రిస్వర) లయిన సంగీత వాక్యానికి అనుగుణ్యంగా వుంటుంది. ఒకటి తార్కిక రూపంలో, మరొకటి లయాన్విత రూపంలో నిర్మాణంపొందే వ్యాకరణ, సంగీత వాక్యాలు, శ్రమ _ క్రమంలోని రెండు అంశాలు పరాశ్రయ లేదా అవగాహనాంశం, ఆత్మాశ్రయ లేదా అనుభూతి అంశానికి అనుగుణ్యంగా వుంటాయి.

NOTES:

1. Marx, 'Contribution to the critique of political economy' P. 90

2. "the subject, man, and the object, nature" (Marx, 'contribution to the critique of political economy' p, 90)

3. "The soil (and this, economically speaking, includes water) in the virgin state in which it supplies him with necessaries or means of subsistance ready to hand exists independently of man and is the universal subject of human labour." ('capital', vol 1. p. 178).

4. "An instrument of labour is a thing or a complex of things, which the labour interposes between himself and the subject of his labour and which serves as the conductor of his activity. He makes use of the mechanical, physical and chemical properties of some substance in order to make other substances subservient to his aims" (Ibid, p. 179)

5. "In the labour-process man's activity, with the help of the instruments of production, effects an alteration, designed from the commencement, in the material worked upon. The process disappears in the production. The latter is a use-value, nature's material adopted by a change of form to the wants of man. Labour has incorporated itself with its subject; the former is materialised, the latter is transformed. That which in the labourer appeared as movement now appears in the product as a fixed quality without motion. The blacksmith forges and the product is a forging." (Ibid, p. 180)

[జార్జి థామ్సన్ రాసిన మానవసారం (ది హ్యూమన్ ఎసెన్స్) అనే పుస్తకం లోని మూడవ అధ్యాయానికి త్రిపురనేని మధుసూదనరావు అనువాదం.]

ఎవడబ్బ సొమ్ము

బొల్లిముంత నాగేశ్వరరావు

సుక్కలు నీ సొమ్మంటర - సావుకార
సెందురుడు నీ సొమ్మంటర - సావుకార
మబ్బులు నీ సొమ్మంటర - సావుకార
మంచు డబ్బలు నీ సొమ్మంటర -
సావుకార!

కొండలు నీ సొమ్మంటర - సావుకార
బండలు నీ సొమ్మంటర - సావుకార
సంద్రం నీ సొమ్మంటర - సావుకార
సేపలు నీ సొమ్మంటర - సావుకార!
గాలి నీకు సొమ్మంటర - సావుకార
దూలి నీకు సొమ్మంటర - సావుకార.

పేకువ నీ సొమ్మంటర - సావుకార
ఎలుతురు నీ సొమ్మంటర - సావుకార!
ఏదీ నీ సొమ్ముకాదు - సావుకార
భూమి నీకు సొమ్మంటర - సావుకార,

అందరిదీ ఆ భూమి - సావుకార!
ఆక్రమిస్తుండావుర - సావుకార-
అడ్డు వత్తివా నువ్వ - సావుకార
గడ్డి గరపిత్తాముర - సావుకార!

విప్లవ 'కళ్యాణా'నికి...

రుద్రజ్వాల

జోహార్లు.... జోహార్లు
ఎర్రని జోహార్లూ....
రైతుల కలల రూపమా!
కూలీ కంటి దీపమా!
ఎర్రజెండ రెప రెపలో
ఎదిగే ప్రజ ప్రాణమా!
అమరుడవై నినదించే
విప్లవ కళ్యాణమా! ||జోహార్లు||

కృష్ణానది కెరటాలకే
కదలిక అందించినావు
నూజివీడు జమీందార్ల
నిద్దుర మరపించినావు
గన్నవరం తాలూకా
గడ్డంతా వీచి, వీచి
గడ్డ పలుగులను పోరుకు
ఉవ్వెత్తున నడిపినావు ||జోహార్లు||

తెలంగాణ భూసమరం
తొలకరి జల్లయినావూ
కడెం ఆయకట్టు రైతు
కను చూపై మండినావు
ఆదిలాబాద్ జిల్లాలో
భూస్వామ్యం గుండెపైకి
కొడవలి, నాగళ్ల సేన
కదం తొక్క నడపినావు ||జోహార్లు||

ఎమర్జెన్సీ చీకట్లలో
ఎదురులేని ధీమాతో
పోలీసులు పట్టి, కొట్టి
బాధలెన్నో పెట్టినపుడు
తాళ్లపేట అడవిన నిను
తుపాకీలు బెదరించిన
అడవి అడవి తల వూపగ
అచలమై నిలిచినావు ||జోహార్లు||

మందమర్రి, బెల్లంపల్లి
కార్మిక వాడల నీడల
రివిజనిజం మబ్బుతెరల
ఎంత చేతులతో దులిపి,
తెలుగు నేల పడుచుతరం
సెలయేరుల తట్టిలేపి
తిరుగుబాటు బాటలలో
పరవళ్లెత్తించినావు ||జోహార్లు||

రైతు కూలి రాజ్యంకై
రేబవళ్ల గట్టుదాక
మాటకు చేతకు వంతెన
మార్గమై నడత పరచి
కమ్యూనిజం గుండియపై
ఉద్యమాల వూపిరివై
జీవితాస్తమయంలోను
జనం పొద్దు తడిమినావు ||జోహార్లు||

నువ్వెత్తిన ఆలోచన
వింటినారి సారిస్తూ....
నువు నేర్పిన ఆశయశర
సంధానం సాగిస్తూ....
వసంత మేఘ గర్జనం
మరల మరల మరల మోగ
మిగిలిన నీ కర్తవ్యం
కొండ్రిలు కొనసాగిస్తాం ||జోహార్లు||

(కమ్యూనిస్టుగా చివరివరకూ జీవించి, అకాలమృత్యువు వాతబడిన అమరుడు కళ్యాణం వెంకటేశ్వరరావుకు....)

హంతక ప్రమాదశీల అగ్రరాజ్య అంతరిక్ష ప్రయోగశాల స్కైలాబ్

స్కైలాబ్ పడుతుందన్న భయం ప్రపంచంలో దాదాపు అన్ని దేశాల ప్రజలను కలవరపరచింది. ఇది ధనవంతుల కంటె పేదప్రజలనే చాలా ఎక్కువగా ఆందోళ పరచింది. అగ్రరాజ్యాలు మాత్రం ఏమీ చలించలేదు. ప్రపంచయుద్ధం కూడ ఇంత మంది ప్రజలను ఒకేసారి ఇంతగా భయపెట్టివుండదు.

మన రాష్ట్రంలో, ముఖ్యంగా కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో, ప్రజలు అరచేతుల్లో ప్రాణాలు పెట్టుకున్నారు: ధనవంతులు మాత్రం సురక్షితమని తమకు తోచిన ప్రదేశాలకు వెళ్లిపోయారు. స్కైలాబ్ ఇంత భయోత్పాతాన్ని కలిగించడానికి మన పత్రికలు కూడ యథాశక్తిగా దోహదం చేసాయి. ఒక పిల్లవాడు ఉదయం పేపర్ రాగానే దాన్ని చూసి, స్కైలాబ్ మీద పడుతున్నట్లుగా భయపడి, తాను చచ్చిపోతానని దుఃఖించేవాడు. అంతటి భయాన్ని కలిగించాయి మన పత్రికలు. అయితే దీనివల్ల దినపత్రికలు అంటే ఏమిటో తెలియని వాళ్ళ వార్తా పత్రికలు వాస్తవ పత్రికలు కాదని ప్రమాద పత్రికలని, ఇవికూడ స్కైలాబ్ లేనని తెలుసుకున్నారు.

ఇంతటి భయోత్పాతాన్ని కలిగించిన ఈ స్కైలాబ్ వంటి అంతరిక్ష ప్రయోగాల వల్ల ఇతర గ్రహాలకు సంబంధించిన సమాచారం తెలియవచ్చు. మన శాస్త్రవిజ్ఞానం పెరిగిందనడానికి గుర్తు కావచ్చు, కాని ఇవి ఏ విధంగానూ సామాన్య మానవుని జీవితాన్ని మెరుగుపరచటం లేదు. భూమి మీదనే కాకుండా అంతరిక్షంలో కూడ తమ ఆధిపత్యాన్ని నెలకొల్పుకోవడానికి అగ్రరాజ్యాలు పడుతున్న పోటీనే ఇవి తెలుపుతున్నాయి. ఆ విధంగా శత్రుదేశాలమీద ఆధిపత్యాన్ని చలాయించడానికి, వాటి ఆయుధ సంపదను, సైనిక వ్యూహాలను తెలుసుకోవడానికి ఈ ప్రయోగాలు తోడ్పడుతున్నాయి. సామాన్య ప్రజలకు ఏ విధంగానూ లాభకరం గాని ఈ ప్రయోగాలకు ధన ఖర్చు మాత్రం అపారంగా అవుతున్నది.

ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు రాబర్ట్ ఎస్. మెక్‌నమరా 'అభివృద్ధి - ఆయుధాల పోటీ' అనే అంశంపై మే 22, 1979 న చేసిన ప్రసంగంలోని కొన్ని అంశాలు. (ఇండియన్ ఎక్స్‌ప్రెస్ 9-7-79)

ప్రపంచదేశాలు సైన్యాన్ని పోషించడానికి, ఆయుధాలను తయారు చేయడానికి ఎంత ధనాన్ని వెచ్చిస్తున్నాయో మన అవగాహనకు తెస్తాయి. ఈ వ్యయం సామాన్యుని జీవితం మీద ఎంతటి భారాన్ని వేస్తున్నదో కూడ చెపుతాయి. ఈ ఆయుధాల పోటీని, ప్రజల జీవన ప్రమాణాన్ని మెరుగు పరచని ఈ అంతరిక్ష ప్రయోగాలను తీవ్రంగా వ్యతిరేకించవలసిన అవసరం ఎంతైనా వున్నది.

ప్రపంచ వ్యాప్తంగా రక్షణశాఖ వ్యయాలు ఎంతగా పెరిగిపోయాయంటే వాటి పూర్తి లెక్కలను తెలుసుకోవడం కష్టసాధ్యమై పోయింది.

ఇప్పుడు ఖర్చు పెడుతున్న మొత్తం సంవత్సరానికి 320000 కోట్ల రూపాయలకు పైగా వుంది.

ఇప్పటి అంచనాల ప్రకారం ప్రపంచంలో క్రమ బద్ధమైన మిలిటరీ, పారా - మిలిటరీ సైన్యాల్లో 3 కోట్ల 60 లక్షల మంది యుద్ధం చేయడానికి కావలసిన ఆయుధాలతో వున్నారు. రిజర్వు సైన్యంలో మరొక 2 కోట్ల 50 లక్షల మంది వున్నారు. మిలిటరీకి సంబంధించిన వృత్తుల్లో 3 కోట్ల మంది పౌరులు వున్నారు.

ఆయుధాల పరిశోధన కోసం, అభివృద్ధి కోసం చేసే ప్రజా ధన వ్యయం ఇప్పుడు సంవత్సరానికి 24000 కోట్ల రూపాయలకు చేరుకున్నది. ఈ పనిలో అయిదు లక్షల మంది శాస్త్రజ్ఞుల, ఇంజనీర్ల ప్రతిభలు వినియోగపడుతున్నాయి. ఈ ప్రపంచంలో ఏ ఇతర పనికి వినియోగింపబడుతున్న దాని కన్నా ఎక్కువైన గొప్ప పరిశోధనా ప్రయత్నం ఇది. విద్యుచ్ఛక్తి, ఆరోగ్యం, విద్య, ఆహారం - వీనికి సంబంధించిన సమస్యల మీద మొత్తంగా ఖర్చు పెడుతున్నదాని కంటె ఎక్కువగా ప్రజాధనం ఈ పరిశోధన కోసం వినియోగపడుతున్నది.

ప్రపంచం యొక్క మొత్తం రక్షణశాఖ బిల్లులో అమెరికా, రష్యాలది కలిసి సగానికంటె ఎక్కువగా వుంటుంది. ప్రపంచం యొక్క ఆయుధాల వ్యాపారంలో ఈ రెండు దేశాలది మూడింట రెండు వంతులు వుంటుంది.

పారిశ్రామికవంతమైన దేశాల్లోకాక, అభివృద్ధి పొందుతున్న దేశాల్లో నే మిలటరీ బడ్జెట్‌లు చాలా వేగంగా పెరుగుతున్నాయి.

పన్నుల రూపంలో వస్తున్న ధనంలో సగటున 6 రూపాయలకు 1 రూపాయి మిలటరీవ్యయం కోసం వినియోగింప బడుతున్నది. అంటే ఇప్పుడు ఖర్చు పెడుతున్న అంచనాల ప్రకారం పన్ను చెల్లిస్తున్న ఒక సగటు మనిషి తన జీవితకాలంలో. తన మొత్తం ఆదాయంలో మూడు, నాలుగు సంవత్సరాల ఆదాయాన్ని ఆయుధాల పోటీకి చెల్లించవలసి వుంటుందని అనుకోవచ్చు.

మరి దానితో అతడు ఏం కొనుక్కోగలడు ?

గొప్ప రక్షణా ?

కాదు. ఈ అసందిగ్ధమైన పరిస్థితుల్లో జీవితం యొక్క నిజమైన ప్రయోజనాలను పొందడంలో జీవితకాలమంత ఆలస్యాన్నీ, గొప్ప నష్టాన్నీ, అంతకన్న గొప్ప ప్రమాదాన్నీ.

— గంగాధర్

❝ముద్రణాలయంలో కంపోజిటరు తన తరహాలో తానొక వీరుడై, మరో వీరుడు కనిపెట్టిన యంత్రం సాయంతో తయారుచేసే కొత్త పుస్తకాన్ని నా చేతుల్లో పట్టుకున్నప్పుడు ప్రాణవంతమైనదీ అద్భుతమైనదీ నాతో మాట్లాడ గలిగేదీ ఏదో నా జీవితంలో ప్రవేశించిందన్న భావం కలుగుతుంది నాకు_❞

— మార్గిం గోర్కీ

మరి మన జీవితానికి పుస్తకమనే కొత్త స్నేహితుణ్ణి ప్రసాదిస్తున్న, ఒక దశాబ్దం పైగా ప్రతి నెలా మనకు కొత్త సృజనను అందిస్తున్న ముద్రణాలయంలో కంపోజిటర్లు, మెషిన్‌మన్లు, బైండర్ల_ ప్రెస్ వర్కర్ల జీవన స్థితిగతు లెలావున్నాయో ఈ మెరిసే అక్షరాలు ఏ కనురెప్పలపై నిలిచిన కన్నీటి బిందువులపై ప్రతిఫలిస్తు న్నాయో, ఏ క్షయ శ్వాసతో అక్షర రూపం పొందుతున్నాయో, ఏ ఆకలి పేగులు అచ్చు కాగితాలవుతున్నాయో, ఏ కదుములు గట్టిన కాళ్ళ రక్తం చైతన్యాన్నీ పుస్తకాల ద్వారా రగిలిస్తున్నదో, ఏ పోగొట్టుకున్న చూపు మనకు 'చూపు' నిస్తున్నదో ఒకసారి చూద్దామా_

మెరిసే అక్షరాల వెనుక...

అది చలికాలం_

పదేళ్ళుగా పనిచేసినా చివరకు వర్కర్‌కు ప్రివిలేజ్‌లీవులు, గ్రాట్యుటీ, కంపన్సేషన్ వగైరా ఏమీ ఇవ్వకుండా ఎగనామం పెడుతున్న కాలం_

వరంగల్‌లోని ఒక ప్రింటింగ్ ప్రెస్ మరొక వూరికి మార్చటమో అమ్మటమో జరిగి, అందులో పనిచేసిన వర్కర్ల జీవితాలను గంగలో కలిపేసే యజమాని నిర్ణయాన్ని ఎదిరించి పోరాటం సాగించిన కాలం_

అప్పుడు ప్రెస్ వర్కర్స్‌కు పకడ్బందీ యూనియన్ లేకపోయినా ఒక కామ్రేడ్ నాయకత్వాన అందరూ ఒక్కటై ఆ ప్రెస్ ముందు బైఠాయింపు చేసిన కాలం_ దినాలూ రాత్రిలూ అక్కడే మంటలు వేసుకొని కూర్చున్న కాలం_

అది చలికాలం.

1955 _ 57లో అనుకుంటాను.

ఆ పోరాటం విజయవంతమైంది_

అంటే, అసలే లేని రోజుల్లో అంతో ఇంతో....

ఈ ఘటన జరిగి దాదాపు ఇరువైఐదు ఏళ్ళవుతున్నది.

తర్వాత పది సంవత్సరాల నిస్తబ్ధత.

1965లో ప్రెస్ వర్కర్స్ యూనియన్ స్థాపన జరిగింది.

అప్పటి వరకూ చట్టబద్ధమైన హక్కులు ఏవీ అమల్లోలేవు-

యూనియన్ స్థాపించుకొని చట్టరీత్యా సంక్రమించిన సెలవులూ లీవులూ వగైరా అమలు చేయించాలని, జీతాలలో 25% పెంపుకావాలని డిమాండ్ చేసి, ఆ డిమాండ్ల సాధనకు మొదటి సారిగా సమ్మె నిర్వహింపబడ్డది. ఎడాపెడా దాదాపు రెండు నెలల పోరాటం....

రెండు నెలల సమ్మె వగైరా పోరాటాల తర్వాత కార్మికుల సమస్యలు ఆర్బిట్రేటర్‌కు సమర్పించబడినాయి.

ఆ సందర్భంలో ఓనర్స్ ప్రతినిధులను చర్చా సమావేశానికి రావల్సిందిగా వర్కర్‌చేత ఆర్బిట్రేటర్‌గారు కబురుపెడితే, ఆనాడు ఒక యజమాని ఆ వర్కర్‌పై చేయిచేసుకున్నాడు.

"మరి మీ మాటగా వెళ్ళిన వ్యక్తి మీద చేయిచేసుకున్న వారిపై మీరు గైకొనే చర్య ఏమిటి?" అని ఆర్బిట్రేటర్‌గారిని అడిగితే-

"మీరు కొంచెం ఓపిక పట్టాలె- నా ముక్కుల్లోంచి వెళ్ళే శ్వాసను గమనించండి!" అన్నాడు. అంతే- ఇప్పటి వరకూ ఆయన శ్వాసలో మార్పులేదు- ఈ మధ్యన ఆయన షష్టిపూర్తి జరిగింది గాని, ఆ వర్కర్ విషయంలో మాత్రం ఏమీ జరగలేదు.

ఆర్బిట్రేటర్ అంటే మధ్యవర్తి అయినట్లే, ఆయనకు సమర్పించిన సమస్యలు కూడా న్యాయాన్యాయాలతో నిమిత్తం లేకుండా మధ్యకు సగం అటు, సగం ఇటు చేశాడు.

ఈ ప్రింటింగ్ ప్రెస్‌లు ఇంతకు ముందు షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ ఆక్టు కింద వుండేవి- హఠాత్పరిణామంగా వీటిని 1968 లో ఫ్యాక్టరీ ఆక్టు కిందకు మార్చివేసింది ప్రభుత్వం. అప్పుడు అందరూ బోనసు వస్తుందని, ఇయస్సై వుంటుందని, ప్రావిడెంటు ఫండు వగైరా సౌకర్యాలన్నీ మాకీ ప్రభుత్వం కలుగ జేస్తోందని సంబరపడ్డారు. తీరాచూస్తే అవన్నీ అద్దంలో చూపిన పరమాన్నాలే.

యేమంటే- యేప్రెస్‌లోగానీ వర్కర్స్ సంఖ్యతో నిమిత్తం లేకుండా కరెంటు మోటరుతో నడిచే మిషను ఉన్నచోట ఫ్యాక్టరీ ఆక్టు వర్తిస్తుంది అన్నారు- కానికిందనే ఇంకో క్లాజువుంచి. ఎందులోనైనా పదిమంది పనివారు వున్నపుడు మాత్రమే బోనసు వస్తుంది అని. దీనిని దృష్టిలో పెట్టుకొనే యజమానులు 9 మందిని మాత్రమే పనిలో పెట్టుకొంటున్నారు.

ఒకే రకమైన పరిశ్రమలో ఒకే రకమైన పనిని, శ్రమను చేస్తున్న కార్మికులకి ఆ పక్క ప్రెస్‌లో వారికి బోనసు, ఇయస్సై, గ్రాట్యుటీ వస్తాయనడం, ఈ పక్క ప్రెస్‌లో వారికి ఇవేవీ రావనడం ఒక కుటిలనీతి. పేరుకు మాత్రం ఫ్యాక్టరీ ఆక్టు. అమలులో అటు షాప్స్ ఆక్టు కాక, ఇటు ఫ్యాక్టరీ ఆక్టుకాక, మేకమెడ చన్నుల్లాగా ఊగుతోంది.

1970 లో మొదటిసారిగా ప్రింటింగ్ ప్రెస్సు పనివారికి మినిమం వేజెస్ చట్టం వచ్చింది. ఈ కనీస వేతనం కనీసపు గంజినీళ్లకు కూడ సరిపోనిది. ఈ చట్టం చేసిన వారు ఒక్క నెలరోజులు ఈజీతంతో బతికిచూస్తే బాగుండేది. ఏమైతేనేం ఈ మాత్రానికే ఈ విషయంలో కూడా లేబర్ డిపార్ట్‌మెంటు తెల్లజెండాయే ఎత్తింది. ఇప్పటి వరకూ కూడ మినిమం వేజెస్ ఎక్కడా పూర్తిగా అమలుకాలేదు. అందులోనే కొన్ని లొసుగులతో వర్కర్స్ యూనియన్, ఓనర్స్‌అసోసియేషన్ ఒక ఒప్పందం చేసుకున్నాయి.

1972 లో గ్రాట్యుటీ చట్టం చేసింది. ఆశ్చర్యకరమైన విషయమేమంటే– ఇంతకు పూర్వం షాప్స్ ఆక్టు ప్రకారం అందులో ఒకరిద్దరు పనిచేసినా ఒక సంవత్సరం పని చేసినా సర్వీసు కట్టిచ్చేవారు– కాని ఈ కొత్త గ్రాట్యుటీ చట్టం ప్రకారం షాప్స్ మరియు ఫ్యాక్టరీ వారిని మేళవించి, యేసంస్థలోనైనా పదిమంది కంటే తక్కువ ఉండకుండా, అయిదు సంవత్సరాలకు తక్కువ కాకుండా పనిచేసిన వారికి మాత్రమే గ్రాట్యుటీ వస్తుంది.

1974 లో రెండవసారి మినిమం వేజెస్ సవరించి ప్రకటించింది. కార్మికుల జీవితాలకు కొలమానం అది– మేకతోక బెత్తెడే !

ఇయస్సై. 1975లో పదిమంది పనివారుంటే చాలు ఇయస్సై వర్తిస్తుందని వచ్చిన చట్టం. నెలకు నాలుగు రూపాయల కోత తప్పితే కలిగే ప్రయోజనం శూన్యం. సరె ! జ్వరంగిరం వస్తే ! ఆ ఆసుపత్రి ఈ ఆసుపత్రి – దొందూ దొందే ! వారం రోజులు సిక్‌లీవు పెడితే నాలుగు రోజులు సాంక్షన్. అందులో రెండు రోజులు కోత. ఆ మిగిలిన రెండు రోజులకు సగం జీతం ! ఆ సగం జీతానికి రెండ్రోజులు పని వదిలి తిరగాలి. ఇదే ఇయస్సై చట్టం. దీనికి నెలకు నాలూ్రపాయల సుంకం !

ప్రస్తుతం 1979 మే నెల నుండి అమలులోకి వచ్చునట్లు మినియం వేజెస్ తిరిగి ప్రకటించింది ప్రభుత్వం. ఇల్లుపీకి పందిరి వేసినట్లున్నది– ప్రభుత్వం

ప్రకటించిన ఈ వేజెస్ వరంగల్ పని పరిస్థితులను బట్టి ఎక్కువలో ఎక్కువ పెద్ద వర్కర్‌కు 220/- రూపాయలు. ఈ మాత్రం ఇప్పటికి కార్మికులు పొందుతున్నారు. ఈ చట్టం ద్వారా కలిగిన మేలేమిటంటే- ఇప్పుడప్పుడే జీతాలు డిమాండు చేయవీల్లే కుండా నోరెత్తవద్దనడమే.

జాతీయ కార్మికుని కనీస వేతనము రు. 300/- వుండాలని ఒకపైపు అలజడులు లేస్తుండగా ప్రెస్ కార్మికుని కనీస వేతనం రు. 151/- నిర్ణయించడం ఆందోళనలకు కవ్వింపు చర్య.

చట్టాలు కార్మికుడి విధిని మరింత తీవ్రంగా బలవంతంగా నిర్వహించాలని శాసిస్తాయి- కామందుకు మరింత ఎక్కువగా దోపిడీ చేసేందుకు, హింసించేందుకు దోహదం చేస్తాయి - సహకరిస్తాయి.

కాని కార్మికుడు తన పనిముట్టును తిరగేసి ఎదురు తిరిగితే....

ప్రెస్ వర్కర్స్, యూనియన్ ఇచ్చే ప్రతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఊరేగింపులో గొంతు చించుకున్నారు- గర్జించిన ఆ కంఠాలను, ఎగిసిపడే ఆ ఎదల్లోని ఆవేశాన్ని కార్మికుల మిలిటెన్సీనంతా తన గొప్పతనంగా పోజుపెట్టి కేంద్ర పార్టీ అభిమానాన్ని సంపాదించి యూనియన్ "బాస్" విదేశయాత్ర చేశాడు. ఆ యాత్రకు చేసుకున్న సన్నాహాల్లో బయటపడ్డాడు- పాపం! అతను 'వెన్నదొంగ' అని.

అతను విదేశయాత్ర ముగించుకొని వచ్చాక ఆ పార్టీ ముఖ్యుడు అతనిపై వచ్చిన అవిశ్వాసాన్ని ఆసరా తీసుకొని, తీవ్రతరంచేసి వర్కర్స్‌ను ఉపయోగించుకున్నాడు. "సెహభాష్ అవకాశవాద రాజకీయాల చిట్టీ!" అని బిరుదంపొంది ఆయనా ఒక విదేశ యాత్ర పోయాడు.

తర్వాత యూనియన్‌లో మరొక మలుపు వచ్చింది. ఆ వెన్నదొంగను, ఆ పార్టీని ఓట్లు లెక్కపెడుతూ కూచొమ్మని ఒక గుడి తోటలో వదలేసింది.

ఈసారి సౌశీల్యము, సుందరము అనుకున్న యూనియన్ కొన్ని ఆర్థిక విజయాలు సాధించింది. కాని తీరాచూస్తే పోయిన నాయకుడు వెన్నదొంగ అయితే, అతని శిష్యుడైన ఈ నాయకుడు 'పాలదొంగ' అని తేలింది. అవుమూడల గడ్డి తింటుంటే పాపం అతన్ని ఆ గొడ్ల కొట్టంలోనే వదిలేసింది.

ఇక్కడ ఈ ట్రేడ్‌యూనియన్ నాయకుల గురించి కొంచెం ఆలోచించాలి. వీళ్ల అసలు కార్మికులను రాజకీయంగా చైతన్యవంతులను చేయుటకు బదులు తమ

స్వార్థ రాజకీయాల్లో పావులుగా వాడుకొని మరింత నిర్వీర్యులనుచేసి నిరాశానిస్పృహాలలో వదిలేశారు. వీళ్ల అసలైన కార్మిక ద్రోహులు.

ప్రెస్ వర్కర్ల జీవితాలంటే దినం దినం చించేసే క్యాలెండర్ కాగితాలయినాయి. ఇప్పటి వరకు జ్ఞాపకం వున్నంతవరకు పరిశీలించిచూస్తే ప్రెస్ కార్మికులు చాలా వరకు టి. బి. తో చచ్చినవారే.

ప్రెస్ వర్కర్లంటే చివరకు టి. బి. వల్ల చస్తారనేది ఖాయమైపోయింది. ఇప్పుడూ ఇంకా ఎంతోమంది ఆ వ్యాధితో పనిచేస్తూనే వున్నారు.

పని చేస్తూచేస్తూ మిషన్లలో పడి చేతులు వేళ్ల పోగొట్టుకొన్నా కంపన్సేషన్ అటుంచి కనీసం వైద్యంకోసంగానీ, ఆ గాయం మానేవరకు పాలకైనా కొంత డబ్బు ఇవ్వకపోవడం పైగా అగాయంతో బాధపడ్తూ ఇంటివద్దవున్న ఆ రోజులను గైర్ హాజరుగా పరిగణించి ఆరోజుల వేతనాన్ని కోతకోయడం జరుగుతున్నది. ఇలా ప్రింటింగ్ మిషన్లలో కటింగ్ మిషన్లలో చేతులు వేళ్ల పోగొట్టుకొని, తమకు తాముగా వేళ్ళుతెగిపోయిన వాళ్ళుగా మిగిలిపోయారు.

ఈ పనివారికి తప్పకుండా కంటిచూపు తగ్గిపోతుందనేది కూడ ఖచ్చితంగా చెప్పవచ్చు. ఇంకా....ఇంకా....

ఇట్లా వ్యాధితో మరణించే ప్రెస్సు కార్మికుల జీవితాల గూర్చి అటు అవకాశ వాద యూనియన్లూ పట్టించుకోవు- ఇటు కామందుల కొమ్ముగాసే ప్రభుత్వానికీ పట్టదు- ఇక యజమాన్ల సంగతి సరేసరి. కనీస వైద్య సౌకర్యాలు ఏవీగూడా లేకుండా దృష్టిని కోల్పోయి, అంగవైకల్యం పొంది, దీర్ఘ వ్యాధులతో కృశిస్తున్న కార్మికుల పట్ల బాధ్యత ఎవరిది?

ఇటువంటి పనిని ప్రభుత్వం ఏ క్యాటగరీలోకి తీసుకుపోయిందో మినిమం వేజస్ చూస్తే తేలిపోతుంది.

ఇవన్నీ, కష్టనిష్టూరాలన్నీ విచారించి, ఇనాములు అడుక్కొని బతికే బానిసలుగా కాక, హక్కులకై పోరాడే క్రమశిక్షణగల నిజమైన కార్మికులుగా నిలబెట్టాలి.

నినాదాల పోరాటం కాదు,
నిజమైన చైతన్యం రావాలి-

—'నారా - శంకర్'

భూపాల్ పాటలు

పాటలే ప్రజాకవిత్వ రూపంగా ఈనాడు ప్రచారం పొందుతున్నాయి. ఈ పాటలు జానపదుల బాణీలో సాగినపుడే కవి ఆశించిన ప్రయోజనం చేకూరుతుంది. చెరబండరాజు, శివసాగర్, గద్దర్, వంగపండు, అంజయ్యల వలె భూపాల్ ఆ బాణీలో మంచి ప్రయత్నమే చేశాడు.

'ఎండలో తనువుకాలి, మాగిన కుండైన' వడ్డెరోళ్ళ బతుకు బాధలను గద్దర్ వినిపిస్తే, 'తాత ముత్తాతల నుంచి, గొర్ల'కాస్తూ, 'తరతరాల నుంచి కడుపు కరిబుగ్గ, ఐన గొల్లోళ్ళ బాధను భూపాల్ వినిపించాడు. గంజినీళ్ళు, తైదంబలి, తైదరొట్టె, పుల్లిగడ్డ తప్ప ఆకలికి వేరెరుగని బతుకులు, గొర్లు కాసి కాసి 'కాయలు గాసిన చేతులు/ గొడ్డలి శిప్పాలాయె / సెప్పుల్లేనీ కాల్లు / ఆనెలు గట్టిపాయె. సమాజంలో రగుల్కొంటున్న చైతన్యం గొల్లోల్ల బతుకుల్లోనూ తొంగి చూసిన ఫలితంగా—

కొడవలి కత్తులు బరిసెలు / గొడ్డలందుకొంటున్రి.

గొల్లోల్ల బతుకులమీద కవి చిత్రించిన ఒక మినీ డాక్యుమెంటరీ 'గొల్ల కుర్మగోత్రం'.

ఈ సంకలనంలోని మరో దృశ్యం 'మూసీనది'. వంగపండు, 'సిక్కోలు కొండల్లోనా .... ఓర్నాయనో / నాయుదొలన పూరుందిరా.... ఓర్నాయనో / ఫక్కీలో సాగిన పాట.

'మూసీనది మురికి నీటిలో .... ఓర్నాయనో
ముష్టి బతుకు ముడివడున్నదా.... ఓర్నాయనో'

మూసీనది ఒడ్డున బతికే 'వ్యర్థ జీవుల యదార్థ దృశ్యాలు' కొంత మందికే తెలుసు. ఇక్కడ బుడ్డగోసి బెస్తవాళ్ళున్నారు. 'ఎంద్రకిచ్చ శాపపిల్ల'లు పట్టుకుంటూ బతుకుతుంటారు. గడ్డి కోసుకొని బతికే వాళ్ళున్నారు. వాళ్ళ పిల్లలు చదువులు చదివికూడా 'ఏటిబండలన్నీ నవ్వ / గడ్డిగోసి మోస్తుండ్రు'. 'ఉన్నోల్ల బట్టలన్నీ మల్లెలోలె తెల్ల' గుతికే సద్ది కూడు సాకలోళ్ళున్నారు. 'నడుముపూస నేల కానగ' కూడా, చచ్చిపోయే స్థితిలో కూడా వెట్టి చాకిరీ తప్పని నిర్భాగ్య సోదరులు వాళ్ళు. 'పువ్వు లేరన్నాడు / అన్నం యిగ నోసుకోని / పువ్వులేరే కూలోళ్ళున్నారు. అయితే యీ బాదల బతుకు యింకెన్నాళ్ళు ?

సద్ది కూడు సాకలోళ్ళురా / ఈ బతుకులింక బతుకమున్నరా / పువ్వులేరే కూలి జనంరా / బియ్యం ధర దించమన్నారా / బుడ్డగోసి బెస్తవాల్లురా / బతుకుదెరువు జూపుమన్నారా/....

ఒక్క అడగటమే చేశారా? అర్జీలే పెట్టుకున్నారా? అడిగింది సాధించడం కోసం—

కొడవలి కుదాళ్ళు ఎత్తిరా / కడుపు కోత కోపంతో / కలిసి పోరాడుతుంద్రు....

ఇందులో 1973' నుంచి 77 దాకా రాసిన పాటలున్నాయి. 'కోడికూసించె', 'అన్ని నరికి సల్లొండా', 'గొల్లకుర్మ గోత్రం', 'పోతడు దోపిడి కొడుకు', 'ఎర్రని చుక్కలకు', 'దాన్నోట్లో మన్నువొయ్య', 'మూసీనది', 'హింస' పాటలు చెప్పుకో దగ్గ మంచి కవితలు.

కమ్మరి కొలిమి / కుమ్మరి చక్రం / జాలరి పగ్గం / సాలెల మగ్గం....ల నుంచి గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి.... దాకా 'శరీర కష్టం స్ఫురింపచేసే సమస్త చిహ్నాలు' యివాళ విప్లవ కవితలో చోటు చేసుకుంటున్నాయి. ఇది తెలుగు కవితా చరిత్రలోనే గర్వించదగ్గ అధ్యాయం. ఈ కవితా విప్లవానికి ప్రేరణ నక్సల్బరీ, శ్రీకాకుళాలు. ఈ పరిణామాన్ని ప్రోత్సహించి ముందుకు తీసుకపోతోంది 'విప్లవ రచయితల సంఘం'.

విరసం సభ్యుడు పోరాటాల పరిటాలను హత్య చేస్తేనేం—
ప్రతి చుక్క నెత్తురు బాకీ / పీడిత వర్గం తీర్చునులే.

ప్రజల కోసం ప్రజాయుద్ధ పంథాలో ఒరిగిన అమర వీరులను సదా స్మృతిలో నిలుపు కోవటం మన కర్తవ్యం. అందుకే 'ఎర్రని చుక్కలకు' గేయంలో కవి 'జనం కంటి వెలుగు'లైన అమర వీరులకు ఒక్కో పువ్వు ద్వారా ఒక్కో సందేశం పంపుతాడు.

రైతు కూలీలనంత / ఖైదీలను చేసినంత / ఆలోచన మారిపోదు / విప్లవ ఝం
ఝూగిపోదు / బలికి తెచ్చిన మేకపిల్లగ/ భయం చెందుతు బొంచెనంటూ—
బతికే రైతన్న నుద్దేశించి—

మనదే సంపద / మనదే న్యాయం / మదీ మాన్యం / మనపే అందాం—
అని గొంతెత్తి నినదించాలని,

వెలుగు పిడికిలి మనసుకంతా / బొంచనను బేడీలు తెంచుక /
అందరొకటిగ అడుగులేయగ/

ముందుకు సాగాలి— ఆ సాగడం

తిన్నాగ సాగెదిక్కు/ సిందూర తూరుపమ్మ....

'వెలుతురునే బంధించి' గేయం కవి ఆత్మ విశ్వాసాన్ని వ్యక్తం చేస్తుంది.

సముద్రానికేత మెత్తి / మేఘాలను అరికట్టా / మీ తరం కాదురా....

సముద్రాని కేత మెత్తడం కూడా వాళ్ళ తరం కాదు.

ఈ సంక్షోభ ప్రజాద్రోహ రాజ్యంలో తాబేలు నాయుడు లాంటి ముసలి రైతు నుంచి మహదేవన్ లాంటి యువకుని వరకు.... కాదు చినబాబు లాంటి పసివాని వరకు క్రూరంగా చంపిన పోలీసు వ్యవస్థ దుర్మార్గపు హింసను తలచుకొన్నప్పుడల్లా, చీము నెత్తురు వున్న ఎవరికైనా, 'ఈ నెత్తుటి బాకీని / నెత్తుటితోనే చెల్లిస్తాం' అని ప్రతీకారం తీర్చుకోవాలని 'హింస' గేయం చెపుతుంది.

వేళ్ళు, కీళ్ళు విరిచి నరికేసి, కండ్లు పీకి కండ కండ కోసినా, పడచులను చెరిచిన 'ప్రజల పాలిటి రాక్షసుల' హింస విప్లవ జననాల్ని ఆపలేదు. ఉదయిస్తున్న 'రెడ్‌సన్స్' యీ హింసను కాలరాచివేయ పిడికిలి ఎత్తి సాగుతున్నారు.

దుర్మార్గపు హింసలను / కాలరాచి వేయండి /
కాలరాత్రి నణచివేసి / వెలుగుబాట లేయండి /

కోలాటం పాట (దచ్చన్న దారిలో) అసంపూర్తి గేయం సమగ్రత సంతరించు కోలేక పోయింది. రచయిత అశ్రద్ధ కారణం అనుకుంటాను.

'ఏమిచేద్దును' గేయంలో, రోజువారి బతుకుతో విసిగివేసారిపోయిన స్త్రీ—

'ఈ బతుకెన్నాళ్ళు / నాతోటి ఇగగాదు /
మంచికో చెడ్డకో / తెగబడి నడువాలె /....

అనుకుంటుంది. ఈ తెగబడటం నిరాశా నిస్పృహల్లోంచి వచ్చిన ఆలోచనే తప్ప సామాజిక తిరుగుబాటు ఫలితంగా వచ్చిన చైతన్య పూరితమైన నిర్ణయంకాదు. ఇలాంటి వాళ్ళు ఎంత త్వరగా నిర్ణయాలకొస్తారో, అంత త్వరగా వెనుతిరిగిపోతారు. కథలలో లాగే, గేయాలలో కూడా తీసుకున్న ఇతివృత్తం సమగ్రంగా వుండాలి. తిరుగబడే పాత్రల సామాజిక పునాది, పరిణామ దశలు, వాటి పర్యవసానంగా వచ్చే ముగింపు కృతకంగా వుండకూడదు. అందుకే యిది యీ సంకలనంలో యిముడని పాటఅయింది.

భూపాల్ గొట్టు పదాల జోలికి పోకుండా, గద్దర్ రాస్తాలో మంచి పాటలు రాశాడు. అయితే అక్కడక్కడ రచన ఉత్తవచనంలా మారిపోయింది. పాత భావాలనే కొత్త రచయితలు కొత్త రూపంలో చాలా బలంగా చెబుతున్న యీ రోజుల్లో, ఆ ప్రయత్నం భూపాల్‌లో తక్కువగా కనపడుతోంది. వ్యవసాయిక విప్లవంలో పాలు

పంచుకోవాల్సిన రైతాంగానికి నాయకత్వం వహించాల్సిన కార్మికవర్గాన్ని కూడా వుత్తేజపరిచేలా వాళ్ళ బతుకు కడగండ్లని కళ్ళకు గట్టేలా (గద్దర్ 'గ్యాంగోళ్ళమండి మేం బాబు', వంగపండు 'యంత్రమెట్లా నడుస్తుంది') చిత్రించడంతోపాటు వర్గపోరు హోరులో మార్చింగ్ చేస్తున్న శ్రామికవర్గ పదధ్వనుల్ని కూడా భూపాల్ కవిత్వంలో రికార్డు చేయాల్సివుంది.

భూపాల్ పాటలు పరిచయం చేస్తూ వర్గీస్ చెప్పినట్లు 'ఇప్పుడు భూపాల్ చేయాల్సినపని పూర్తిగా ప్రజల బాణీలో మాత్రమే రాయడం, జీవితాన్ని మరింత కళాత్మకంగా (రాజకీయంతో సంబంధించి) చిత్రించడం.'

'దానికి బీజాలు ఈ పుస్తకంలోనే' వున్నమాట నిజం. 'జననాట్య మండలిలో గద్దర్ ప్రక్కన పనిచేసిన (చేస్తున్న) అనుభవంతో భూపాల్ మరిన్ని పాటలు, రూపకాలు సృష్టిస్తాడ'ని ఆశిద్దాం. 'ప్రజల బాణీలలో ప్రజల భాషలో అతని కొత్తపాటల కోసం' వర్గీస్‌తోపాటు మనం కూడ ఎదురు చూద్దాం. ఇంత జీవకళతో అందమైన గెటప్‌తో వచ్చిన (ముద్రణపరంగా) పాటల పుస్తకాలు అరుదు.

— శ్రీ

భూపాల్ పాటలు : ప్రతి 1 50 పై.

దొరుకు చోటు: 1. సృజన, హన్మకొండ, వరంగల్

2. దేశీ బుక్ హౌజ్, నారాయణగూడ, హైదరాబాద్

రచన - భాష చర్చ :

విప్లవ భావప్రచారానికి మాండలిక భాషారచనలు అవసరమా?

ఇటీవల చాలా రోజులుగా నాలో ఈ అంశంపై ఆలోచనలు చెలరేగుతున్నాయి. ముఖ్యంగా సృజనలోను మిగత పత్రికల్లోను అల్లం రాజయ్య మరి కొందరు రాస్తున్న కథలు, నవలలు చదివింతర్వాత ఈ విషయంలో మిత్రుల్తో చాల మందితో చర్చించాను. 1979 మే నెల సృజనలో కె. రాంమోహనరాజుగారి వ్యాసం 'రచన - భాష' చదివింతర్వాత నా భావాలు కొన్నింటిని వెల్లడించ దలచాను.

తెలంగాణా మాండలికంలో నవలా ప్రక్రియ దాశరథి రంగాచార్య, పోరంకి దక్షిణామూర్తిగార్లు యిదివరకే చేశారు. కన్యాశుల్కం నాటకంలోను, రా.వి. శాస్త్రి రచనలోను విశాఖ మాండలికం చోటు చేసుకొంది.

ప్రస్తుతం అల్లం రాజయ్య తెలంగాణా మాండలికాన్ని తన స్వంతం చేసుకొని, నవలలు, కథలురాస్తూ, తెలంగాణా గ్రామీణ జీవితాన్ని సజీవంగా చిత్రించ గలుగుతున్నందుకు వారినభినందిస్తున్నాను.

కానీ, విప్లవభావ ప్రచారానికి ఈ మాండలిక భాషా రచనలు అంతఅవసరమా? అంటే కాదనే చెప్పాలి. మాండలికంలో రచనలు చేయాలని పూనుకొన్న రచయితకు భాషపైన పూర్తి అధికారం లేకపోతే అది కృత్రిమంగా తయారౌతుంది. రచయిత భాషమీద శ్రద్ధ చూపడం వల్లభావం దెబ్బతినే ప్రమాదం వుంది.

ఏ ఏ ప్రాంత రచయితలు ఆయా భాషల్లో అచ్చటి వాస్తవికతల్ని ప్రతిబింబించే రచనలు చేయడం వల్ల, ఆ నవలలు, కథలు ఆప్రాంత ప్రజలకు చదివి వినిపించడానికి, వారిలో విప్లవ చైతన్యం కలిగించి, జరుగుతున్న అన్యాయాలపై వారు పోరాడేందుకు దోహదం చేస్తుందని ఓ వాదం వుంది.

కానీ, యిది పూర్తిగా నిజం కాదు. ప్రస్తుతం వ్యావహారిక భాషగా వ్యవహరించబడుతున్న భాష సినిమాల ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు మారుమూల పల్లెలకు కూడా వ్యాపించింది.

రచయితల్లో ఎక్కువ మంది మధ్యతరగతి పట్టణవాసులు. వీరికి వ్యవహారిక భాషపైనున్న పట్టు మిగత మాండలిక భాషలపై లేదు. వీరు మాండలిక భాష పుస్తకాల ద్వారా అధ్యయనం చేసి, రచనలు చేసినా అవి కృత్రిమంగా తయారౌతాయి.

ఇక పాఠకుడి సంగతి- మామూలు రచనల్ని చదివేందుకు అలవాటుపడ్డ సగటు పాఠకుడు ఈ ప్రాంతీయ రచనలు చదవడానికి ఇబ్బంది పడతాడు. మరీ చదవాలని పట్టుదల వున్నవాడు తప్పించి, శ్రమపడి దాన్ని చదవడానికి ప్రయత్నించడు. గ్రామాల్లో ప్రజల వద్దకు వెళ్ళి నిరక్షరాస్యులకు చదివి వినిపించడానికి యిది ఏ ప్రాంత భాషో ఆప్రాంతానికి తప్పించి మిగత ప్రాంతాలకు ఉపయోగపడదు.

గ్రాంధిక భాషలో రచనలు చేయడం వల్ల అవి అటు రచయితకు, యిటు పాఠకుడికి చాలా యిబ్బందికరంగా వుండేవి. అలాగే ఆ గ్రాంధిక భాషా రచనలు కేవలం కొంత మంది పాఠకులకే పరిమితమైపోయేవి.

ఈ మాండలిక భాషా రచనలు కూడా విస్తృత పరిధిని కోల్పోయి, కేవలం ఆ ప్రాంతీయ ప్రజలకే పరిమితంగా మిగిలిపోతాయి. విప్లవ భావ ప్రచారం విస్తృతం కావాలనే రచయిత ఆశయం భాష వల్ల దెబ్బతింటుంది.

ఈనాడు గ్రామీణ ప్రజల కష్టాలు, వారిపై దోపిడీ శక్తుల ప్రాబల్యం దేశంలో ఏ ప్రాంతంలోనైనా ఒకే విధంగా వుంది. వారిలో విప్లవ చైతన్యం కలిగించడానికి గ్రామాలకు వెళ్ళే కార్యకర్తలు వ్యవహారికంలోని రచనలనే చదివి వారికి అర్థమయ్యేట్లుగా చెప్పొచ్చు.

పాటల సంగతి వేరు. అవి భాషకన్నా, గాయకుడి కంఠం భావాల్ని ప్రస్ఫుటం చేయడంపై ఆధారపడి వుంటుంది. అందుకే గద్దర్ పాటలు తెలంగాణా భాషలోనివైనా రాయలసీమలో ప్రతి గ్రామంలోను, సర్కారు జిల్లాల్లోను ప్రజల్ని ఆకట్టుకొన్నాయి.

ముఖ్యంగా కథలు, నవలలు రాసే రచయితలు ప్రాంతీయ భాషలో రాయాలనే తపన మానాలి. ఈ చాదస్తానికి లోబడకపోవడం ఆరోగ్యకరం.

అల్లం రాజయ్యగారి 'కొలిమంటుకున్నది' నవల చాల మంది చదవక సృజనలో పేజీలు తిప్పేస్తున్నారు. కారణం కేవలం భాష అర్థం కాకపోవడమే.

కాబట్టి విప్లవ భావ ప్రచారం దృష్టిలో పెట్టుకొని విప్లవ రచయితలు తమ రచనల్ని ఒక ప్రాంతానికి పరిమితం చేయకుండా, విస్తృత పరిధిలో ప్రజలు చదివేలాగా రచనలు చేయాలి.

– ముదార్ వేణు

విరసం సభ్యులకు కార్యదర్శి విజ్ఞప్తి

విప్లవ రచయితల సంఘం 7వ మహాసభలు తిరుపతిలో సెప్టెంబరు 29 నుంచి వరసగా మూడు రోజులు జరుగుతాయి.

1. కవిత్వం 2. సాహిత్య విమర్శ 3. కథ–నవల 4. నాటిక–నాటకం 5. పత్రికలు, సినీమా, రేడియో, టి.వి. – యిలా వేర్వేరు విభాగాలుంటాయి. సభ్యులు కేవలం శ్రోతలుగా వుండిపోక, చర్చల్లో పాల్గొనేలా తమతమ అభిమాన రంగాలను బట్టి ఆయా విభాగాలలోనే ఉంటారు. ముందు ఒకరు చర్చను ప్రారంభిస్తారు. తక్కిన వారు నిర్ధారణ చేస్తారు. దీన్ని చివరిరోజు ఉదయం సర్వసభ్య సమావేశానికి నివేదించడానికి నివేదకులు ఉంటారు.

కవిత్వం గురించి కె.వి. రమణారెడ్డి (11-33-957, కావలి-2), విమర్శ గురించి మధుసూదనరావు (7 రాంనగర్, తిరుపతి), కథ-నవల గురించి వరవరరావు (సృజన, హన్మకొండ, వరంగల్-1), నాటకం గురించి చెరబండరాజు (2-2-899, అంబర్‌పేట, హైదరాబాదు-13), పత్రికలు వగైరాల గురించి వై. కాశీపతి (21/306 ఓల్డ్ టౌన్, అనంతపురం) చర్చ ప్రారంభిస్తారు. కాబట్టి వి.ర.సం. సభ్యులు తమ అభిమానాన్నీ ప్రవేశాన్నీ బట్టి వీరిలో ఒకరికి తమ పేర్లను వెంటనే తెలియపరచాలి.

కావలి, 29.6-79

కె.వి. రమణారెడ్డి, విరసం కార్యదర్శి

SRJANA Telugu Monthly   Aug. '79   H/WL-10

Regd. No. with Registrar of News Papers 10953/67

విప్లవ రచయితల సంఘం, 7వ మహాసభలు

1979 సెప్టెంబరు 29, 30 - అక్టోబరు 1

తిరుపతి

ఆంధ్ర ప్రదేశ్ విప్లవ రచయితల సంఘం 7వ మహాసభలు సెప్టెంబరు 29, 30 అక్టోబర్ 1వ తేదీల్లో తిరుపతిలో జరుగుతాయి. ఈ మూడు రోజుల్లోనూ కవిత్వం, నవల, కథ, నాటకం, సాహిత్య విమర్శ, సినిమా, రేడియో, టెలివిజన్‌ల మీద గోష్ఠి జరుగుతుంది. అక్టోబర్ 1వ తేది బహిరంగసభ వుంటుంది. సాహిత్య అభిమానులు విరివిగా పాల్గొని, విరాళాలు యిచ్చి సహకరించ వలసిందిగా కోరుతున్నాం.

16/86, నేతాజీరోడ్డు
తిరుపతి

శివారెడ్డి
కార్యదర్శి, ఆహ్వాన సంఘం

SRJANA   Rs. 1-50

Hanumakonda, Warangal 506001